www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 31-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 45 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: పంచమి రా.8.16 తదుపరి షష్ఠి, నక్షత్రం: పుష్యమి రా.9.07 తదుపరి ఆశ్లేష వర్జ్యం: శేషం ఉ. 6.56 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.43-7.27, అమృతఘడియలు: మ.2.48-4.23, రాహుకాలం: ఉ. 9.00-ఉ.10.30, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్

మార్కెట్ మళ్లీ నష్టాల్లోకి

ముంబై: స్టాక్‌మార్కెట్ వారాంతం రోజున మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలను అమెరికా అప్పీల్ కోర్టు పాక్షికంగా పునరుద్ధరించడంతో మరోసారి వాణిజ్య అస్థిరతలు ఏర్పడడం, ఐటీ షేర్లలో నష్టాలు మార్కెట్‌ను పతన బాటలోకి నడిపాయి. జీడీపీ గణాంకాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తం కావడం కూడా ఇందుకు కారణమని విశ్లేషకులంటున్నారు. శుక్రవారం పూర్తిగా ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 182.01 పాయింట్లు నష్టపోయి 81,451.01 వద్ద ముగియగా నిఫ్టీ 82.90 పాయింట్ల నష్టంతో 24,750.70 వద్ద క్లోజైంది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 270.07 పాయింట్లు, నిఫ్టీ 102.45 పాయింట్లు నష్టపోయాయి.

అర్షద్ వార్సీపై సెబీ నిషేధం: సాధనా బ్రాడ్‌కాస్ట్ షేర్లను కొనుగోలు చేయాలంటూ యూట్యూబ్‌లో ఇన్వెస్టర్లను తప్పుదారి పట్టించే వీడియోలు పోస్ట్ చేసినందుకు బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ, అయన భార్య మరియా గొరెట్టి, మరో 57 సంస్థలను సెక్యూరిటీ మార్కెట్ నుంచి 1 నుంచి 5 సంవత్సరాల పాటు సెబీ నిషేధించింది. దీనికి తోడు వార్సీ, మరియాలపై ఒక్కొక్కరికి రూ.5 లక్షల జరిమానా విధించింది. మిగతా 57 సంస్థలపై రూ.5 లక్షల నుంచి రూ.5 కోట్ల మధ్యలో జరిమానా విధించింది. ఈ లావాదేవీ ద్వారా అక్రమంగా ఆర్జించిన రూ.58.01 కోట్లు 12 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని వార్సీ, మరియాలతో పాటు 57 సంస్థలను కూడా ఆదేశించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

31వ తేదీ


హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	105
విశాఖపట్నం	106	అనంతపురం	105
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,310 ▲	89,200 ▲	1,10,900 ▼
విజయవాడ	98,300 ▲	92,000 ▼	1,00,000 ▲
విశాఖపట్నం	98,340 ▼	89,200 ▲	1,10,900 ▼
రాజమండ్రి	97,310 ▲	89,200 ▲	99,900 ▼
ప్రొద్దుటూరు	95,600 ▲	87,950 ▲	98,700 ▼
ముంబై	95,355 ▲	87,345 ▼	97,458 ▼



జీడీపీ వృద్ధి 6.5%

క్యూ4లో 7.4 శాతంగా నమోదు ● రూ.330 లక్షల కోట్లకు ఎకానమీ

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25) నాలుగో త్రైమాసికం (క్యూ4)లో జీడీపీ వృద్ధి రేటు మార్కెట్ అంచనాలను మించి ఏడాది గరిష్ఠ స్థాయి 7.4 శాతానికి పెరిగింది. ప్రైవేట్ వినియోగం పుంజుకోవడంతో పాటు నిర్మాణం, తయారీ రంగాలు మంచి పనితీరును కనబర్చడం ఇందుకు దోహదపడింది. క్యూ4 వృద్ధి దన్నుతో 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి జీడీపీ వృద్ధి 6.5 శాతంగా నమోదైంది. ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి, 2023-24 వృద్ధి రేటు 9.2 శాతంతో పోలిస్తే బాగా తగ్గినప్పటికీ, ఈ ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం అంచనా వేసిన స్థాయిలోనే ఉంది. అంతేకాదు, చైనాతో పోలిస్తే భారత్ మెరుగైన స్థితిలో ఉంది. ఈ జనవరి-మార్చిలో చైనా జీడీపీ వృద్ధి 5.4 శాతమే. వార్షిక, త్రైమాసిక వృద్ధిపరంగా ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. వరుసగా నాలుగేళ్లుగా భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో కెల్లా అధిక వృద్ధిని నమోదు చేస్తోంది.

ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం రూ.330.68 లక్షల కోట్లకు (3.9 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. తద్వారా ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో 6.3-6.8 శాతం వృద్ధి రేటుతో భారత్ జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశాలున్నాయి. మరికొన్నేళ్లలో భారత ఎకానమీ సైజు 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా.

వృద్ధి గణాంకాలు ఇలా..

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీడీపీ లేదా స్థిర (2011-12 నాటి) ధరల ఆధారిత జీడీపీ రూ.187.97 లక్షల కోట్లకు పెరిగిందని అంచనా. 2023-24లో నమోదైన రూ.176.51 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 6.5 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, 2024-25లో నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ రూ.330.68 లక్షల కోట్లకు ఎగబాకింది. 2023-24లో నమోదైన రూ.301.23 లక్షల కోట్ల నామినల్ జీడీపీతో పోలిస్తే 9.8 శాతం వృద్ధి చెందింది. 2024-25 క్యూ4 విషయానికొస్తే, వాస్తవ జీడీపీ లేదా స్థిర ధరల ఆధారిత జీడీపీ వార్షిక ప్రాతిపదికన 7.4 శాతం వృద్ధితో రూ.51.35 లక్షల కోట్లకు చేరగా.. నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ 10.8 శాతం వృద్ధితో రూ.88.18 లక్షల కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీవీఏ (జోడించిన స్థూల విలువ)ను ఎన్ఎస్ఓ రూ.171.87 లక్షల కోట్లుగా అంచనా వేసింది. 2023-24లో ఈ అంచనా రూ.161.51 లక్షల కోట్లుగా ఉంది.

2024-25 నామినల్ జీవీఏను రూ.300.22 లక్షల కోట్లుగా అంచనా వేసింది. 2023-24లో ఇది రూ.274.13 లక్షల కోట్లుగా ఉంది. కాగా, ఈ జూన్‌తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికం (క్యూ1) జీడీపీ వృద్ధి గణాంకాలను ఎన్ఎస్ఓ ఈ ఆగస్టు 29న విడుదల చేయనుంది.

త్రైమాసికాల వారీగా జీడీపీ వృద్ధి (%)	
ఏప్రిల్-జూన్ (క్యూ1)	6.5
జూలై-సెప్టెంబరు (క్యూ2)	5.6
అక్టోబరు-డిసెంబరు (క్యూ3)	6.4
జనవరి-మార్చి (క్యూ4)	7.4
2024-25 ఆర్థిక సంవత్సరం	6.5

తలసరి ఆదాయం రూ.1,14,710

నికర జాతీయ ఆదాయం ప్రకారంగా, గత ఆర్థిక సంవత్సరంలో దేశ ప్రజల తలసరి ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.4 శాతం పెరిగి రూ.1,14,710కి చేరింది. 2023-24లో ఇది రూ.1,08,786గా ఉంది. కాగా, 2024-25లో నికర జాతీయ ఆదాయం రూ.1,61,51,199 కోట్లుగా నమోదైంది.

4.8% లక్ష్యం మేరకు ద్రవ్య లోటు కట్టడి

గత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును జీడీపీలో 4.8 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం సాధించింది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. 2024-25 ద్రవ్య లోటు రూ.15,77,270 కోట్లుగా నమోదైంది. ఈ ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంచనా వేసిన రూ.15,69,527 కోట్లకు దరిదాపుల్లోనే ఉంది. గత ఆర్థిక సంవత్సరం కేంద్రానికి రూ.30.36 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని, బడ్జెట్ అంచనాల్లో ఇది 98.3 శాతమని సీజీఏ తెలిపింది. వ్యయాలు రూ.46.55 లక్షల కోట్లకు పెరిగాయని, బడ్జెట్ అంచనాల్లో ఇది 98.7 శాతమని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు జీడీపీలో 5.63 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఆదాయం, వ్యయాల మధ్య అంతరాన్ని ద్రవ్య లోటు అంటారు. మార్కెట్ నుంచి రుణాల సమీకరణ ద్వారా ప్రభుత్వం ఈ లోటును భర్తీ చేస్తుంది.

రంగాలవారీగా వాస్తవ స్థూల విలువ జోడింపు(%)

	పూర్తి ఆర్థిక సంవత్సరం		నాలుగో త్రైమాసికం	
రంగం	2024-25	2023-24	2024-25	2023-24
వ్యవసాయ సంబంధిత రంగాలు	4.6	2.7	5.4	0.9
మైనింగ్ అండ్ క్వారీయింగ్	2.7	3.2	2.5	0.8
మాన్యుఫ్యాక్చరింగ్	4.5	12.3	4.8	11.3
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవలు	5.9	8.6	5.4	8.8
నిర్మాణం	9.4	10.4	10.8	8.7
వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్	6.1	7.5	6.0	6.2
ఆర్థిక సేవలు, రియల్టీ, వృత్తి నైపుణ్య సేవలు	7.2	10.3	7.8	9.0
ప్రజా పాలన, రక్షణ, ఇతర సేవలు	8.9	8.8	8.7	8.7

"ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు అన్నింటిలో కెల్లా భారత్ అధిక వృద్ధిని నమోదు చేయడం వరుసగా ఇది నాలుగో ఏడాది. తయారీ, సేవలు, వ్యవసాయ రంగాల పనితీరు ఇందుకు తోడ్పడింది. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో తయారీ రంగం పనితీరు బాగుంది. దాంతో ఆ త్రైమాసిక జీడీపీ కూడా 7.4 శాతానికి ఎగబాకింది. ఈ సందర్భంగా చిన్న, మధ్య, భారీ పరిశ్రమలకు ధన్యవాదాలు తెలుపుతున్నా."

-నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి

నాలుగేళ్లలో రూ.8,000 కోట్ల పెట్టుబడులు

- క్యూ4 లాభం రూ.390 కోట్లు
- ఒక్కో షేరుకు రూ.10 తుది డివిడెండ్
- అపోలో హాస్పిటల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్.. వచ్చే మూడు నుంచి నాలుగేళ్ల కాలంలో రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పెట్టుబడులతో దేశవ్యాప్తంగా కొత్తగా 4,300 పడకలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది. కొత్త హాస్పిటల్స్ ఏర్పాటు సహా ప్రస్తుత హాస్పిటల్స్ విస్తరణ ద్వారా ఈ అదనపు పడకలను చేర్చుకోనున్నట్లు అపోలో హాస్పిటల్స్ పేర్కొంది. ఇప్పటికే తొలి దశలో 2,000 పడకల ఏర్పాటుకు సంబంధించిన పనులు సాగుతున్నాయని పేర్కొంది. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ హాస్పిటల్స్ విస్తరణ ద్వారా 160 పడకలు చేర్చుకోవటంతో పాటు గచ్చిబౌలిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్‌తో హైదరాబాద్‌లో మొత్తం పడకల సంఖ్య 1,400కు చేరుకోనుందని తెలిపింది. అలాగే బెంగళూరులో 200 పడకల సామర్థ్యం గల హాస్పిటల్ కొనుగోలుతో పాటు కొత్త హాస్పిటల్ ఏర్పాటుతో మొత్తం పడకల సంఖ్య 1,500కు చేరుకోనుందని పేర్కొంది. మరోవైపు పుణె, కోల్‌కతా, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో నెలకొల్పుతున్న హాస్పిటల్స్ కూడా ఈ ఏడాది అందుబాటులోకి రానున్నాయని తెలిపింది.

క్యూ4 ఆదాయం రూ.5,592 కోట్లు: మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో అపోలో హాస్పిటల్స్ రూ.5,592 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.390 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.254 కోట్లు)తో పోల్చితే లాభం 54 శాతం వృద్ధి చెందగా ఆదాయం (రూ.4,944 కోట్లు) 13 శాతం పెరిగింది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.10 తుది డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

- ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్‌తో కలిసి ప్రారంభించిన ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించినట్లు ఐటీసీ లిమిటెడ్ ప్రకటించింది. గత ఏడాది అక్టోబరులో అయోడిన్ లోపంతో వచ్చే వ్యాధుల (ఐడీడీ)పై చైతన్యం కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని 30 జిల్లాల్లో దీన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా 7.5లక్షల మందికి ప్రయోజనం చేకూరిందని వెల్లడించింది.
- హైదరాబాద్‌లో జావా యెజ్డీ, బీఎస్ఏ మోటార్‌సైకిల్స్ తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా పటాన్‌చెరు, కొంపల్లిల్లో కొత్త షోరూమ్స్‌ను ప్రారంభించింది. దీంతో హైదరాబాద్‌లో కంపెనీ షోరూమ్‌ల సంఖ్య 8కి చేరింది.
- ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ ఫైన్స్ పేరుతో సరికొత్త బటర్ కుకీస్ బిస్కట్స్‌ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి తీసుకువచ్చింది. కుకీస్ ప్రేమికుల కోసం ప్రత్యేకమైన రుచితో వీటిని తయారు చేసినట్లు వెల్లడించింది. 44, 128 గ్రాముల్లో అందుబాటులో ఉండనున్న వీటి ధరలు వరుసగా రూ.10, రూ.35గా ఉన్నాయి.
- ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్) మార్కెట్లోకి ప్రపంచ స్థాయి కలర్- కోటెడ్ ఉత్పత్తులు ఆప్టిగల్ ప్రైమ్, ఆప్టిగల్ పినాకిల్ తీసుకువచ్చింది. ఈ ఉత్పత్తులపై 15, 25 ఏళ్ల వారంటీని అందిస్తోంది. నిర్మాణ, మౌలిక సదుపాయాల రంగాల అవసరాలను ఈ స్పెషలైజ్డ్ స్టీల్ ఉత్పత్తులు తీరుస్తాయని తెలిపింది.

స్పోర్ట్స్

శతక్కొట్టిన కరుణ్ నాయర్



ఇండియా 'ఎ' 409/3 — ఇంగ్లండ్ లయన్స్‌తో అనధికార టెస్ట్

కాంటర్‌బరీ: ఇంగ్లండ్ లయన్స్‌తో అనధికార టెస్ట్ తొలి రోజే కరుణ్ నాయర్ (186 బ్యాటింగ్) శతక్కొట్టాడు. శుక్రవారం ప్రారంభమైన ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో కరుణ్‌తో పాటు సర్ఫరాజ్ ఖాన్ (92), ధ్రువ్ జురెల్ (82 బ్యాటింగ్) చెలరేగారు. దాంతో తొలి రోజు ఆఖరికి మొదటి ఇన్నింగ్స్‌లో ఇండియా 'ఎ' 409/3 పరుగులు చేసింది. టాస్ కోల్పోయి ఇండియా 'ఎ' బ్యాటింగ్ చేపట్టగా యశస్వీ జైస్వాల్ (24), అభిమన్యు ఈశ్వరన్ (8) విఫలమయ్యారు. ఆనక నాయర్, సర్ఫరాజ్ మూడో వికెట్‌కు 181 పరుగులు జోడించి ఆదుకున్నారు. తర్వాత జురెల్‌తో కలిసి కరుణ్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 177 పరుగులు జత చేశాడు.

నెంబర్‌వన్‌ను చిత్తుచేసి.. సెమీస్‌కు సాత్విక్ జోడీ

సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్



సింగపూర్: డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి ఈ సీజన్‌లో తొలి టైటిల్ దిశగా ముందడుగు వేసింది. సింగపూర్ ఓపెన్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంక్ జోడీని చిత్తుచేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 27వ ర్యాంకరైన భారత ద్వయం 21-17, 21-15తో గో జీ ఫీ/నూర్ ఇజుద్దీన్ (మలేసియా)పై గెలుపొందింది. భారత జంట సెమీస్‌లో మలేసియాకే చెందిన మూడో సీడ్ ఆరోన్ చియా/సో వూయి యిక్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

నందినికి పసిడి

గుల్వీర్, పూజకు కూడా.. ● ఆసియా అథ్లెటిక్స్



గుమి (దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల స్వర్ణ సంబరం కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన పోటీల్లో ఏకంగా ముగ్గురు అథ్లెట్లు పసిడి పతకాలు కొల్లగొట్టారు. తెలుగమ్మాయి అగసర నందిని మహిళల హెప్టాథ్లాన్ (5941 పాయింట్లు)లో విజేతగా నిలిచింది. ఈ క్రమంలో సోమా బిశ్వాస్ (2005), స్వప్నా బర్మన్ (2017) తర్వాత ఆసియా అథ్లెటిక్స్‌లో స్వర్ణం నెగ్గిన మూడో భారత మహిళా హెప్టాథ్లెట్‌గా నందిని రికార్డుకెక్కింది. ఇక గుల్వీర్ సింగ్.. 5,000 మీటర్ల రేసులో చాంపియన్‌గా నిలిచి తన ఖాతాలో రెండో పసిడి వేసుకున్నాడు. ఇక, హైజంప్‌లో పూజా సింగ్ (1.89 మీ) లంఘించి బంగారు పతకం దక్కించుకుంది. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పారుల్ చౌదరి రజతానికి పరిమితమైంది. పురుషుల 4x100 మీటర్ల రిలే ఈవెంట్‌లో భారత జట్టు సభ్యుల్లో ఒకరు ఫౌల్ చేయడంతో టీమ్ అనర్హతకు గురైంది. ఇక 200 మీటర్ల రేసులో తెలుగమ్మాయిలు జ్యోతి యర్రాజీ, నిత్య గంధె ఫైనల్‌కు దూసుకెళ్లారు. టోర్నీలో భారత్ ఇప్పటిదాకా మొత్తం 18 పతకాలు (8 స్వర్ణాలు, 7 రజతాలు, 3 కాంస్యాలు) సాధించింది. పోటీలకు ఆఖరిరోజైన శనివారం భారత్ ఖాతాలో మరిన్ని పతకాలు చేరే అవకాశముంది.

వీర జవాన్లకు అంకితం..

"నేను ఈ పోటీల్లో పతకం గెలవడానికి మన త్రివిధ దళాలు ఇచ్చిన స్ఫూర్తే కారణం. దేశ సరిహద్దుల్లో వారు ప్రాణాలను పణంగా పెట్టి రక్షణ కల్పించడం వల్లే మనమంతా క్షేమంగా ఉన్నాం. ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన భారత వీర జవాన్లకు ఈ పతకం అంకితం."

- అగసర నందిని

ముంబై ముందుకు

- క్వాలిఫయర్-2కు అర్హత
- రోహిత్ హాఫ్ సెంచరీ
- పోరాడిన సాయి సుదర్శన్

గుజరాత్ ఇంటికి



2 — ఐపీఎల్‌లో ఎక్కువ సిక్సర్లు (302) బాదిన రెండో బ్యాటర్‌గా రోహిత్. గేల్ (357) తొలి స్థానంలో ఉన్నాడు.

ముల్లన్‌పూర్: ఆల్‌రౌండ్‌షోతో చెలరేగిన ముంబై ఇండియన్స్ క్వాలిఫయర్-2కి అర్హత సాధించింది. బ్యాటర్లు కలిసికట్టుగా కదం తొక్కడంతో పాటు బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బతీశారు. దీంతో శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో 20 పరుగుల తేడాతో గెలిచింది. తద్వారా ఆదివారం పంజాబ్‌తో పోరుకు సిద్ధమైంది. ఇందులో గెలిచిన జట్టు బెంగళూరుతో ఫైనల్లో తలపడుతుంది. ఇక భారీ ఛేదనలో సాయి సుదర్శన్ (49 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో 80) అద్భుతంగా పోరాడినా అతడికి పెద్దగా సహకారం అందలేదు. లీగ్ ఆరంభం నుంచి దాదాపు టేబుల్ టాపర్‌గానే కొనసాగిన టైటాన్స్ చివరకు ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించక తప్పలేదు. ముందుగా ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 228 పరుగులు చేసింది. రోహిత్ (50 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 81), బెయిర్‌స్టో (22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 47), సూర్యకుమార్ (20 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 33) వేగంగా ఆడారు. ప్రసిద్ధ్, సాయి కిశోర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 208 పరుగులు చేసి ఓడింది. సుందర్ (48), రూథర్‌ఫోర్డ్ (24) ఓ మాదిరిగా ఆడారు. బౌల్ట్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రోహిత్ నిలిచాడు.

చివర్లో తడబాటు: భారీ ఛేదనలో గుజరాత్‌కు తొలి ఓవర్‌లోనే గట్టి ఝలక్ తగిలింది. కెప్టెన్ గిల్ (1)ను పేసర్ బౌల్ట్ ఎల్బీగా వెనక్కి పంపాడు. కానీ మరో ఓపెనర్ సాయి సుదర్శన్ మాత్రం తన పోరాటాన్ని కొనసాగించాడు. కానీ విజయం ఖాయమనుకున్న దశలో కీలక వికెట్లు తీసిన ముంబై బౌలర్లు మ్యాచ్‌ను తమ వైపునకు తిప్పేశారు. ఆరంభంలో సాయి, వన్‌డౌన్ బ్యాటర్ కుశాల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అలాగే పవర్‌ప్లేలో జట్టు 66/1 స్కోరు చేసింది. ఆ వెంటనే స్పిన్నర్ శాంట్నర్ ఓవర్‌లో కుశాల్ హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. అయితే సాయి మాత్రం ఎదురుదాడి ఆపలేదు. ఈ దశలో మ్యాచ్ గుజరాత్ వైపే కనిపించింది. కానీ బుమ్రా 14వ ఓవర్‌లో సూపర్ యార్కర్‌తో సుందర్‌ను బౌల్డ్ చేయడంతో సీన్ మారిపోయింది. అప్పటికి మూడో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. ఆ తర్వాత పేసర్ గ్లీసన్ టైటాన్స్‌కు గట్టి షాక్ ఇస్తూ సుదర్శన్‌ను బౌల్డ్ చేయడంతో టైటాన్స్ చేసేదేమీ లేకపోయింది. దీనికి తోడు బుమ్రా 18వ ఓవర్‌లో 9 పరుగులే ఇవ్వడంతో సమీకరణం మరింత క్లిష్టంగా మారింది. రూథర్‌ఫోర్డ్ (24)ను బౌల్ట్ అవుట్ చేయడంతో చివ రి ఆరు బంతుల్లో టైటాన్స్‌కు 24 పరుగులు అవసరమయ్యాయి. కానీ మూడు పరుగులే రావడంతో ముంబై సంబరాల్లో మునిగింది.

కలిసికట్టుగా..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ధనాధన్ ఆటతీరుతో హోరెత్తించింది. క్రీజులోకి దిగిన ప్రతీ బ్యాటర్ గుజరాత్ బౌలర్లపై ఆధిపత్యం చూపాడు. దీనికి తోడు వారి ఫీల్డింగ్ వైఫల్యం కూడా కలిసివచ్చింది. రికెల్టన్ స్థానంలో బరిలోకి దిగిన ఓపెనర్ బెయిర్‌స్టో తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. మరో ఓపెనర్ రోహిత్ నిలకడగా కొనసాగాడు. చివర్లో హార్దిక్ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో భారీ స్కోరు సాధ్యమైంది. వాస్తవానికి రోహిత్ మూడు పరుగుల వద్ద ఉన్నప్పుడు కొట్జీ సులువైన క్యాచ్‌ను వదిలేశాడు. అలాగే 12 పరుగుల వద్ద కీపర్ కుశాల్ కూడా అందుకోలేకపోయాడు. అటు బెయిర్‌స్టో నాలుగో ఓవర్‌లో 6,4,6,6,4తో 26 పరుగులు రాబట్టాడు. ఇక ఆరో ఓవర్‌లో రోహిత్ 6,4,4తో పవర్‌ప్లేలో జట్టు 79 పరుగులు సాధించింది. బెయిర్‌స్టో జోరుకు ఎనిమిదో ఓవర్‌లో స్పిన్నర్ సాయికిశోర్ బ్రేక్ వేశాడు. సుదర్శన్ డైవ్ చేస్తూ క్యాచ్ అందుకోవాలనుకున్నా ఆ బంతి లక్కీగా పక్కనే ఉన్న కొట్జీ చేతుల్లో పడింది. దీంతో తొలి వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత స్పిన్నర్లు రషీద్, సాయి ఓవర్లలో రోహిత్ బౌండరీలతో ధాటిని కొనసాగించగా.. సూర్య సైతం కొట్జీ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదాడు. అదే ఓవర్‌లో సూర్య క్యాచ్‌ను కీపర్ కుశాల్ వదిలేశాడు. కానీ 13వ ఓవర్‌లో స్వీప్ షాట్‌కు వెళ్లి సూర్య అవుటయ్యాడు. అప్పటికే రెండో వికెట్‌కు 59 పరుగులు జత చేరాయి. అనంతరం డెత్ ఓవర్లలో వరుసగా రోహిత్, తిలక్ (25), నమన్ (9) వికెట్లను కోల్పోయినా.. చివరి ఓవర్‌లో కెప్టెన్ హార్దిక్ (22 నాటౌట్) మూడు సిక్సర్లతో 22 పరుగులు రాబట్టి స్కోరును 220+ దాటించాడు.

ఫ్రెంచ్ ఓపెన్



సబలెంక

ప్రీక్వార్టర్స్‌లో సబలెంక, స్వియటెక్

పారిస్: టాప్ సీడ్ సబలెంక, డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్ ఫ్రెంచ్ ఓపెన్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో సబలెంక 6-2, 6-3తో డానిలోవిచ్‌ను చిత్తు చేసింది. ఇక స్వియటెక్ 6-2, 7-5తో క్రిస్టియన్‌ని ఓడించింది. నాలుగో సీడ్ పోలిని 6-4, 6-1తో యులియాపై, ఎనిమిదో సీడ్ జెంగ్ 6-3, 6-4 విక్టోరియాపై, రిబకినా 6-2, 6-2తో ఓస్టాపెంకోపై నెగ్గి నాలుగోరౌండ్‌కు చేరారు. పురుషుల సింగిల్స్‌లో ముసేటి, రూన్, టామీ పాల్ ముందంజ వేశారు.

ఏడో సీడ్‌కు భాంబ్రీ జోడీ షాక్: పురుషుల డబుల్స్‌లో యుకీ భాంబ్రీ ద్వయం సంచలనం సృష్టించింది. హోరాహోరీగా సాగిన రెండో రౌండ్‌లో భాంబ్రీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ 6-7(4), 7-6 (7), 6-3తో ఏడో సీడ్ నికోలా మెక్టిక్ (క్రొయేషియా)/మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంటని ఓడించి ముందంజ వేసింది.

స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (సి) రషీద్ (బి) ప్రసిద్ధ్ 81, బెయిర్‌స్టో (సి) కొట్జీ (బి) సాయి కిశోర్ 47, సూర్యకుమార్ (సి) వాషింగ్టన్ (బి) సాయి కిశోర్ 33, తిలక్ (సి) మెండిస్ (బి) సిరాజ్ 25, హార్దిక్ (నాటౌట్) 22, నమన్ ధిర్ (సి) రషీద్ (బి) ప్రసిద్ధ్ 9, శాంట్నర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 228/5; వికెట్ల పతనం:** 1-84, 2-143, 3-186, 4-194, 5-206; **బౌలింగ్:** సిరాజ్ 4-0-37-1, ప్రసిద్ధ్ 4-0-53-2, సాయి కిశోర్ 4-0-42-2, రషీద్ 4-0-31-0, కొట్జీ 3-0-51-0, వాషింగ్టన్ 1-0-7-0.

గుజరాత్: సాయి సుదర్శన్ (బి) గ్లీసన్ 80, గిల్ (ఎల్బీ) బౌల్ట్ 1, మెండిస్ (హిట్ వికెట్) (బి) శాంట్నర్ 20, వాషింగ్టన్ (బి) బుమ్రా 48, రూథర్‌ఫర్డ్ (సి) తిలక్ (బి) బౌల్ట్ 24, తెవాటియా (నాటౌట్) 16, షారుక్ (సి) సూర్య (బి) అశ్వనీ కుమార్ 13, రషీద్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 208/6; వికెట్ల పతనం:** 1-3, 2-67, 3-151, 4-170, 5-193, 6-208; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-56-2, బుమ్రా 4-0-27-1, గ్లీసన్ 3.3-0-39-1, హార్దిక్ 3-0-37-0, శాంట్నర్ 1-0-10-1, నమన్ ధిర్ 1-0-9-0, అశ్వనీ కుమార్ 3.3-0-28-1.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 31-5-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మిస్ వరల్డ్ 2025 ఫైనల్‌కు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఏర్పాట్లు

రూ. 8.5 కోట్ల నగదు..



1770 వజ్రాల కిరీటం

ప్రపంచ సుందరికి అందే నజరానాలు.. ఏడాదిపాటు ఉచితంగా ప్రపంచ యాత్ర

ప్రకటనలు, సినిమాల్లో అవకాశాలు మరెన్నో.. ప్రస్తుతం పోటీలో 40 మంది

ప్రపంచం దృష్టి అంతా హైదరాబాద్ పైనే..

150కిపైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం

హైటెక్స్‌లో 4 వేల మంది వీక్షించేలా ఏర్పాట్లు

భారత్ గెలిస్తే అత్యధిక టైటిళ్ల విజేతగా రికార్డు

నేడే మిస్ వరల్డ్ ఫైనల్

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచ సుందరి విజేత ఎవరో నేడే తేలిపోనుంది. హైటెక్స్‌లో శనివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రపంచ సుందరి పోటీల తుది ఘట్టం మొదలుకానుంది. ప్రపంచ సుందరి విజేతకు మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.8.5 కోట్లు) నగదుతో పాటు 1,770 వజ్రాలతో కూడిన తెల్ల బంగారు కిరీటం దక్కనుంది. అంతేకాదు మిస్ వరల్డ్ బ్రాండ్ అంబాసిడర్ హోదాలో ఏడాది పాటు ప్రపంచమంతా ఉచితంగా పర్యటించే అవకాశం లభిస్తుంది. అదే సమయంలో అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు, సినిమాల్లో అవకాశాలతో మరెన్నో నజరానాలు దక్కుతాయి.

ఎంపిక ప్రక్రియ జరిగేది ఇలా..

ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు 108 దేశాలకు చెందిన సుందరీమణులు వచ్చారు. అందులో వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల నుంచి 40 మందిని క్వార్టర్ ఫైనల్‌కు ఎంపిక చేశారు. అందులో నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీలకు సంబంధించి ఒక్కో విభాగం

మిగతా 10వ పేజీలో...

అమరావతికి ఆహ్వానం!



గ్లోబల్ గ్రీన్ సిటీగా రూపుదిద్దుతున్నాం: చంద్రబాబు

గ్లోబల్ లీడర్‌షిప్ కేంద్రమూ పెడుతున్నాం

పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి

వచ్చే జనవరి నాటికి అమరావతిలో తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రం

టీసీఎస్, ఐబీఎం, ఎల్అండ్‌టీ భాగస్వాములు

వచ్చే 22 ఏళ్లకు ఇప్పుడే ప్రణాళికలు

15 శాతం వృద్ధి రేటే మా లక్ష్యం

తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చాలన్నదే మా విజన్

గ్రీన్ ఎనర్జీలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల సాధన టార్గెట్

సీమలో హైటెక్ పారిశ్రామిక కారిడార్

అనకాపల్లిలో రూ.1.43 లక్షల కోట్లతో ఆర్సెల్లార్ స్టీల్ ప్లాంట్

రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ

గూగుల్‌తోనూ చర్చలు జరుపుతున్నాం

మూడేళ్లలో అమరావతి మొదటి దశ పూర్తి

ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పన

అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు

రొటీన్ బిజినెస్‌లు వద్దు

ఢిల్లీ సీఐఐ ప్లీనరీలో చంద్రబాబు వెల్లడి



ఢిల్లీలో జరిగిన సీఐఐ సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

- రొటీన్ బిజినెస్‌లు వద్దు. 'థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ.. బిజినెస్ గ్లోబల్లీ' అనేది మన విధానం కావాలి.
- నేడు 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందిన భారత్‌కు చైనా, అమెరికాల నుంచి నిజమైన పోటీ ఇప్పుడే ప్రారంభమైంది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలి.
- ప్రస్తుతం ఐటీ, ఇతర మాన్యుఫాక్చరింగ్ ఉత్పత్తుల విషయంలో ప్రపంచ శ్రేణి ప్రమాణాలను అందుకోవడంలో కొంత వెనుకబడి ఉన్నాం. దీనిని అధిగమిస్తే మనల్ని ఎవరూ అందుకోలేరు.

\- సీఎం చంద్రబాబు

న్యూఢిల్లీ, మే 30 (ఆంధ్రజ్యోతి): 'హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన నాకు ఇప్పుడు అమరావతి రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చింది. గ్లోబల్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతున్నాం. ఇందులో పారిశ్రామికవేత్తలు కూడా భాగస్వాములు కావాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపిచ్చారు. శుక్రవారం ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) వార్షిక వ్యాపార సదస్సు-2025లో 'ఆర్థికాభివృద్ధి-సుస్థిరత- ఆంధ్రప్రదేశ్ బ్లూప్రింట్

మిగతా 11వ పేజీలో...



'జలసిరి'కి జవసత్వాలు

'ఎన్టీఆర్ జలసిరి 2.0'పై ప్రభుత్వం కసరత్తు

గతం కంటే మెరుగ్గా అమలుకు సన్నాహాలు

రైతులకు విద్యుత్తు, సోలార్ పంపుసెట్లు

గ్రామీణాభివృద్ధి శాఖ ప్రణాళికలు

వైసీపీ సర్కార్‌లో నిర్వీర్యమైన పథకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో నిరాదరణకు గురైన వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం ఊపిరి పోస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు చర్యలు తీసుకుంటున్న చంద్రబాబు సర్కార్.. జగన్ ప్రభుత్వంలో నిర్వీర్యమైన 'ఎన్టీఆర్ జలసిరి' పథకానికి జవసత్వాలు అందించి, త్వరలో తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది. 2014లో గత టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బోరుబావుల పథకం జలసిరికి కొనసాగింపుగా ఎన్టీఆర్ జలసిరి 2.0 పేరుతో అమలు చేయనున్నారు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. విద్యుత్తు అందుబాటులో లేని రైతులకు

మిగతా 11వ పేజీలో...

కరోనాతో జర భద్రం!



ప్రమాదకరం కాదు కానీ.. నిర్లక్ష్యం పనికిరాదు

రాష్ట్రంలో అక్కడక్కడా కొవిడ్ కేసులు నమోదు

టెస్ట్ చేస్తున్న వారిలో 5-7 శాతం మందికే పాజిటివ్

వెలుగుచూస్తున్న కేసుల్లో ఒమైక్రాన్ వేరియంట్

ప్రమాదకరం కాదంటున్న మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్


అయినా కొవిడ్ మార్గదర్శకాలు పాటించాలి: వైద్య నిపుణులు

ఆస్పత్రుల్లో ఐసొలేషన్ వార్డులు.. కొవిడ్‌పై ప్రత్యేక పర్యవేక్షణ

రాష్ట్రంలో మరో 3 కేసులు

హౌస్‌సర్జన్‌కు కరోనా.. 24 గంటల్లో మళ్లీ నెగెటివ్

ఐదేళ్ల క్రితం అందరినీ గడగడలాడించిన కరోనా వైరస్ మళ్లీ మెల్లగా విజృంభిస్తోంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు నమోదవడం ఆందోళన రేపుతోంది..! రాష్ట్రంలో పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ.. ఏరోజు ఎలా మారుతుందో చెప్పలేని పరిస్థితి..! ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని విధాలుగా సిద్ధమవుతోంది.



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అక్కడక్కడా కరోనా కేసులు నమోదవుతున్నాయి. కానీ.. 2020లో ఫస్ట్‌వేవ్.., 2021లో సెకండ్ వేవ్‌లో నమోదైనంత స్థాయిలో కేసులు లేవు. ప్రస్తుతం కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్న వారిలో 5 నుంచి 7 శాతం మాత్రమే పాజిటివ్‌గా తేలుతున్నాయి. ఎవరికీ ప్రాణాపాయ పరిస్థితి లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు యాక్టివ్ కేసులు మాత్రమే ఉన్నాయి. ఇప్పటివరకూ ఒక్క మరణం కూడా నమోదు కాలేదు. విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో కొవిడ్‌తో ఒకరు మరణించినట్టు వార్తలొచ్చినా ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం వాటిని కొట్టిపారేశారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో తీవ్రత అంతగా ఉండడం లేదు. పైగా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన నాలుగైదు రోజుల్లోనే బాధితులు కోలుకుంటున్నారు. ఇప్పటి వరకూ నమోదైన కేసుల్లో.. జ్వరం, జలుబు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయి. జ్వరం తీవ్రంగా ఉన్నవారు మాత్రం కాస్త ఇబ్బంది

మిగతా 12వ పేజీలో...

తప్పు ఎవరిదైనా విద్యార్థుల

జేబు ఖాళీ!

రీకౌంటింగ్‌కు 500, రీవెరిఫికేషన్‌కు 1000

మార్కులు మారినా డబ్బులు వెనక్కివ్వరు

విద్యా శాఖ తప్పులకు విద్యార్థులపై భారం

మూల్యాంకనంలో గురువుల పొరపాట్లపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు

వారంలోనే మూల్యాంకనం పూర్తిపై విస్మయం



అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనంలో తప్పు ఎవరిదైనా.. విద్యార్థుల జేబులు ఖాళీ అవుతున్నాయి. తప్పులను సవాలు చేస్తున్న విద్యార్థులు తమ పొరపాటు లేకపోయినా.. ఫీజులు వదులుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఫలితాల అనంతరం రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు.. మార్కులు పెరిగితే కనుక తాము కట్టిన ఫీజును తిరిగివ్వాలని కోరుతున్నారు. తప్పు తమది కాదు కాబట్టి.. ఆ ఫీజుల భారాన్ని తామెందుకు భరించాలని ప్రశ్నిస్తున్నారు. ఒక్కొక్క సబ్జెక్టు రీకౌంటింగ్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.వెయ్యి దరఖాస్తు

మిగతా 7వ పేజీలో...

83% పేపర్లలో మార్కులు మారలేదు

పదో తరగతి మూల్యాంకనంపై విద్యా శాఖ



మద్యం స్కాంలో నిందితుడు రాజ్ కసిరెడ్డిని కస్టడీ తర్వాత జైలుకు తీసుకొచ్చిన పోలీసులు

'మద్యం'లో దొంగాట!

నాలుక మడతేసిన సూత్రధారి రాజ్ కసిరెడ్డి

అరెస్టు సమయంలో ఒకలా.. ఇప్పుడు మరోలా..

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పకు మొత్తం డబ్బులు ఇచ్చినట్లు తొలుత వాంగ్మూలం

తాజా విచారణలో తానలా చెప్పలేదని బుకాయింపు

నిందితుడు చాణక్య వాంగ్మూలం ఆధారంగా ప్రశ్నలు

నలుగురు నిందితులను ఒకేసారి విచారించిన సిట్

తొలి రోజు 100 ప్రశ్నలు సంధించిన అధికారులు

విజయవాడ, మే 30(ఆంధ్రజ్యోతి): 'మద్యం ద్వారా వసూలు చేసిన డబ్బును ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పకు ఇచ్చా'... సిట్ అధికారులు అరెస్టు చేసినప్పుడు కుంభకోణంలో ప్రధాన సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి చెప్పిన మాటలు ఇవి. 'వారికి డబ్బులిచ్చానని నేనెప్పుడు చెప్పా? నేనలా అనలేదు'... తాజా విచారణలో కసిరెడ్డి బుకాయింపు ఇది. ఈ కేసులో ఇప్పటి వరకు సిట్ అధికారులు ఏడుగురిని అరెస్టు చేశారు. వారిలో కసిరెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను సిట్ అధికారులు

మిగతా 12వ పేజీలో...

ఈడీ అధికారిని అరెస్టు చేసిన సీబీఐ

రూ.20 లక్షలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి

ఒడిశాలో ఘటన.. నిందితుడు ఈడీ డిప్యూటీ డైరెక్టర్

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించిన న్యాయస్థానం

న్యూఢిల్లీ, మే 30: ఈడీ డిప్యూటీ డైరెక్టర్ చింతన్ రఘువంశీని ఒడిశాలో లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2013 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన రఘువంశీ ఓ మైనింగ్ కేసును పరిష్కరించేందుకు భువనేశ్వర్‌కు చెందిన వ్యాపారవేత్త నుంచి ఏకంగా రూ.5 కోట్ల లంచం డిమాండ్ చేశారని అధికారులు తెలిపారు. ఒడిశాలోని ఢెంకనాల్‌కు చెందిన మైనింగ్ వ్యాపారి రతికాంత రౌత్‌పై కొన్నాళ్ల క్రితం ఈడీ కేసు నమోదైంది. విచారణలో భాగంగా ఈ ఏడాది మార్చిలో రౌత్ ఈడీ ఆఫీస్‌కు వెళ్లినప్పుడు కేసుకు సంబంధించి ఆస్తులు అటాచ్ చేయకుండా ఉండేందుకు డబ్బులు చెల్లించాలని

మిగతా 10వ పేజీలో...



కిటికీ నుంచి కరెన్సీ వర్షం

విజిలెన్స్ దాడికి భయపడి నోట్ల కట్టలు బయటికి విసిరేసిన ఒడిశా ఇంజనీర్



ఆ కంపెనీ నాదే!

చెల్లికి వాటా ఇచ్చే ఉద్దేశం లేదు: జగన్

99.89 శాతం వాటా నా వద్దే: విజయలక్ష్మి

ఆమే మా యజమాని: సరస్వతి పవర్

కంపెనీలో తనకు వాటా లేదన్న షర్మిల

ట్రైబ్యునల్‌కు లిఖితపూర్వక వాదనలు సమర్పణ.. విచారణ జూలై 11కి వాయిదా

హైదరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పవర్ కంపెనీలో వాటాలకు సంబంధించి మాజీ సీఎం జగన్, ఆయన తల్లి విజయలక్ష్మి తమ లిఖిత పూర్వక వాదనలను హైదరాబాద్‌లోని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ)కు సమర్పించారు. ఈ కంపెనీ తన స్వార్జితమని జగన్ తన వాదనల్లో తెలిపారు. అందులో 51.01 శాతం వాటా తమదేనన్నారు. అయితే మొత్తం కంపెనీ తన అధీనంలో ఉందని.. 99.89 శాతం వాటా తన పేరిట ఎప్పుడో బదిలీ అయిందని విజయలక్ష్మి

మిగతా 12వ పేజీలో...

శ్రీశైలానికి వరద

నెల రోజులు ముందుగానే నీటి ప్రవాహం



శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీరు

12

మరో 3 రోజులు వర్షాలు

పలు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదు 7

ఏ రేషన్ షాపు నుంచైనా 7

సరుకులు తీసుకోవచ్చు

కార్డు నమోదైన షాపునకే వెళ్లక్కర్లేదు


లబ్ధిదారులకు సౌకర్యవంతంగా మార్పులు చేశాం

ఎలాంటి ఇబ్బందుల్లేకుండా రేషన్ పంపిణీకి చర్యలు

5 లోపు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్

రేషన్ దుకాణాలపై వైసీపీది విష ప్రచారం: నాదెండ్ల

బాలకృష్ణకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు



విజయ్ దేవరకొండకు కాంతారావు పురస్కారం

పైడి జైరాజ్ అవార్డుకు ఎంపికైన మణిరత్నం 9

ఏడాదికి 3 చొప్పున పదేళ్ల అవార్డులు ఒకేసారి

ఏపీలోనూ అవార్డులు ఇవ్వాలి: మురళీమోహన్

'బ్రహ్మోస్'తో పాక్‌కు 10

నిద్ర లేని రాత్రులు

ఉగ్ర, వైమానిక స్థావరాల్ని ధ్వంసం చేసిన క్షిపణులు

ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

ఉగ్రవాద పాము మళ్లీ పడగ విప్పితే తొక్కేస్తాం

బిహార్, యూపీ పర్యటనలో ప్రధాని మోదీ

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

గెలుపోటములు!

తాత్కాలికమే కావచ్చును కానీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సత్వర ఉపశమనం దక్కింది. నీకేమీ విశేషాధికారాలు లేవు విదేశీ-వాణిజ్యంతో చిత్తంవచ్చినట్టు ఆడుకోవడానికి అంటూ అమెరికా వాణిజ్య న్యాయస్థానం ట్రంప్ దూకుడుకు అడ్డుకట్టవేసిన మరునాడే అప్పీల్ కోర్టులో ఆయనకు ఉపశమనం లభించింది. జిమ్మీకార్టర్ కాలంలో తయారైన, అనంతరం ఏ అమెరికా అధ్యక్షుడూ వినియోగించని ఓ ఆర్థిక అత్యాయిక చట్టాన్ని ఆయుధంగా వాడి, ఏకంగా 180దేశాలతో సుంకాల యుద్ధం చేసిన, చేస్తున్న అమెరికా అధ్యక్షుడికి తన అధికారాల పరిమితులేమిటో తెలియదని అనుకోలేం. న్యాయకోవిదులు, వాణిజ్య నిపుణులు ఆయనకు మంచిచెడ్డలు చెప్పి, దేశానికి కీడు చేస్తున్నావని హెచ్చరించేవుంటారు. కానీ, అమెరికాను దోచుకుంటున్న మిగతా ప్రపంచం మెడలు వంచిన యోధుడుగా, రక్షకుడుగా తన ప్రజలకు కనిపించడం ప్రధానం కనుక, ఆయన ఎంతవరకైనా పోతాడు. రాజ్యాంగంతో సహా సమస్తవ్యవస్థలనూ కాదంటాడు. అధ్యక్షుడుగా ఎన్నికల్లో ఓడినాకూడా ప్రజాతీర్పును తప్పుబట్టి, తన అభిమానులను చట్టసభలమీదకు ఉసిగొల్పిన ఉదంతం అంతసులభంగా మరిచిపోయేది కాదు.

మిగతా ప్రపంచంతో పోరాడుతున్నానంటున్న తమ అధ్యక్షుడిమీద అమెరికాలోని చిన్నాచితకా వాణిజ్య సంస్థలు, వేదికలు, వ్యక్తులు, రాష్ట్రాలు న్యాయపోరాటానికి నడుంబిగించాయి కనుక, ఈ వ్యవహారం ఇప్పట్లో తెగేది కాదు. అప్పీల్ కోర్టు ఆదేశాలు ట్రంప్‌కు ఉపశమనం ఇస్తే, ట్రేడ్‌కోర్టు తీర్పు మిగతా ప్రపంచానికి ఉత్సాహాన్నిచ్చింది. ట్రేడ్‌కోర్టు తీర్పులో ట్రంప్‌కు కుట్రలూ, రాజకీయాలు, తనపట్ల ద్వేషం కనిపించాయి. కానీ, వైట్‌హౌస్ అత్యవసరంగా వినియోగంలోకి తెచ్చిన ఆ చట్టం అధ్యక్షుడికి అమెరికన్ కాంగ్రెస్‌ను అతిక్రమించి వాణిజ్య-నిర్ణయాలు తీసుకొనే విశేషాధికారాలనేమీ ఇవ్వలేదని ట్రేడ్‌కోర్టు తేల్చింది. 'లిబరేషన్ డే' పేరిట ఆయన అక్షరక్రమంలో ఒక్కోదేశం పేరూ చదువుతూ వాటిమీద విధించిన సుంకాలశాతాన్ని ఏప్రిల్ 2న ప్రకటించిన ఆ దృశ్యం ఎన్నటికీ మరిచిపోగలిగేది కాదు. చైనా, కెనడా, మెగ్జికో వంటి దేశాలను మాదకద్రవ్యాల అక్రమ రవాణాపేరిట మరింత శిక్షించడమే కాక, చివరకు మనుషులు లేని ద్వీపాలను కూడా ఆయన వదల్లేదు. ఈ క్రమంలో ప్రపంచవాణిజ్యాన్ని, గొలుసుకట్టు వ్యవస్థలను తుత్తునియలు చేశాడు. ప్రపంచమార్కెట్లన్నీ తలకిందులై లక్షలాదికోట్లు హరించుకుపోయేందుకు కారణమైనాడు. ఈ సుంకాలు, ప్రతీకార సుంకాల యుద్ధం సాగుతూండగానే, తన దెబ్బకు మిగతా ప్రపంచమంతా లొంగివచ్చిందని, దేశాలన్నీ ఒప్పందాలకు దిగివస్తున్నాయని ఆయన చెప్పాడు. కానీ, ట్రంప్ నిర్ణయాల పర్యవసానాలను తాము ఎదుర్కోవాల్సివస్తున్నదని, తమకు అవి భారంగా పరిణమించాయని రాష్ట్రాలు వాదిస్తున్నాయి. సరఫరాలు నిలిచిపోయి ఆర్థికంగా అపారనష్టం కలుగుతోందని, ఉత్పత్తులు అందక వినియోగదారులకు ఇబ్బంది కలుగుతోందని అంటున్నాయి. బడుగులను కొట్టి బిలీనియర్లకు దోచిపెట్టేందుకే ట్రంప్ ఈ ఎత్తుగడ వేశారని విమర్శకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో, వాణిజ్యానికి సంబంధించి ట్రంప్‌కు చిత్తంవచ్చిన నిర్ణయాలు తీసుకొనే అధికారం లేదని, అమెరికన్ కాంగ్రెస్‌ను దాటిపోవడం శుద్ధతప్పని ట్రేడ్‌కోర్టు చెప్పడం బాగుంది. అమెరికా యాభైయేళ్ళుగా వాణిజ్యలోటు ఎదుర్కొంటున్నదనీ, విశేషాధికారాలు ప్రయోగించాల్సినంత అత్యవసర స్థితి ఏమీ లేదనడం మరీ బాగుంది.

మిగతా ప్రపంచంతో వాణిజ్యయుద్ధాన్ని ఆరంభించి, ఉద్రిక్తతలు పెంచిన ట్రంప్ ప్రభుత్వం న్యాయస్థానంలో మాత్రం తాను వాణిజ్యాన్ని వాడి యుద్ధాలు ఆపుతున్నానని, సుంకాలను సంధించి శాంతిని సాధిస్తున్నానని విచిత్రమైన వాదనలు చేసింది. భారత్—పాక్ ఘర్షణలను కూడా అందుకు నిస్సిగ్గుగా వాడుకుంది. దేశ అత్యాయిక స్థితిని ఎలా ఎదుర్కోవాలో ఎన్నికకాని న్యాయమూర్తులకు ఏమి తెలుసంటూ ట్రంప్ బృందం అహంకారంతో వ్యాఖ్యానిస్తోంది. లేని అధికారాలను దఖలుపరచుకొని, అమెరికా ఆర్థిక, వాణిజ్య భవిష్యత్తును ప్రభావితం చేసే కీలకమైన నిర్ణయాలను వీసమెత్తు చర్చలేకుండా ఓవల్ ఆఫీసులో కూర్చుని ఏకపక్షంగా తీసుకుంటున్న ట్రంప్‌కు ఏ అనుభవం ఉన్నదో మరి. ఇప్పటివరకూ నోరుమెదపని అమెరికన్ కాంగ్రెస్ ఇప్పటికైనా చొరవచూపి తన ఉనికిని కాపాడుకుంటే బాగుంటుంది.

ఆ నాటి చెలిమి ఒక కల..!

అమెరికా అధ్యక్ష ఎన్నికల అభ్యర్థిగా ఉన్న డోనాల్డ్ ట్రంప్ అక్టోబర్ 2024లో ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు : 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్లాదకరమైన వ్యక్తి, మంచి స్నేహపాత్రుడు' అని మెచ్చుకున్నారు. ఫిబ్రవరి 2025లో వైట్ హౌజ్‌లో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన మోదీ ఇలా చెప్పారు : 'సంపద్వంతమైన భారత్ నిర్మాణానికి మా దార్శనికత 'మేక్ ఇండియా గ్రేట్ ఎగైన్' (మిగా). అమెరికా, ఇండియా కలిసికట్టుగా ముందుకు సాగితే అంటే మగా ప్లస్ మిగా మెగా అవుతుంది. సంపద్వృద్ధిలో మా రెండు దేశాలు గొప్ప భాగస్వాములు'. ఇండియా ప్రధానమంత్రి, అమెరికా అధ్యక్షుడు ఇరువురూ వినయంలేని మొండి పాఠశాల బాలల్లా అందరినీ ఆకట్టుకున్నారు. మరి ఇప్పుడు మోదీ, ట్రంప్‌ల మధ్య వర్ధిల్లిన ఆ దోస్తీ ఏమయింది? స్నేహోల్లాసం సెలవు తీసుకుందా? సరసత సమసిపోయిందా?



■ పి. చిదంబరం

'పళని' పలుకు

మే 7, 2025 నుంచి మోదీ, ట్రంప్ పరస్పరం మాట్లాడుకోవడం లేదని నాకు విశ్వసనీయంగా తెలిసింది. మనకు తెలిసిందల్లా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ విదేశాంగ శాఖ కార్యదర్శి మార్కో రూబియో మే 9 రాత్రి మోదీతో ఫోన్‌లో మంతనాలు జరిపారని, యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని ఇరువురూ ప్రధానమంత్రిని కోరారు. ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ సంభాషణల గురించి పరోక్షంగా సూచించారు. 'అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా జరిగిన చర్చల తరువాత, భారత్, పాకిస్థాన్‌లు తక్షణమే కాల్పుల విరమణను సంపూర్ణంగా పాటించేందుకు అంగీకరించాయని ప్రకటించడానికి చాలా సంతోషిస్తున్నాను'. మే 10 సాయంత్రం 5.25 గంటలకు వెలువడిన ట్రంప్ ప్రకటన భారతీయులను వాస్తవ పరిస్థితులకు మొరటుగా జాగరూకం చేసింది.

ట్రంప్ దబాయించలేదు మే 10 సాయంత్రం 3.35 గంటలకు కాల్పుల విరమణకు ఉభయ దేశాలు అంగీకరించాయి. అది ఆ సాయంత్రం 5.00 గంటల నుంచి అమలులోకి వచ్చింది. మందహాసం చేయలేని మన విదేశాంగ శాఖ కార్యదర్శి అదే సాయంత్రం 6 గంటలకు ఈ వాస్తవాలను ధ్రువీకరించారు. (తీవ్ర బెదిరింపులతో కానప్పటికీ) తమ మధ్యవర్తిత్వం కారణంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా ఎలా చెప్పుకుంటుంది, ఎందుకు చెప్పుకుంటుంది అన్న విషయాన్ని నిశితంగా శోధించడం చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను. సహేతుకమైన కారణాలు అనేకమున్నాయి.



పాకిస్థాన్ ఇంకెంత మాత్రం తేలిగ్గా లొంగిపోయే శక్తి కాదు. దానికి చైనా సైనిక మద్దతు, అమెరికా దౌత్య మద్దతు ఉన్నది. ఇండియా ఇప్పుడు తన సైనిక వ్యూహాన్ని సరికొత్తగా రూపకల్పన చేసుకోవాలి. తన అమెరికా విధానాన్ని కూడా మళ్లీ కొత్తగా రూపొందించుకోవాలి.

నాలుగు రోజుల యుద్ధం జరిగిన తీరుతెన్నులు నిశితంగా చూడండి. మే 7న అల్గోరిథమ్ ఆధారిత యుద్ధాల యుగంలోకి భారత్ ప్రవేశించింది. ఒక్క సైనికుడూ భూసరిహద్దును కానీ, నియంత్రణరేఖను కానీ దాటలేదు. ఏ విమానమూ శత్రు వాయుతలంలోకి ప్రవేశించలేదు. ప్రధానాయుధాలు మిసైల్, సాయుధ డ్రోన్‌లు తొట్ట తొలుత యుద్ధంలోకి ప్రవేశించిన భారత్‌కు సహజంగానే అనుకూలతలు ఉన్నాయి. మే 7–9 తేదీల మధ్య పాకిస్థాన్‌కు భారీనష్టాన్ని కలిగించింది. ఆ విజయోత్సవ వేళ యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ జోక్యం చేసుకున్నారు. 'ఆహ్లాదకరమైన స్నేహపాత్రుడు'తో మిత్రత్వాన్ని ఆయన పక్కన పెట్టేశారు. యుద్ధానికి తక్షణమే స్వస్తి చెప్పాలని గట్టిగానే బెదిరించారు ఇండియా నిరసనలను కొట్టివేశారు. సౌదీ అరేబియా, ఖతార్ పర్యటనల్లో కూడా తన మధ్యవర్తిత్వం, యుద్ధాన్ని నిలిపివేయకపోతే ఇంకెంత మాత్రం వాణిజ్యం చేయబోమని హెచ్చరించడం వల్లే కాల్పుల విరమణ ఒప్పందం సాధ్యమయిందని ఆయన పదే పదే ప్రకటించారు.

ట్రంప్ ఏమి చెప్పుతున్నప్పటికీ క్రమేపీ నెమ్మదిగా సత్యం స్పష్టమవుతూ వస్తోంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య నాలుగు రోజుల సాయుధ సంఘర్షణల్లో ట్రంప్ జోక్యం వెనుక ఆయన కుటుంబ వాణిజ్య ప్రయోజనాలే ప్రధాన ప్రేరణగా ఉన్నాయన్నదే ఆ సత్యం. ట్రంప్ కుటుంబ క్రిప్టో కరెన్సీ కంపెనీ 'వరల్డ్ లిబర్టీ ఫైనాన్సియల్' (డబ్ల్యుఎల్ఎఫ్) పాకిస్థాన్‌తో సంప్రతింపులు జరిపింది. పహల్గాం ఉగ్ర ఘాతుకం చోటుచేసుకుని నాలుగు రోజులు కూడా గడవక ముందే ఏప్రిల్ 26న డబ్ల్యుఎల్ఎఫ్ ప్రతినిధులు పాక్ ప్రధానమంత్రి, సైనిక దళాల ప్రధానాధికారితో చర్చలు జరిపి పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. మే మొదటివారంలో సాయుధ సంఘర్షణలు ప్రారంభమై తీవ్రమవడంతో ఈ వివాదంలో జోక్యం చేసుకోకూడదన్న తన తొలి వైఖరిని ట్రంప్ విడనాడారు. మే 7 తరువాత ఉధృతంగా ప్రారంభమైన మధ్యవర్తిత్వ కార్యకలాపాలు ట్రంప్ చెప్పినట్లు ఆయన నిర్ణయాత్మక ప్రమేయంతో ముగిసాయి.

డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ మధ్య దోస్తీ ఉన్నప్పటికీ అమెరికా ప్రభుత్వం భారతీయ అక్రమ వలసకారులను చేతులకు బేడీలు వేసి, కాళ్లకు గొలుసులు కట్టి స్వదేశానికి తిరిగి పంపించివేసింది. ఈ అవమానకరమైన చర్య పట్ల అసమ్మతి తెలుపుతూ ప్రధాని మోదీ ఒక్క మాటైనా మాట్లాడారా? లేదు. భారత్ నుంచి దిగుమతులపై ట్రంప్ భారీ సుంకాలు విధించారు. ప్రధానమంత్రి రవ్వంత మాటతోనైనా ఆక్షేపించారా? లేదు, లేదు. అంతర్జాతీయ ద్రవ్యనిధి రుణం విషయంలో పాకిస్థాన్‌కు అనుకూలంగా అమెరికా ఓటు వేసింది. న్యూఢిల్లీ ఏమి చేసింది? ఏమీ లేదు. భారతీయులతో సహా విదేశీ విద్యార్థులు అందరినీ హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరించారు. భారత్ ప్రతిస్పందన మౌనమే కాదూ? అమెరికాలోని భారతీయ విద్యార్థులు వీసాల రద్దు ముప్పునెదుర్కొంటున్నారు. భారత ప్రభుత్వం వారికి బాసటగా మాట్లాడిందా? లేదు. విద్యార్థి వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేశారు. నిరసనగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ట్రంప్—మోదీ దోస్తీ ఏమయింది? అంతా గందరగోళంలోకి జారిపోయింది.

భారత ప్రధానమంత్రి ఇంకెంత మాత్రం అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడితో వ్యవహరించడం లేదు. పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న వందల కోట్ల డాలర్ల డబ్ల్యుఎల్ఎఫ్‌కి యజమానిగా ఉన్న ఒక కుటుంబ పెద్దతో ప్రధాని మోదీ బేరాలు ఆడుతున్నారు. స్వప్రయోజనాలకు తన సర్వాధికారాలు, ఆర్థిక వనరులను వినియోగించేందుకు ఏ మాత్రం సంకోచించని POTUS (ప్రెసిడెంట్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్)తో భారత ప్రధానమంత్రి వ్యవహరిస్తున్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు సమస్త భారతీయులు ముక్తకంఠంతో మద్దతు తెలిపారు. కటువైన మాటలతో పాకిస్థాన్‌కు తీవ్రహెచ్చరికలు చేసిన ప్రధాని మోదీ ట్రంప్ మహాశయుడి దౌత్య రాజకీయానికి నిజంగానే అమిత కలవరపాటుకు గురయ్యారు. పాకిస్థాన్ ఇంకెంత మాత్రం తేలిగ్గా లొంగిపోయే శక్తి కాదు. దానికి చైనా సైనిక మద్దతు, అమెరికా దౌత్య మద్దతు ఉన్నది. ఇండియా ఇప్పుడు తన సైనిక వ్యూహాన్ని సరికొత్తగా రూపకల్పన చేసుకోవాలి. అంతే కాదు తన అమెరికా విధానాన్ని కూడా మళ్లీ కొత్తగా రూపొందించుకోవాలి. ఇవి మూలమట్టుగా జరగాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)


ట్రంప్ గ్రహణంలో విద్యా అమెరికా

నాకు ప్రపంచ జ్ఞానం వచ్చినప్పటి నుంచీ అమెరికా పట్ల పరస్పర విరుద్ధ భావాలు ఉండేవి. అమెరికా సాహితీవేత్తలు కొంతమందిని (ఎర్నెస్ట్ హెమింగ్వే నాకు ప్రత్యేకంగా ఇష్టం) అభిమానించే వాణ్ణి. బాబ్ డిలాన్, మిస్సిస్సిపి జాన్ హర్ట్ సంగీతాన్ని గౌరవించేవాణ్ణి. ఇదలావుంచితే 1971 యుద్ధంలో రిచర్డ్ నిక్సన్, హెన్రీ కిస్సింజర్ భారత్, బంగ్లాదేశ్‌లకు వ్యతిరేకంగా పాకిస్తాన్‌ను ఎంతగా సమర్థించారో నాకు ఇప్పటికీ బాగా గుర్తు ఉన్నది. 1980లో ఉన్నత విద్యాభ్యాసానికి కలకత్తా వెళ్లాను. అప్పటికి అమెరికా విషయంలో నా పరస్పర విరుద్ధ మనోభావాలు పూర్తిగా విరోధపూరితమయ్యాయి. మార్క్సిస్టు మేధావులు అయిన నా ఉపాధ్యాయుల ప్రభావంలో నేను అమెరికాకు పూర్తిగా వ్యతిరేకినైపోయాను. అమెరికన్ల దుందుడుకుతనం, రోత కలిగించే వ్యాపార స్వభావం, లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియాలో వారి సామ్రాజ్యవాద దుర్మార్గాలు నాకు ఏవగింపు కలిగించేవి. ఈ అసహ్యం నా వ్యక్తిగత చర్చల్లోనూ, బహిరంగ సంభాషణల్లోనూ తరచూ వ్యక్తమవుతుండేది.

నాకుగా నేను అయితే అమెరికా వెళ్లి ఉండేవాణ్ణి కాను. అయితే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ పట్టభద్రురాలు అయిన నా భార్య సుజాతకు 1985లో యేల్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు ఉపకార వేతనం లభించింది. ఆ విద్యావతి ఉన్నత విద్యాభ్యాసానికి అభ్యంతరం చెప్పలేనుకదా. అందునా యేల్ విశ్వవిద్యాలయ గ్రాఫిక్ డిజైన్ విభాగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా పేరు పొందింది. అదృష్టవశాత్తు చరిత్ర విదుషీమణి ఉమాదాస్ గుప్తా నాకు పరిచయమయ్యారు. ఆమె అప్పుడు భారత్‌లోని యునైటెడ్ స్టేట్స్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఉన్నత స్థాయి బాధ్యతల్లో ఉన్నారు. ఉమాజీ సలహా, సహకారంతో యేల్ స్కూల్ ఆఫ్ ఫారెస్ట్రీ అండ్ ఎన్విరాన్‌మెంట్‌లో విజిటింగ్ లెక్చరర్‌షిప్‌కు దరఖాస్తు చేశాను. ఆశ్చర్యకరంగా నా అభీష్టం నెరవేరింది.

2 జనవరి 1986న నేను యేల్‌కు చేరాను. దరిమిలా ఏడాదిన్నరపాటు నా విద్యార్థులకు బోధించడం ద్వారాను, వారి నుంచి నేర్చుకోవడం ద్వారాను నా మేధో నైశిత్యాన్ని పెంపొందించుకున్నాను, నా పరిశోధనాసక్తులను విస్తృతపరుచుకున్నాను. ఆనాడు నేను అమెరికా వెళ్లినందుకు నేను చాలా ఆనందపడుతున్నాను. అప్పటికే నేను పిహెచ్.డి పూర్తి చేసినందున నాకు సునిశ్చితమైన మేధో విశ్వాసాలు ఉండేవి. అమెరికాలో విద్యాభ్యాసానికి వచ్చిన యువ భారతీయ చరిత్రకారులు ఆనాటి విద్యాప్రపంచంలో ప్రచలితంగా ఉన్న సంప్రదాయాలను మాత్రమే అనుసరించడం నన్ను కించిత్ చకితుడిని చేసింది. పాలస్తీనియన్ మేధావి ఎడ్వర్డ్ సయీద్ 'Orientalism', వలసవాదానంతర, సాంస్కృతిక అధ్యయనాలు అమిత ఉత్సుకతను కలిగిస్తున్న కాలమది. వాటిపట్ల ఆసక్తి చూపేవారికి ఎనలేని ప్రోత్సాహమూ లభిస్తున్న రోజులవి. నాకు ఆసక్తి ఉన్న, శిక్షణ పొందిన చరిత్ర, సామాజిక మానవ శాస్త్రంలో అనుభావిక పరిశోధనకు ఆలంబన, మద్దతు కొరవడిన విద్యావాతావరణమది.

విద్యాభ్యాసానికి, బోధనకు అమెరికాకు వచ్చిన నా తరం భారతీయులు చాలావరకు జీవితోన్నతిని



సామ్రాజ్యవాద దురహంకారం, నయవంచనలే అమెరికా విదేశాంగ విధానం స్వతస్సిద్ధ లక్షణాలు. అమెరికా విశ్వవిద్యాలయాలు మానవత్వానికి అలంకారాలు. మానవతా ప్రదీప్త జ్ఞాన మందిరాలు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పరిపాలనా వ్యవస్థ నుంచి వాటిపై ప్రేరేపిత, వివేక రహిత దాడులపట్ల సమస్త దేశాల ఆలోచనాపరులూ ఆవేదన చెందాలి.

సాధించేందుకునేందుకు వచ్చినవారే. నేను వారితో కలివిడిగా ఉండేవాణ్ణికాను. మా మేధో ఆసక్తులు, ప్రవృత్తులు భిన్నమైనవి కావడమే అందుకు కారణం. నాకు విశేష ఆసక్తి ఉన్న రెండు అంశాల— పర్యావరణం, సామాజిక నిరసనోద్యమాలు— లో విశేష కృషి చేసిన విద్వత్‌పరులే నన్ను ఎక్కువగా ఆకట్టుకునేవారు. వారు కృషి చేసిన సంస్కృతులు, సందర్భాలు నా సొంత వాటికి పూర్తిగా భిన్నమైనప్పటికీ వారి నుంచి స్ఫూర్తి పొందాను, నేర్చుకున్నాను. యేల్ విశ్వవిద్యాలయంలో పర్యావరణ సామాజిక శాస్త్రవేత్త 'William Burch', పర్యావరణ చరిత్రకారుడు 'William Cronon', పర్యావరణ మానవ శాస్త్రవేత్త 'Timothy Weiskel'లతో పలుమార్లు సుదీర్ఘ సంభాషణలు జరిపాను. మరో విద్వజ్జుడు 'James Scott'తో తరచు సంవాదాలు జరుపుతుండేవాణ్ణి. ఆయన అప్పుడే ప్రచురించిన 'Weapons of the Weak : Everyday Forms of Peasant Resistance' ఆయన గ్రంథాలలో కెల్లా ఉత్తమమైనది అని నేను భావిస్తాను. యేల్‌కు వెలుపల రట్జర్స్ విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయనాల ప్రముఖుడు Michael Adas తోను, బెర్కెలీలోని సామాజిక శాస్త్రవేత్త Louise Fortmannతోను, బ్రాండెయిస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న అమెరికన్ పర్యావరణ చరిత్ర పథనిర్దేశకుడు Donald Worsterతోను సంబంధాలు నెరిపాను.

ఈ విద్వజ్జులు అందరూ నేను అలవాటుపడని పరిశోధనా పద్ధతులు, శిక్షణ లేని విద్యా విభాగాలతో ఆఫ్రికా, ఆగ్నేయాసియా, ఉత్తర అమెరికాలో విశేష విద్వత్ కృషి చేసినవారు. అంతేకాకుండా కలకత్తా, ఢిల్లీలోని పండిత ప్రకాండుల వలే కాకుండా ఈ అమెరికన్ విద్యావేత్తలు ఎటువంటి అహం లేకుండా తమ కొత్త విద్యార్థులతో సైతం ఎంతో కలివిడిగా మాట్లాడే ఉదార స్వభావులు, సహృదయులు. వారంతా నా కంటే పెద్దవారయినప్పటికీ పేరు పెట్టి పిలిచినా ఆనందంగా ఆదరించేవారు. తమ భావాలపై నా మిమర్శలకు ప్రాధాన్యమిచ్చి నిశిత చర్చలు జరిపేవారు. ప్రస్తావిత జ్ఞాన పారంగతులు కలుసుకోవడం, సమాలోచనలు జరపడం ద్వారా నా మేధో దిగంతాలు విస్తరించాయి, నా జ్ఞానాసక్తులు వికసించాయి, మేధో ఆకాంక్షలు కొత్త లక్ష్యాలను నిర్దేశించాయి. వారి మాదిరిగానే నా పీహెచ్‌డీ థీసిస్‌ను పుస్తకంగా ప్రచురించాలని, పిదప రెండో పుస్తకం, ఆ తరువాత మూడో పుస్తకం రాయాలని అభిలషించాను, ఆరాటపడ్డాను. నాకు తెలిసిన చాలా మంది భారతీయ విద్వజ్జులు మొదట ఒక ప్రశస్త పుస్తకం రాసి, అది సమకూర్చిన గౌరవంతో సంతృప్తి పడిపోయినవారే. Adas, Scott, Worsterలు మనవారికి పూర్తిగా భిన్నమైనవారు. వారి మేధో కృషి చాలా ఉన్నతమైనది, లోతైనది, విస్తృతమైనది, వైవిధ్య భరితమైనది. ఇంటికి తిరిగివెళ్లిన తరువాత వారిలా నా మేధో కృషి సాగించాలని నేను నిర్ణయించుకున్నాను.

యేల్ విశ్వవిద్యాలయ జీవితాన్ని సుజాత, నేను చాలా ఆనందంగా గడిపాము. ఆమె మాస్టర్స్‌ను పూర్తి చేసిన తరువాత మేము స్వదేశానికి వెళ్లిపోతాము కనుకనే ఎటువంటి ఆలోచన లేకుండా సంతోషంగా ఉన్నాము. కొంతమంది అమెరికన్లు మాకు సన్నిహిత మిత్రులు అయ్యారు. వారితో మాకు ఇప్పటికీ ఆత్మీయ సంబంధాలు కొనసాగుతున్నాయి. బెర్కెలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో నేను గడిపిన ఒక సెమిస్టర్ నాకు ఎన్నో ఆనందప్రదమైన జ్ఞాపకాలను



■ రామచంద్ర గుహ

గతానుగతం

మిగిల్చింది. యేల్, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీలలో కంటే ఈ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు వైవిధ్య నేపథ్యాల నుంచి వచ్చినవారే కాకుండా ప్రశస్త మేధో నైశిత్యమున్నవారు కూడా.

ఓనమాల నుంచి డాక్టొరేట్ పొందేవరకు నా విద్యాభ్యాసమంతా పూర్తిగా భారతదేశంలోనే జరిగింది. నా వృత్తి జీవితమూ నా మాతృభూమిలోనే సాగింది. నా జీవితమంతా నా జన్మ భూమిలోనే నివసిస్తున్నాను. అయినప్పటికీ అమెరికాలో నాకు పరిచితులైన ప్రాజ్ఞులు, విద్వజ్జులు, విద్యార్థులకు నేను అపారంగా రుణపడి ఉన్నాను. అమెరికాలోని గ్రంథాలయాలు, పురాపత్రాల భాండాగారాలు ప్రశస్తమైనవి. భారతదేశ చరిత్రపై స్వదేశంలో లభించని విలువైన చారిత్రక పత్రాలు అమెరికాలో లభ్యమవుతాయి. ప్రగాఢ అధ్యయనాలకు అపార అవకాశాలు అందివస్తాయి. ఈ కారణంగానే విశిష్టమైన, అద్వితీయమైన అమెరికన్ విశ్వవిద్యాలయ వ్యవస్థను ధ్వంసం చేసేందుకు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న చర్యలు నాకు అంతులేని ఆవేదన, అపరిమిత ఆగ్రహాన్ని కలిగిస్తున్నాయి. సైద్ధాంతిక విశ్వాసాల ప్రేరణతో చేస్తున్నారో లేక వ్యక్తిగత వైరంతో చేస్తున్నారో గానీ సమున్నత ఉన్నతవిద్యా వ్యవస్థ పట్ల ట్రంప్ వ్యవహరిస్తున్నతీరు తాను పరిపాలిస్తున్న, తాను ఎంతగానో ప్రేమిస్తున్నానని ఆయన చెప్పుకుంటున్న దేశానికి ఎనలేని హాని చేస్తోంది. అమెరికా ఉన్నత విద్యారంగంలో లోపాలు, లొసుగులు లేకపోలేదు. అయితే ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో అత్యధికం నిస్సందేహంగా అమెరికాలోనే ఉన్నాయి. సమస్త దేశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపకులు, ఆచార్యులు, మేధావులకు ఉత్కృష్ట విద్యా విజ్ఞానాలు సమకూర్చడం ద్వారా అమెరికా కీర్తిప్రతిష్ఠలను ఘనంగా పెంపొందించాయి, విశ్వం అంచులకు విస్తరింపచేశాయి. వైజ్ఞానిక సృజనాత్మకతను వికసింపచేసి, సమృద్ధం చేయడం ద్వారా అమెరికాను ఆర్థిక మహాశక్తిగా, అధునాతన సాంకేతికతల స్రష్టగా ప్రపంచ అగ్రగామిగా నిలుపుతున్నాయి.

1986లో యేల్ విశ్వవిద్యాలయానికి వెళ్లక ముందు నేను కొంతకాలం అమెరికా విదేశాంగ విధానం విమర్శకుడుగా ఉన్నాను. అనంతర కాలంలో కూడా విదేశాల్లో అమెరికా ప్రభుత్వ ధ్యేయాలను నేను తీవ్రంగా సంశయించేవాణ్ణి. ప్రపంచ వ్యవహారాలలో నా శ్రద్ధాసక్తులు ప్రారంభమైన నాటి నుంచీ అమెరికా విదేశాంగ విధానం దురహంకారం, నయవంచనల మిశ్రమంగానే ఉంటోన్నది. అయితే అమెరికా విశ్వవిద్యాలయాలు పూర్తిగా మరో విషయం. అవి మానవత్వానికి అలంకారాలు. మానవతా ప్రదీప్త జ్ఞాన మందిరాలు. వాటిపై ప్రేరేపిత, వివేక రహిత దాడులపట్ల సమస్త దేశాల ఆలోచనాపరులు అందరూ ఆవేదన చెందాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

జనన మరణాలు సరిగా నమోదు చేస్తున్నారా?

ఇటీవల ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం తహశీల్దార్, దొడ్డవరం గ్రామ రెవెన్యూ అధికారి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దీనికి కారణం... ఫిర్యాదుదారు భార్య ఆరు నెలల క్రితం హైదరాబాద్‌లో ఒక ఆసుపత్రిలో బ్రెయిన్ [illegible]తో మరణించడంతో ఆమె మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేయగా రెవెన్యూ అధికారులు లంచం డిమాండ్ చేశారు.

జనన, మరణాల నమోదు చట్టం ప్రకారం దేశంలో జరిగిన అన్ని జనన, మరణాలు తప్పక నమోదు కావాలి. బ్రిటీష్ కాలంలో వీటిని గ్రామ మునసబు నమోదు చేసేవారు. చిన్న గ్రామాలు మినహా మేజర్ పంచాయితీలు, మున్సిపాలిటీల్లో జనన, మరణాలను పంచాయితీ, మున్సిపల్ అధికారులు వారి పరిధిలో నమోదు చేస్తారు. 2001 నుంచి చిన్న గ్రామాల్లో కూడా జనన, మరణాల నమోదును రెవెన్యూ శాఖ నుంచి తప్పించి, పంచాయితీలకు అప్పగించారు. ప్రస్తుతం జనన, మరణాలు పంచాయితీ కార్యదర్శి చేస్తున్నారు. పిల్లలు బడిలో చేరినపుడు, ఉద్యోగాలు, పాస్‌పోర్టుల కోసం జనన ధ్రువపత్రాలు అత్యవసరం. అలాగే వారసత్వపు ఆస్తి హక్కులు, బ్యాంకు లావాదేవీలకు మరణ ధ్రువపత్రం అత్యవసరం. వీటిని సకాలంలో నమోదు చేయించుకోకపోతే, వారసులు ఆ ధ్రువపత్రాలు పొందడానికి భగీరథ ప్రయత్నం చేయాల్సిందే.



జనన, మరణాలు చట్ట ప్రకారం వీటిని 10 రోజుల్లో తప్పక నమోదు చేయించాలి. లేటు ఫీజుతో సంవత్సరం లోపు అయితే ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సర్టిఫికెట్‌తో తహశీల్దార్ (ఎగ్జిక్యూటివ్ మేజి[illegible] హోదాలో) నమోదుకు ఉత్తర్వులు ఇస్తారు. సంవత్సరం దాటిన జనన, మరణాల నమోదు విషయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (సబ్ డివిజనల్ మేజి[illegible] హోదాలో) విచారణ చేసి, నమోదుకు ఉత్తర్వులు ఇస్తారు. వాటిని అనుసరించి, సంబంధిత పంచాయితీలు/ మున్సిపాలిటీల్లో ఆలస్యం నమోదు చేసి, ధ్రువపత్రం జారీ చేస్తారు. జననం జరిగినపుడు బిడ్డకు పేరు పెట్టడం మనదేశంలో ఆచారం కాదు. కొన్నాళ్ల తరువాత మంచి రోజున ఒక కార్యక్రమం జరిపి, పేర్లు పెడతారు. అప్పుడు ఆ పేరును సంబంధిత పంచాయితీ/మున్సిపల్ అధికారులకు తెలియపరచాలి. అదే అమెరికా వంటి దేశాల్లో అయితే బిడ్డ పుట్టిన గంటలోపు అధికారులు పేరుతో సహా నమోదు చేస్తారు.

ఒక్కోసారి ప్రయాణంలో ఉండగా గర్భిణీకి పురిటి నొప్పులు వస్తే బస్సును పక్కకు ఆపి ఆమెకు ప్రసవం చేయించినట్లు వార్తల్లో చూస్తుంటాం. అటువంటప్పుడు బస్సును ఎక్కడైతే ప్రసవం కోసం ఆపారో ఆ గ్రామంలోనే జననాన్ని నమోదు చేయాలి. జనన, మరణాలు సంభవించిన గ్రామ/మున్సిపాలిటీ పరిధిలోనే నమోదు కావాలి. కానీ చాలా సందర్భాల్లో పట్టణంలో ఆసుపత్రిలో జన్మించినా, స్వగ్రామంలోనే నమోదు చేయిస్తుంటారు. పట్టణాల్లో ఆసుపత్రిలో మరణించినా గ్రామానికి తీసుకొచ్చి దహన కార్యక్రమాలు జరిపి, శాశ్వత గ్రామ నివాసి కాబట్టి, పంచాయతీ అధికారులపై ఒత్తిడి చేసి, అక్కడే నమోదు చేయిస్తూ ఉంటారు. అది చాలా తప్పు. ఆసుపత్రిలో జనన, మరణాలు జరిగినపుడు ఆ యాజమాన్యం రెండురోజుల్లో సంబంధిత పంచాయితీ/మున్సిపల్ అధికారులకు తెలియపరచాలి. అలాగే ఆ వివరాలను తప్పులేకుండా పంపాలి. కానీ ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ఆ జనన, మరణాల వివరాలను సక్రమంగా పంపడం లేదు. ఆన్‌లైన్ సదుపాయాలు వచ్చినా నిర్లక్ష్యం వహిస్తునే ఉన్నారు. అలాగే వ్యక్తులు కూడా తమ కుటుంబంలో జనన, మరణాలు జరిగినపుడు ఆ వివరాలను తప్పులు లేకుండా ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో ఏ విధమైన సమస్య లేకుండా ధ్రువీకరణ పత్రాలు పొందగలుగుతారు.

ఇప్పుడు లంచం తీసుకుంటూ దొరికిన తహశీల్దారు ఎక్కడో హైదరాబాద్‌లో జరిగిన మరణాన్ని వారి స్వగ్రామంలో నమోదు చేయడం తప్పు, చట్టరీత్యా నేరం. హైదరాబాదులో వైద్యం అందించిన ఆసుపత్రి వారు ఆ నమోదును అక్కడి మున్సిపల్ అధికారులకు తెలియపరచకపోవడం చట్టపరంగా కూడా శిక్షార్హమే. ఆసుపత్రి యాజమాన్యం లేటుగానైనా హైదరాబాద్ మున్సిపల్ అధికారులకు ఆమె చనిపోయిన వాస్తవ తేదీని పేర్కొంటూ నివేదిక పంపాలి.

భారతదేశంలో జనన, మరణాలు సకాలంలో నమోదు కానందున సంబంధీకులు చాలా కష్టనష్టాలకు లోనవుతున్నారు. గిరిజన ప్రాంతాల ప్రజలయితే తమ బిడ్డల జనన ధ్రువపత్రాలు లేక చదువులు మధ్యలోనే ఆపేసే పరిస్థితి. గిరిజన సమీకృతాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు మరింత శ్రద్ధ తీసుకోవాలి. అలాగే ఈ జనన, మరణాల నమోదు గురించి మహిళా సంఘాలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎనఆర్జీఎస్ కూలీలకు, గ్రామపంచాయితీ సభ్యులకు ప్రభుత్వాలు విస్తృత అవగాహన కల్పించాలి. వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులకు కళాశాలలో ఉండగానే వీటిపై స్పష్టమైన అవగాహన కల్పించాలి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూడా తమ సభ్యులకు జనన, మరణాల నమోదు నైతిక, చట్టపరమైన బాధ్యత అని తెలియజేయాలి. అప్పుడే ఈ గడ్డమీద జరిగిన ప్రతీ జననం, మరణం సక్రమంగా నమోదవుతాయి. తద్వారా జనన, మరణ ధ్రువపత్రాలు తప్పులు లేకుండా సకాలంలో ప్రజలు పొందగలుగుతారు.

■ మారిశెట్టి జితేంద్ర

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్(రిటైర్డ్)

దోపిడీ ఉంటే.. పోరాటాలు తప్పవు

శాంతి చర్చలు జరపటానికి సిద్ధంగా ఉన్నామని మావోయిస్టు నాయకత్వం పదేపదే ప్రకటించినా, మావోయిస్టులతో చర్చలు జరపాలని ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు వివిధ రూపాలలో ఆందోళనలు సాగిస్తున్నా మోదీ షా ప్రభుత్వం మే 21వ తేదీన మావోయిస్టుల అగ్రనాయకులను పెద్ద సంఖ్యలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపింది. కశ్మీర్‌లో మన పౌరులను దారుణంగా చంపించిన పాకిస్థాన్ పాలకులతో శాంతి చర్చలు జరపగలిగిన కేంద్రం మావోయిస్టులతో చర్చలు నిరాకరించి నరమేధాన్ని కొనసాగించటం కుటిల నీతి కాదా?

బ్రిటిష్ తెల్లదొరలు అధికారాన్ని నల్లదొరలకు బదలాయిస్తూ బూటకపు ఎన్‌కౌంటర్ల విధానాన్ని కూడా బదలాయించారు. నాడు బ్రిటిష్ దొరలపై అల్లూరి సీతారామరాజు నాయకత్వాన సాగిన ప్రజా తిరుగుబాటును అణచివేయటానికి ఆయనను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. కానీ అల్లూరి వారసత్వాన్ని అందిపుచ్చుకొని నేటికీ అటవీ ప్రాంతాల సంరక్షణ కోసం, ఆదివాసీల హక్కుల కోసం గిరిజన సంఘాల నాయకత్వాన పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌లోని నక్సల్బరీ ప్రాంతంలో దోపిడీకి వ్యతిరేకంగా ప్రారంభమైన ఆదివాసీల పోరాటాన్ని బూటకపు ఎన్‌కౌంటర్లతో అణచాలని ఆనాటి పాలకులు చూశారు. కానీ ఆ పోరాటం దేశవ్యాప్తంగా పాకింది. ఆ ప్రభావంతోనే శ్రీకాకుళంలో సాగిన గిరిజన రైతాంగ సాయుధ పోరాటాన్ని అణచివేయటానికి బూటకపు ఎన్‌కౌంటర్ల విధానానికి పాల్పడి అనేకమంది పోరాట యోధులను ఆనాటి పాలకులు పొట్టన పెట్టుకున్నారు. పాలకులు కలలుగన్నట్లు ఉద్యమ పోరాటాలు ఆగకపోగా అనేక ప్రాంతాలకు విస్తరించి నేటికీ కొనసాగుతున్నాయి. ఇవి నానాటికీ విస్తరించడానికి ముఖ్య కారణం పాలకులు తమ దోపిడీ విధానాలను సరికొత్త రూపాలలో కొనసాగించటమే. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు గిరిజనులను చైతన్యపరచి అటవీ ప్రాంతంలో అపారంగా ఉన్న సహజ వనరులను పాలకులు బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను ఎదురిస్తున్నారు. దీనికి ప్రతిగా ఈ 'ఆపరేషన్ కగార్' మొదలైంది.

గతంలో కంటే నేడు కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో చేపట్టిన నూతన ఆర్థిక విధానాలలో భాగమైన ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలను మరింత దూకుడుగా అన్ని రంగాల్లో అమలుపరచడానికి ఒక పథకం ప్రకారం ప్రయత్నాలు సాగిస్తున్నది. బడా కార్పొరేట్ శక్తుల దోపిడీ విధానాల ఫలితంగా కోటీశ్వరులు శతకోటీశ్వరులు అవుతున్నారు, పేదలు మరింత పేదరికంలోకి కూరుకుపోతున్నారు. ఫలితంగా ప్రజలు తమ ప్రాథమిక హక్కుల సాధన కోసం పోరుబాట పట్టక తప్పటం లేదు. ప్రజలు సాగిస్తున్న పోరాటాలకు ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు నాయకత్వం వహించినట్లు దేశవ్యాప్తంగా అనేక విప్లవ శక్తులు నాయకత్వం వహించడానికి ముందుకు వస్తున్నాయి. మధ్య భారతంలోని అడవుల నుంచి ఆదివాసీలను ఖాళీ చేయించి, అంతిమంగా అపారంగా ఉన్న అడవి సంపదను బడా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్‌ను కేంద్ర పాలకులు చేపట్టారు. ఈ దోపిడీకి అడ్డుపడుతున్న 2006 అటవీ చట్టాన్ని మార్చివేసి అటవీ సంరక్షణ నిబంధనలు 2022 చట్టాన్ని పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసనల మధ్య అప్రజాస్వామికంగా తీసుకొచ్చారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక చట్టాల ఫలితంగా సంభవించే సంక్షోభాలను ఎదుర్కోవటానికి ప్రజల పోరాటమార్గం చేపట్టక తప్పదు! ఇది ప్రపంచ చరిత్ర నిరూపించిన సత్యం. అందుకే 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని అంతం చేస్తామని చేసే ప్రకటనలు చెత్తబుట్ట పాలుకాక తప్పదు. దోపిడీ ఉన్నంతకాలం ప్రజల హక్కుల కోసం పోరాటాలు సాగుతూనే ఉంటాయి. ఇది సమాజ నియమం.

– ముప్పాళ్ళ భార్గవ శ్రీ, సీపీఐ ఎంఎల్ నాయకులు



బంగారం స్కామర్ ఎక్కడ?

గోల్డ్ బిస్కట్లతో చీటీలు నిర్వహించి ఖాతాదారులను ముంచిన ముచ్చెర్ల శ్రీనివాసరావు

అతని కోసం విస్తృతంగా పోలీసుల గాలింపు

- స్టేషన్‌కు పెరుగుతున్న బాధితుల సంఖ్య
- కోవర్టుల ద్వారా ఇక్కడి సమాచారం తెలుసుకుంటున్న నిందితుడు
- మోసం విలువ రూ.వందల కోట్లు అంటున్న బాధితులు

ప్రజల ఆశలను ఒక ఆయుధంగా చేసుకుని ఓ పక్క బంగారం, మరోపక్క నగదు చీటీలు నిర్వహించి ఖాతాదారులను నిలువునా ముంచేసిన ముచ్చెర్ల శ్రీనివాసరావు కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. బాధితుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో ముచ్చెర్ల మోసం విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని చర్చ జరుగుతోంది. బాధితుల్లోకి కొందరు కోవర్టులను పంపి ఇక్కడ జరుగుతున్న విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్టు సమాచారం.

ఆంధ్రజ్యోతి-విజయవాడ : 25 మందితో గ్రూపును ఏర్పాటు చేసి, అందులో ఇద్దరు విజేతలను డ్రా ద్వారా ఎంపిక చేసి, గ్రాము బంగారం ఇచ్చి కోట్లాది రూపాయలు వసూలు చేసి పరారైన ముచ్చెర్ల శ్రీనివాసరావు కోసం పోలీసులు గాలిస్తున్నారు. శ్రీనివాసరావు చేసిన మోసాలపై మొత్తం 67 మంది బాధితులు అజిత్ సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిలో 20 మంది వాంగ్మూలాన్ని పోలీసులు శుక్రవారం నమోదు చేశారు. ముచ్చెర్ల చేసిన మోసం గురించి తెలుసుకుని బాధితులు ఒక్కొక్కరు పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నారు.



నగరంలోని పోలీస్ స్టేషన్ వద్దకు భారీగా చేరిన బాధితులు, ఇన్‌సెట్‌లో ముచ్చెర్ల శ్రీనివాసరావు



ఆర్థిక లావాదేవీలపై దృష్టి

ఒక మీడియా సంస్థకు చెందిన వ్యక్తి అత్యధికంగా రూ.కోటి వరకు శ్రీనివాసరావుకు ఇచ్చాడు. ప్రస్తుతం పోలీసులను ఆశ్రయించిన బాధితుల్లో ఆయనే ఎక్కువ మొత్తంలో చెల్లించాడు. ఈ వాంగ్మూలాల నమోదు పూర్తవ్వగానే శ్రీనివాసరావు ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించాలని పోలీసులు నిర్ణయించారు. ఆయనకు ఏయే బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయో గుర్తించి, ఆ సంస్థలకు పోలీసులు లేఖ రాయాలని నిర్ణయించారు. ఈ ఖాతాలను స్తంభింపచేయాలన్న యోచనలో పోలీసులు ఉన్నారు. శ్రీనివాసరావు చేసిన మోసం విలువను ఒక్కొక్కరు ఒక్కో విధంగా చెబుతున్నారు. కొంతమంది బాధితులు రూ.100 కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. మరికొంత మంది రూ.600 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. శ్రీనివాసరావు అంతిమంగా ఎంత మేరకు కుచ్చుటోపీ పెట్టాడో ఇప్పట్లో చెప్పలేమని, దీనికి కొంత సమయం పడుతుందని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

హైదరాబాద్‌లో సమాలోచనలు!

శ్రీనివాసరావు విజయవాడలో దుకాణం సర్దేసి హైదరాబాద్ పారిపోయినట్టు అనుమానిస్తున్నారు. పోలీసులు సంకెళ్లు వేయకుండా తప్పించుకునే మార్గాలపై న్యాయవాదులతో అక్కడ సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి విజయవాడలో ఉన్న కుటుంబ సభ్యులతో వాట్సాప్ కాల్స్ మాట్లాడుతున్నట్టు సమాచారం. విజయవాడలో ఇంటి వద్ద, పోలీస్‌స్టేషన్‌లో జరుగుతున్న పరిణామాలను కుటుంబ సభ్యులు, స్నేహితులను అడిగి తెలుసుకుంటున్నట్టు తెలిసింది. తనకు సంబంధించిన కొంతమందిని బాధితుల్లోకి కోవర్టులుగా శ్రీనివాసరావు వదిలాడని, బాధితుల మాదిరిగా పోలీసుల వద్దకు వెళ్లి స్టేషన్‌లో విషయాలను తెలుసుకుని శ్రీనివాసరావుకు కొంతమంది చేరుస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బైక్ చోరీలకు చైన్ లాక్!

మూడు పీఎస్‌ల పరిధిలో కొత్త ప్రణాళిక అమలు

- తగ్గిన బైక్ అపహరణ ఫిర్యాదులు
- ఆధారాలు చూపిస్తేనే అన్‌లాక్
- సత్ఫలితాలనిస్తున్న చైన్‌లాక్ కార్యక్రమం



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పెట్టిన ద్విచక్ర వాహనాలకు చైన్ వేసి తాళాలు వేస్తున్న పోలీసులు

- ఓ యువకుడు తన బైక్‌ను పీఎన్‌బీఎస్‌లో పెట్టి ఏలూరు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ కృష్ణలంక పోలీసులను ఆశ్రయించాడు.
- చిట్టినగర్‌లోని కొండ ప్రాంతంలో నివాసం ఉండే ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని కొండ దిగువన రోడ్డుపక్క పెట్టి ఇంటికి వెళ్లాడు. మర్నాడు ఉదయం కొండ దిగి వచ్చి చూస్తే బైక్ పెట్టినచోట లేదు. దీంతో వెంటనే కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.
- ఇంటి ముందు రాత్రి నిలిపిన ద్విచక్రవాహనం ఉదయం వరకు ఉంటుందన్న భరోసా ఉండడం లేదు. రైల్వే స్టేషన్ వద్ద పెట్టి రైలెక్కితే తిరిగి వచ్చే సరికి బైక్ ఏమవుతుందో తెలియదు. బస్‌స్టాండ్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ, ఇక్కడా అన్న తేడా లేకుండా ఎక్కడా చూసినా బైక్‌లకు భద్రత ఉండడం లేదు. ఎక్కడో ఒక చోట బైక్ మాయమవుతూనే ఉంది. దీనికి చెక్ పెట్టడానికి ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ అధికారులు గొలుసుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా ముందు విజయవాడ నగరంలో దీన్ని పట్టాలు ఎక్కించారు. ప్రస్తుతం మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో అమలు చేస్తున్నారు. ఇది పూర్తిస్థాయిలో విజయవంతమైతే జిల్లా మొత్తం అమలు చేయాలని భావిస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి -విజయవాడ)

మిగతా 4లో..

2.27లక్షల మందికి రూ.98.11 కోట్లు

- నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ
- జిల్లాలో 2,27,786 పెన్షన్లకు రూ.98.11 కోట్లు విడుదల
- కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 31వ తేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 2,27,786 మందికి సుమారు రూ.98.11 కోట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఇళ్ల వద్దనే పెన్షన్ల అందజేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్‌డీఏ పీడీ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా మిగతా 4లో..

వైద్య విద్యార్థినికి కరోనా!

- మూడు రోజుల కిందట కేసు నమోదు
- ప్రస్తుతం ఆమెకు నెగిటివ్ రిపోర్టు
- ఆందోళన వద్దన్న వైద్యులు

విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కాలేజీ వైద్యవిద్యార్థిని కోవిడ్ పాజిటివ్ రావడంతో నగరవాసులు ఉలిక్కిపడ్డారు. అయితే ఈ కేసు మూడు రోజుల కిందట నమోదైందని, ప్రస్తుతం ఆమెకు నెగిటివ్ రిపోర్టు వచ్చిందని వైద్యులు తెలిపారు. అయినా మిగతా 4లో..

జోరుగా పేకాట!

నందిగామ, కంచికచర్ల రిక్రియేషన్ క్లబ్‌ల్లో నిర్వహణ

పెద్దలు పేకాట ఆడితే అది కాలక్షేపం.. సామాన్యులు ఆడితే మాత్రం అది జూదం.. ఇదీ నందిగామ డివిజన్ పోలీసుల ఆలోచన. చట్టం అందరికీ సమానం అంటూ ఊదరగొట్టే ఉపన్యాసాలు చేసే పోలీసులు ఆర్థికంగా, రాజకీయంగా పేరున్న వ్యక్తులు రిక్రియేషన్ క్లబ్‌లలో పేకాట ఆడినా పట్టించుకోరు. సామాన్యులెవరైన చెట్ల కింద పేకాట ఆడితే వేటాడి, వెంటాడి పట్టుకోవడంతో పాటు అవమానకరంగా వారిని రోడ్ల వెంట నడిపిస్తూ తీసుకువస్తారు. తప్పు ఎవరు చేసినా తప్పే అన్న విషయం మరుస్తున్న నందిగామ డివిజన్ పోలీసులు పెద్దల పేకాటకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- అటువైపు కన్నెత్తి చూడని పోలీసులు
- పోలీస్ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినా మారని తీరు
- సర్వత్రా వ్యక్తమవుతున్న విమర్శలు

ఆంధ్రజ్యోతి-నందిగామ: నందిగామ, కంచికచర్ల పట్టణాల్లో పలు రిక్రియేషన్ క్లబ్‌లు ఉన్నాయి. కంచికచర్ల క్లబ్‌లో జోరుగా జూదం నిర్వహిస్తుండగా, నందిగామ క్లబ్‌ను సిద్ధం చేసి ఉంచారు. కొద్ది కాలం క్రితం ఆయా క్లబ్‌ల్లో నిర్వహిస్తున్న పేకాటపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విజయవాడ సీపీ తీవ్రంగా స్పందించారు. ఏసీపీ, సీఐలు, ఎస్‌ఐలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన పేకాటపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన ఒక పోలీస్ అధికారి కంచికచర్ల క్లబ్‌లో పెద్దలు కొందరు కాలక్షేపానికి ఆడుకుంటున్నారంటూ చెప్పుకొచ్చినట్లు తెలిసింది. దీనిపై కూడా సీపీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కమిషనర్ ఆదేశాల మేరకు కొద్ది రోజులు పోలీసులు హడావిడి చేశారు. కానీ పేకాట ఆపలేకపోయారు. క్లబ్‌ల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చామంటూ పత్రికా ప్రకటనలు చేసి పోలీసులు చేతులు దులుపుకున్నారు. ఉన్నతాధికారులను ఏమార్చారు.

నందిగామలో ఓ భవనంలో నిర్వహణ!

మరో వైపు నందిగామ క్లబ్‌లో కూడా అప్పుడప్పుడూ ఒకటి, రెండు టేబుళ్ల నిర్వహిస్తున్నట్లు తెలియవచ్చింది. నందిగామ పట్టణంలోని పాతబస్టాండ్‌లోని లిక్కర్ షాపు వెనుక ఒక భవనంలో భారీ ఎత్తున పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. వివిధ ప్రాంతాలకు చెందిన పెద్దపెద్ద వ్యాపారులు ఇక్కడకు చేరుకొని భారీ మొత్తంలో బెట్టింగ్‌లు పెడుతున్నట్లు తెలిసింది. పేకాటలో అత్యంత భయంకరమైన మూడుముక్కలాట, లోపల బయట అనే ఆటలు నిత్యం ఆ భవనంలో నిర్వహిస్తున్నట్లు సమాచారం. కోట్ల రూపాయల మేర బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ తతంగం మొత్తం పట్టణానికి చెందిన ఒక వ్యాపారి, కొందరు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంత పెద్దమొత్తంలో బెట్టింగ్‌లతో జరుగుతున్న ఈ పేకాట సమాచారం పోలీసులకు ఉన్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అడ్డుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమాజంలో సమన్యాయం మిగతా 4లో..



ఆరు టేబుళ్లు ఏర్పాటు చేసి మరీ..

కంచికచర్ల క్లబ్‌లో నిత్యం ఆరు టేబుళ్లు ఏర్పాటు చేసి పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. పలు ప్రాంతాలకు చెందిన జూదరులు ఇక్కడకు చేరుకొని పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. ఆటకు వచ్చే వారు క్లబ్‌కు దూరంగా కార్లు పార్క్ చేసి అక్కడ నుంచి క్లబ్ నిర్వాహకులు పంపిన వాహనాల్లో క్లబ్ వద్దకు చేరుకుంటున్నారు. పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే ఉన్న ఈ క్లబ్‌లో ఏం జరుగుతుందో తెలియని స్థితిలో పోలీసులు ఉన్నారా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు పోలీసులు క్లబ్ నిర్వాహకులతో మమేకమై పని చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కమిషనర్‌ను సైతం ఏమారుస్తూ స్థానిక పోలీసులు క్లబ్ నిర్వాహకులకు సహకరించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బెజవాడ బళ్లు.. ఏవోబీలో రయ్.. రయ్!

గంజాయి కోసం బైకులు దొంగిలిస్తున్న ముఠాలు

- నగరంలో వరుసగా ద్విచక్రవాహనాల చోరీ
- ఏవోబీ కొండ ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్మకం
- ఈ ఏడాది విజయవాడలో 185 బైకుల చోరీ
- వాటిల్లో గంజాయి కోసం 35-40
- విక్రయించినట్లు గుర్తించిన పోలీసులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) విజయవాడలో ఇటీవలి కాలంలో వరుసగా ద్విచక్ర వాహనాలు మాయమవుతున్న ఘటనల్లో సంచలన విషయం బయటపడింది. కొన్ని గ్యాంగ్‌లు నగరంలోని పలు చోట్ల బైకులను చోరీ చేసి, ఆ తర్వాత వాటిని వివిధ మార్గాల ద్వారా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) కొండలకు తరలించి.. అక్కడ గంజాయి కోసం అమ్మేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దొంగలు ఖరీదైన బైకులనే ఎక్కువగా మిగతా 4లో..

ఇలా ఎప్పటికి పూర్తి చేస్తారు

అధికారులు, కాంట్రాక్టర్లపై మండిపడ్డ మంత్రి నిమ్మల

- బీడీసీ లెఫ్ట్ బండ్ రిటైనింగ్ వాల్ పనుల పరిశీలన
- కాంట్రాక్టు ఏజెన్సీకి, అధికారులకు వార్నింగ్
- గడువులోగా పూర్తి చేయకుంటే బ్లాక్ లిస్టులో పెడతాం
- సీజన్‌లోగా ఎట్టి పరిస్థితుల్లో వాల్ నిర్మాణం జరిగి తీరాలి



బీడీసీ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల్ని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఇబ్రహీంపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): "బీడీసీ రిటైనింగ్ వాల్ పనుల్ని నత్తనడకన సాగిస్తారా.. ఇదేం పద్ధతి.. ఇలా అయితే ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారు" అంటూ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర స్వరంతో కాంట్రాక్టు ఏజెన్సీ అధికారులపై మండి పడ్డారు. శుక్రవారం ఆయన రిటైనింగ్ వాల్ పనుల్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ పద్ధతి మార్చుకోండి, మూడు షిఫ్టుల్లో పనులు జరగాలి, గడువు లోగా ఎట్టి పరిస్థితుల్లో బీడీసీకి భద్రత గోడ నిర్మాణం జరిగి తీరాలి అని స్పష్టం చేశారు. గడువులోగా పనులు పూర్తి చేయకుంటే ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెడతామని మిగతా 4లో..



పునఃప్రతిష్ఠకు ముస్తాబు చేసిన రామాలయం ప్రధాన ద్వారం

నేటి నుంచి శ్రీధనశైల సీతారామ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

జగ్గయ్యపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రసిద్ధ పురాతనమైన శ్రీధనశైల సీతారామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు శనివారంనుంచి ప్రారంభం కానున్నాయి. మూడురోజుల పాటు జరిగే కార్యక్రమాలలో సీతాలక్ష్మణ, హనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి ని, భగవద్రామానుజచార్యులు, గోదా అమ్మవారు, శఠగోప, సంతాన వేణుగోపాలస్వామి దేవతామూర్తుల ప్రతిష్ఠతో పాటు జీవధ్వజ ప్రతిష్ఠ, గర్భాలయ విమాన శిఖర ప్రతిష్ఠ, మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాలు జరుగుతాయి. త్రిదండి చిన రామానుజ జీయర్‌స్వామి మంగళశాసనాలతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో దేవదాయశాఖ, భక్త బృందం సంయుక్త ఆధ్వర్యంలో.. తొలి రోజు శనివారం ఉదయం గం.6.30కి అరణిమంధనం, అగ్ని ప్రతిష్ఠ, ఛాయాధివాసం, సాయంత్రం గం.5-30ని.లకు ఆలయ వాస్తుశాంతి, జలాధివాసం నిర్వహిస్తామని, ఆదివారం ఉదయం కర్మాంగ స్నపనం, నయన్మేలీనం సాయంత్రం శయ్యాధివాసం, తత్త్వన్యాస హోమం, గర్తపూజ, రత్నన్యాసం, యంత్ర బింబస్థాపన సోమవారం మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ, ప్రాణప్రతిష్ఠ, ప్రథమారాధన, శాంతికల్యాణం, నివేదన, అన్న సంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో హరి దుర్గాప్రసాద్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. భక్తులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



దేవాలయంలో సిద్ధం చేసిన యాగశాల



విస్తృత ఏర్పాట్లు

శ్రీధనశైల సీతారామస్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ, జీవధ్వజ ప్రతిష్ఠల సందర్భంగా పట్టణంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ముక్త్యాల రోడ్డులో బంగారపు కొట్ల సెంటర్ నుంచి దేవాలయం వరకు ప్రత్యేక పందిళ్లు వేశారు. యాగశాలను నిర్మించారు. నూతన ఆలయాన్ని సర్వాంగ శోభితంగా తీర్చిదిద్దారు.



బందోబస్తుపై సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ గిరిబాబు

ఉప ఎన్నికకు బందోబస్తు ఏర్పాట్లు

తిరువూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక జూన్ 2న జరగనున్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లలో స్థానిక పోలీసు అధికారులు నిమగ్నమయ్యారు. శుక్రవారం సీఐ గిరిబాబు, ఎస్ఐ కేవీజీవీ.సత్యనారాయణలు సిబ్బందితో, మున్సిపల్ కార్యాలయం మీదుగా వెళ్లే రహదారితో పాటుగా, కార్యాలయ పరిసరాల్లో బందోబస్తు, బారికేడ్ల ఏర్పాట్లపై సీఐ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మైనింగ్ కేసులో రంగాకు ముగిసిన పోలీస్ కస్టడీ

గన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మైనింగ్ కేసులో ఏ-2గా ఉన్న ఓలుపల్లి మోహన రంగా పోలీసుల రెండు రోజుల కస్టడీ శుక్రవారం ముగిసింది. రెండోరోజు పోలీసులు 20 నుంచి 25 ప్రశ్నలు వేయగా ప్రతిదానికి తనకేమీ తెలియదని, తానుగా ఏ తప్పు చేయలేదని, ఎవరైనా చేశారేమో తనకు తెలియదని చెప్పినట్టు సమాచారం. విచారణ అనంతరం రంగాను గన్నవరం స్టేషన్ నుంచి విజయవాడ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో ఏవైనా ఇబ్బందులు పెట్టారా అని న్యాయమూర్తి అడగ్గా ఏమీ లేదని చెప్పాడు. అనంతరం రంగాను జిల్లా జైలుకు తరలించారు.

నరదిష్టి పేరుతో బంగారం చోరీ

బెంజ్‌సర్కిల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నరదిష్టి తగలింది.. దిష్టి తీయాలి.. నరదిష్టి పోవాలంటే అన్నదానం చేయాలని మాట కలిపారు.. దేవుడు చందా వేయండని రూ.వెయ్యి తీసుకున్నారు.. దిష్టి తీస్తానని ఉంగరంతో ఉడాయించారు.. ఈ ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. అయ్యప్పనగర్‌కు చెందిన పరుచూరి రాజబాబయ్య వైద్యపరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బందర్‌రోడ్డుపై ఆటో కోసం వేచిచూస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై భవానీ మాల ధరించి ఆయన వద్ద ఆగారు.. చందా వేయండని మాట కలిపి వారి వద్ద ఉన్న పుస్తకం తీసి చందా పేరుతో రాజబాబయ్య నుంచి రూ.వెయ్యి తీసుకున్నారు.. మీకు నరదిష్టి తగిలిందని పూజలు చేయాలని అందుకు రూ.18 వేలు ఖర్చు అవుతాయని నమ్మబలికారు. అంత నగదు తన వద్ద లేవని సమాధానం చెప్పడంతో.. మాల ధరించిన ఒకరికి దేవుడు పూనినట్టు నమ్మించి బంగారంతో దిష్టితీసి ఇస్తానని నమ్మించాడు. ఈ క్రమంలో బాధితుడు తన దగ్గర ఉన్న సుమారు 8 గ్రాముల బంగారు ఉంగరాన్ని తీసి అతని కండువాలో వేశాడు.. వెనక్కి తిరిగి నిలబడండని మరోవ్యక్తి చెప్పడంతో అందుకు రాజబాబయ్య నిరాకరించారు.. ద్విచక్రవాహనంపై వేగంగా వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ కిడ్నాప్.. విడుదల

విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ విశాలాంధ్ర రోడ్డులో ఉన్న శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ కిడ్నాప్ నగరంలో కలకలం రేపింది. ఈ కళాశాల భూమికి సంబంధించి కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రిన్సిపాల్ వంకాలపాటి శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం ఎంజీ రోడ్డులో ఉన్న డిఅడ్రస్ మాల్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ఆయనను గుంటూరు జిల్లాకు చెందిన ఒక నాయకుడి అనుచరులు ఎత్తుకెళ్లినట్టు శ్రీనివాసరావు కుమారుడు శ్రీహరి సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గుంటూరు జిల్లాకు చెందిన శ్రీధర్, రాజేష్ తమ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారని, సాయంత్రం షాపింగ్‌కు వెళ్లిన తన తండ్రి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు ఆయన సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేయగా డిఅడ్రస్ మాల్ వెనుక ఒక భవనంలో ఉన్నట్లు గుర్తించారు. కృష్ణలంక పోలీసులు అక్కడికి చేరుకోవడంతో శ్రీనివాసరావును విడిచిపెట్టారు. దీనితో కిడ్నాప్ కథ సుఖాంతమైంది.

వంతెనలు వచ్చేస్తున్నాయ్!

- సెంట్రల్‌లో ఐదు ఆర్వోబీలు!
- నియోజకవర్గానికి కొత్తకళ
- రైల్వేశాఖతో సంయుక్త కార్యాచరణ
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ నియోజకవర్గంలో నున్న వరకు ఏలూరు రోడ్డుకు ఆనుకుని సత్యనారాయణపురం, గవర్నరుపేట, సీతారాంపురం, చుట్టుగుంట, గాంధీనగర్‌లు నగరంలో ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలోని అజిత్ సింగ్‌నగర్, మధురానగర్, దేవీనగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, రాజరాజేశ్వరిపేట, నున్న ప్రాంతాలు నగరానికి దూరంగా ఉంటాయి. నియోజకవర్గ భౌగోళిక స్థితికి అటు, ఇటుగా ఏలూరు రోడ్డు, బుడమేరు, రైవస్ కాలువలు పలు ప్రాంతాల మధ్య నుంచి ప్రవహిస్తాయి. అజిత్‌సింగ్‌నగర్ నుంచి నగరంలోకి రావాలంటే ఫ్లైఓవర్ ఒక్కటే మార్గం. ప్రస్తుతం బుడమేరు వద్ద ఉన్న ఫ్లైఓవర్ కాలువకు అటు ఇటు ఉన్న



మధురానగర్ వద్ద నిర్మించిన రైలు వంతెన

ప్రాంతాలను కలుపుతుంది. వీటి మధ్య నుంచి రైల్వేలైన్ కూడా ఉండటంతో విజయవాడకు వచ్చే ప్రతి



అజిత్ సింగ్‌నగర్ నుంచి గుణదలకు వేయనున్న ఆర్వోబీ

రైలు అజిత్‌సింగ్‌నగర్, మధురానగర్‌ల మీదుగా వెళ్తుంటాయి. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్‌లు తక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఆర్‌ఓబీలపై దృష్టి పెట్టింది. ఇప్పటికే బుడమేరు ఫ్లైఓవర్ కింద ఒక ఆర్‌ఓబీ, మధురానగర్ ఫ్లైఓవర్ కింద మరొకటి నిర్మించారు. అయితే నియోజకవర్గ పరిధిలో మరో ఐదు ఆర్‌ఓబీలను నిర్మించేందుకు రైల్వే శాఖతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

నిర్మాణానికి సిద్ధమవుతున్న ఆర్ఓబీలు

సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ఐదు ఆర్‌ఓబీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అవి అజిత్ సింగ్‌నగర్ డబుల్ ఫ్లైఓవర్, వాంబేకాలనీ ఫ్లైఓవర్, ఎల్‌సీ నెంబర్ 316, గుణదల ఫ్లైఓవర్, పప్పలమిల్లు సెంటర్. వీటిని 2029 ఎన్నికల నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే గుణదల ఆర్‌ఓబీకి అన్ని అనుమతులు ఇచ్చి ఎస్టిమేషన్ రూపొందించి రైల్వే అధికారులకు పంపింది. గుణదల ఆర్‌ఓబీలో విద్యుత్ లైన్ వందశాతం ఫండింగ్‌తో రైల్వేశాఖ మార్చే విధంగా ఎస్టిమేషన్‌ను సిద్ధం చేసింది. అలాగే మున్సిపల్ డ్రైనేజీ పంపు చేయాలని కోరుతూ మరో ఎస్టిమేషన్ ఇచ్చారు. అలాగే కేర్ అండ్ షేర్, డేఫండమ్ స్కూల్ ఎల్‌సీ నెంబర్ 316 దగ్గర ఆర్‌ఓబీకి కూడా అప్రూవల్ వచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం క్లియరెన్స్‌లన్నీ ఇప్పటికే ఇచ్చింది. మిగతా వాటికి ఎస్టిమేట్‌లను రూపొందించి వీలైనంత త్వరగా నిర్మాణాలను పూర్తి చేసే పనిలో ఉంది.

వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



నియోజకవర్గంలో ఆర్‌ఓబీలను వీలైనంత త్వరగా నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆర్‌ఓబీలకు సంబంధించిన ప్రాథమిక అంచనాలతో తయారుచేసిన ఫైలు హైదరాబాద్‌లోని సీఈ ఆఫీసుకు పంపడం జరిగింది. దీనితో పాటు పప్పులమిల్లు సెంటర్ దగ్గర నిర్మించబోయే ఆర్‌ఓబీ నేతాజీ రోడ్డు దగ్గరైతే అనుకూలంగా ఉంటుందని జేసీ రిపోర్ట్ ఇచ్చారు. ప్రతిపాదనల రిపోర్ట్‌ను తయారుచేసి జూన్ 3న ఎంపీ, కలెక్టర్, డీఆర్ఎం, ఆర్ఆర్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించబోతున్నాం. ఐదు ఆర్‌ఓబీల పూర్తికి కేంద్రప్రభుత్వం సుమారు రూ.400 కోట్లు ఎస్టిమేషన్ తయారుచేయగా.. అప్రోచ్ రోడ్లు, స్థానిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.200 కోట్లు అదనంగా ఇవ్వడానికి అంగీకారం తెలిపింది. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతివారం రివ్యూ మీటింగ్ ఉంటుంది. 15 రోజులకొకసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాజెక్టులను రివ్యూ చేయడం జరుగుతుంది. ఈ మేరకు శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సెంట్రల్ నియోజకవర్గ ఆఫసులో రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్‌కు రైల్వే ఎస్ఎస్ఈ సీనియర్ సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఈఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి విజయ నూతన ఉత్పత్తులు

చిట్టినగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణామిల్క్ యూనియన్ (విజయా డెయిరీ) మార్కెట్‌లోకి నూతన ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చింది. ఆవు, గేదె నెయ్యి 100, 200, 500 గ్రాములు, లీటరు బాటిల్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. శుక్రవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో జరిగిన పాలకవర్గ సమావేశంలో చైర్మన్ చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులతో కలిసి నూతన ఉత్పత్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృష్ణామిల్క్ యూనియన్ పాడి పరిశ్రమకు ఎంతో ప్రోత్సాహం ఇస్తుందన్నారు. విజయ డెయిరీకి దేశ విదేశాల్లో మంచి పేరు ఉందని, నాణ్యమైన నెయ్యి, ఇతర ఉత్పత్తులను మార్కెట్ తక్కువ ధరకే అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గం సమావేశంలో యూనియన్ ఆర్థికాభివృద్ధి, రైతుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించామన్నారు. సహకార రంగంలో గ్రామస్థాయి నుంచే ఆదాయ వనరులు పెరగాలన్నదే సీఎం చంద్రబాబు ఆలోచన అని, అలాగే యూనియన్ రైతులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రైతులు పండించే ఇతర పంటల ద్వారా కూడా ఉత్పత్తులు తయారు చేయాలని నిర్ణయించామని, ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధర వస్తున్న అంశాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. ఈ అంశాలను ప్రభుత్వానికి వివరించి, త్వరలోనే కార్యాచరణ సిద్ధం చేసి రైతులు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చేయూతను అందిస్తామన్నారు. ఎండీ కొల్లి ఈశ్వరబాబు మాట్లాడుతూ, ఆరు దశాబ్దాలుగా నాణ్యతా ప్రమాణాలతో పాలు పాలపదార్థాలు వినియోగదారులకు అందిస్తూ మన్ననలు పొందుతున్న యూనియన్ ఉత్పత్తులకు మంచి స్పందన వస్తుందన్నారు. ఆవు, గేదె నెయ్యి 100 గ్రాములు రూ.80, 200గ్రాములు రూ.160, 500 గ్రాములు రూ 330, లీటరు రూ. 650గా ధర నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు.



నూతన ఉత్పత్తులను విడుదల చేస్తున్న చలసాని ఆంజనేయులు, కొల్లి ఈశ్వరబాబు, పాలక వర్గసభ్యులు

ఇలా ఎప్పటికి పూర్తి చేస్తారు

(3వ పేజీ తరువాయి)

ఆయన కాంట్రాక్టు ఏజెన్సీకి నోటీసులు జారీ చేశారు. సీజన్‌లో బుడమేరుకు వచ్చే వరద వల్ల విజయవాడ పల్లపు ప్రాంతాలకు ఎలాంటి నష్టం జరగకూడదన్నారు. చాలా సీరియస్‌గా తీసుకోవాలని మూడు షిఫ్టులు 24 గంటలు పని జరగాలని ఆయన కాంట్రాక్ట్ ఏజెన్సీని, జలవనరులశాఖ అధికారులను హెచ్చరించారు. ఏం లేని రోజుల్లో నవ్యాంధ్ర ఏర్పడిన రోజున సీఎం చంద్రబాబు బస్సులో 10 రోజులు పడుకొని పని చేసిన రోజులు గుర్తు లేవా అని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివాగుకు వచ్చే వరదకు ఆపోజిట్‌లో బుడమేరు వరద మళ్లింపు (బీడీసీ) కాలువ ఉందని, అందువల్ల పులివాగుకు ఎప్పుడు వరద వచ్చినా గత ఏడాది వరదలకు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి 3.8 కిలో మీటర్ల వద్ద పడిన గండ్ల స్థానం వద్దే మరలా గండ్లు పడే అవకాశం ఉన్నందున అధికారులు, స్థానికులు చెప్పిన విషయాలను దృష్టి ఉంచుకొని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పర్మినెంట్‌గా ఒక సీసీ వాల్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా రూ.23 కోట్ల అగ్రిమెంట్ వాల్యూగా పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే మూడు సార్లు ఇక్కడకు వచ్చి పనుల్ని పరిశీలించి హెచ్చరించినా కాంట్రాక్టు సంస్థ కాని, అధికారులు కాని దీని యొక్క సీరియస్‌నెస్‌ను గుర్తించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో వర్షాలు ముమ్మరం అయ్యేలోగా రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

బెజవాడ బళ్లు.. ఏవోబీలో రయ్.. రయ్!

(3వ పేజీ తరువాయి)

టార్గెట్ చేస్తున్నారు. కొండలపైన ఇళ్లు ఉన్న వాళ్లు కింద ఉన్న మెట్లు, ర్యాంపుల వద్ద నిలిపి ఉంచిన బైకులపై ఎక్కువగా కన్నేస్తున్నారు. ఇటీవల పోలీసులు ఛేదించిన బైక్‌ల చోరీ కేసుల్లో ఎక్కువగా గంజాయి లింక్‌లు బయటపడ్డాయి. విజయవాడ నగరం, ఎన్టీఆర్ జిల్లాలో దొంగిలించిన వాహనాలను గంజాయి కోసం తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం ఇలాంటి 20-25 గ్యాంగ్‌లు ఉన్నట్టు లెక్కలు తీశారు. నగరంలోని భవానీపురం, కొత్తపేట, చిట్టినగర్, మాచవరంలలో కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి. కొండలపై ఇళ్లను నిర్మించుకున్న వారు వాహనాలను కింద ఉన్న మెట్లు, ర్యాంపుల వద్ద పెట్టుకుంటారు.

హ్యాండిల్ లాక్‌లను విరగ్గొటి..

గంజాయి కావాల్సినప్పుడల్లా దొంగలకు డబ్బుల కంటే ముందు బైక్‌లు కనిపిస్తున్నాయి. బైక్‌లను మాయం చేయడానికి ముందు రోజు రాత్రి నగరంలో తిరుగుతూ ఇళ్ల బయట, వీధుల్లో రోడ్ల పక్కన నిలిపి ఉంచిన వాహనాల నుంచి పెట్రోలు దొంగిలిస్తున్నారు. ఆ మర్నాడు రాత్రి అసలు వేటకు బయలుదేరి.. ఎంచుకున్న ప్రాంతాల్లో ఖరీదైన బైక్‌లను మాయం చేస్తున్నారు. హ్యాండిల్ లాక్‌లను విరగ్గొట్టి, కొంతదూరం బైక్‌లను తోసుకుని వెళ్లారు. అక్కడ వైర్ల సాయంతో ఇంజిన్‌ను స్టార్ట్ చేసుకొని ఇళ్ల వద్దకు వెళ్లిపోతారు. ఆ తర్వాత పెట్రోలు బాటిళ్లను బ్యాగ్‌లో పెట్టుకుని పర్యాటకులు మాదిరిగా రెండు బైక్‌లపై ఇద్దరు చొప్పున ఒడిశా ప్రాంతానికి పయనమవుతున్నారు.

పలు మార్గాల ద్వారా సరిహద్దులు దాటి..

చోరీ గ్యాంగ్‌లు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మోతుగూడెం, సీలేరు, డొంకరాయి వైపుగా ఒడిశా సరిహద్దులకు వెళ్తున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీదుగా అల్లూరి జిల్లాలోని సీలేరు సరిహద్దులు దాటుతున్నారు. కొంత మంది తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి గోకవరం, రంపచోడవరం, మారేడుమిల్లి, తులసిపాక, మోతుగూడెం మీదుగా సీలేరు సరిహద్దులు దాటుతున్నారు. డొంకరాయి-సీలేరుకు మధ్య 16-18 వరకు గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఇవన్నీ ఒడిశా సరిహద్దుల్లో కొండలపై ఉంటాయి. దొంగలు సరిహద్దులు దాటిన తర్వాత పర్యాటకుల్లా మారిపోతున్నారు. ఒకరోజు రాత్రంతా అక్కడి అడవుల్లో ఎంజాయ్ చేస్తూ గంజాయి ఏజెంట్ల గురించి వాకబు చేస్తున్నారు. ఏజెంట్లు చెప్పే ధరలను బట్టి లెక్కలు వేసుకుని ఒక బైక్‌ను వారికి ఇచ్చేస్తున్నారు. 5-10 కిలోల వరకు గంజాయిని కొనుగోలు చేస్తున్నారు. పని పూర్తయిన తర్వాత మరో బైక్‌పై తిరుగు ప్రయాణమవడం జరుగుతున్న తంతుగా ఉంది.

ఈ ఏడాది 185 బైకులు మాయం

ఈ ఏడాది ఇప్పటి వరకు విజయవాడలో మొత్తం 365 చోరీలు జరిగాయి. ఇందులో 185 బైక్‌లు మాయమయ్యాయి. పోలీసులు గంజాయి గ్యాంగ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా.. 35-40 బైక్‌లను ఒడిశా సరిహద్దుల్లోని కొండలపై గుర్తించారు. గంజాయిని తీసుకొచ్చేటప్పుడు మార్గమధ్యలో ఎక్కడైనా పోలీసులకు చిక్కితే దొంగలు అక్కడే బైక్‌ను వదిలేస్తున్నారు. పోలీసు చెక్‌పోస్టులు దాటుకుని జిల్లాకు చేరుకున్న తర్వాత ఆ వాహనానికి నకిలీ రికార్డులు తయారు చేసి, కాలేజీ విద్యార్థులకు తక్కువ ధరకు అమ్మేస్తున్నారు. లేకుంటే ఇతర జిల్లాల్లోని శివారు ప్రాంతాలకు తీసుకెళ్లి తుప్పల్లో పడేస్తున్నారు.

'జీపీఎస్ ట్రాకర్' డ్రైవ్ చేపట్టాం

కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న బైక్‌ల దొంగతనాలపై దృష్టి పెట్టినప్పుడు గంజాయి వ్యవహారాలు కనిపించాయి. ఇక్కడ దొంగిలించిన బైక్‌లను ఒడిశా సరిహద్దుల్లోకి తీసుకెళ్లి అమ్మేస్తున్నారు. ఆ డబ్బులకు గంజాయిని తెచ్చుకుంటున్నట్టు గుర్తించాం. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఇళ్లల్లో బైక్‌లను పార్కింగ్ చేసుకొనే పరిస్థితి లేదు. అందుకోసమే బైక్‌లకు జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు చేయించుకోవాలని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా విజయవాడలో కొండ ప్రాంతాలపై నివసిస్తున్న వారి బైక్‌లకు జీపీఎస్ ఏర్పాటు చేయిస్తున్నాం. కొత్తగా ఆర్ఎఫ్ఐడీ(రేడియల్ ఫ్రీకెన్సీ ఐడెంటిఫికేషన్) స్టిక్కర్లను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. అని బైక్ షోరూంలకు నోటీసులు ఇచ్చాం. కొత్తగా విక్రయించే బైక్‌లకు జీపీఎస్ ట్రాకర్ అమర్చాలని తెలియజేశాం. బైక్‌లను పార్క్ చేసేటప్పుడు సీసీ కెమెరాల్లో కనిపించేలా పెట్టాలని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

-ఎస్వీ రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

2.27లక్షల మందికి ..

(3వ పేజీ తరువాయి)

చూడాలన్నారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. టెలీకాన్ఫరెన్సులో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

బైక్ చోరీలకు 'చైన్' లాక్!

(ఆంధ్రజ్యోతి -విజయవాడ): చాలా మంది ప్రయాణికులు బస్టాండ్, రైల్వే స్టేషన్ వరకు ద్విచక్ర వాహనాలపై వెళ్తారు. అక్కడ స్కూటర్ స్టాండ్లలో వాహనాలను పెట్టకుండా బయట ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పార్క్ చేస్తారు. ఉదయం ఊరు వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చేద్దామని ప్రయాణాలను రూపొందించుకున్న వారిలో ఎక్కువ మంది ఇదే పని చేస్తున్నారు. ఇలా పార్క్ చేసిన వాహనాలను చేతివాటం గ్యాంగ్ నిశితంగా పరిశీలిస్తోంది. ద్విచక్ర వాహనాలు పార్క్ చేయడం మొదలు వారు బస్సు, రైలు ఎక్కేవరకు అన్ని కదలికలను గమనిస్తోంది. ఆ తర్వాత బైక్‌లను మారుతాళాలతో అక్కడి నుంచి మాయం చేస్తున్నారు. ఇదంతా నాణేనికి ఒక వైపు. ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలను కొంతమంది రెక్కీ చేసి ఎత్తుకుపోతున్నారు. ఎండాకాలం కావడం, ఉక్కపోతలకు కుటుంబమంతా ఇళ్లలో ఏసీలు ఆన్ చేసుకుని గాఢ నిద్రలో ఉండడంతో అర్ధరాత్రి వీధుల్లో తిరుగుతున్న దొంగలు కనిపించిన వాహనాలను మాయం చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో గడచిన ఏడాది 230 మంది ద్విచక్ర వాహనాలు చోరీ అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 185 వాహనాలు మాయమయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో ఖాళీ ఉంటే వాహనాలను పెట్టేసి ఎక్కడెక్కడికో వెళ్లిపోతున్న వారికి భద్రత భరోసాను ఇవ్వడానికి పోలీసులు ఇనుప గొలుసులను ఉపయోగిస్తున్నారు. కిలోమీటరు, రెండు కిలోమీటర్ల దూరానికి సరిపడే విధంగా ఇనుప గొలుసులను కిలోల లెక్కన కొనుగోలు చేస్తున్నారు. రెండు కొనల వద్ద తాళం వేసేవిధంగా రింగ్‌లను అమర్చుతున్నారు. ఆ గొలుసులను వాహనాల చక్రాల మధ్య నుంచి తీసుకెళ్లి రెండు కొనలను కలిపి తాళం వేస్తున్నారు. ఇలా ఎన్ని వాహనాలు ఉంటే అన్ని వాహనాలకు గొలుసులను అల్లేసి తాళాలు వేస్తున్నారు. దీనితో ఏ వాహనాన్ని ఇక్కడి నుంచి కదపలేని పరిస్థితి.

ఒరిజినల్ ఆర్‌సీ బుక్, డ్రైవింగ్ లైసెన్స్ చూపితేనే..

వాహనానికి సంబంధించిన యజమానులు వచ్చి వాటిని తీసుకోవాలంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఒరిజినల్ ఆర్‌సీ బుక్, డ్రైవింగ్ లైసెన్స్‌లను చూపించాలి. ఈ విధంగా చేస్తేనే బైక్ అన్‌లాక్ అవుతుంది. లేకపోతే లాక్‌లోనే ఉంటుంది. ప్రస్తుతం కృష్ణలంక, భవానీపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో గొలుసుల ప్రణాళికలను అమలు చేస్తున్నారు. భవానీపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ ప్రజల జీవన పరిస్థితులు ఇతర ప్రాంతాల వారి కంటే భిన్నంగా ఉంటాయి. ఇక్కడ ఇళ్లన్నీ కొండలపై ఉంటాయి. వారి వాహనాలను కొంతమేరకు మాత్రమే తీసుకెళ్లగలరు. ఆ తర్వాత పైన ఉన్న ఇళ్ల వాళ్లంతా వాహనాలను ఒకచోట నిలుపుకుని తాళాలు వేస్తారు. మరికొంత మంది ప్రధాన రహదారికి పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో పార్క్ చేస్తున్నారు. ఈ వాహనాలకూ గొలుసులను అల్లి తాళాలు వేస్తున్నారు.

బైక్ చోరీలు తగ్గాయి

బైక్‌లు చోరీ అవుతున్నాయని ఫిర్యాదులు పెరగడంతో చైన్‌లాక్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నాం. దీనివల్ల సత్ఫలితాలు కనిపించాయి. ముందుగా కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో అమలు చేశాం. ఇక్కడ బస్టాండ్ ఉంది. నిత్యం ఏదో ఒక ఫిర్యాదు బైక్ చోరీలపై వచ్చేది. ఇక్కడ ఇప్పుడు బైక్ చోరీలు తగ్గాయి. ఆ తర్వాత కొండ ప్రాంతాల్లో అమలు చేస్తున్నాం. సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రైల్వేస్టేషన్‌లోనూ దీన్ని అమలు చేస్తున్నాం.

- ఎస్వీ రాజశేఖరబాబు, పోలీస్ కమిషనర్

గన్నవరం వైసీపీ ఇన్‌చార్జిగా పంకజశ్రీ?

- నేడు కార్యకర్తలతో సమావేశం

విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సతీమణి పంకజశ్రీ నియమితులయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వంశీ జైల్లో ఉండడంతో నియోజకవర్గంలో పార్టీని నడిపించే నాథుడు లేకుండా పోయాడు. ఈ పరిస్థితుల్లో పార్టీ వ్యవహారాలను నడిపించేందుకు వీలుగా వంశీ సతీమణిని రంగంలోకి దింపాలని వైసీపీ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. గన్నవరంలోని బుద్ధవరం రోడ్డులో వైసీపీ కార్యాలయం కొలువుదీరింది. దీనిని ఇటీవల కాలంలో ఆధునీకరించారు. ఈ పనులు జరుగుతుండగానే వంశీ అరెస్టై జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఈ కార్యాలయాన్ని శనివారం ఉదయం ప్రారంభించబోతున్నారు. ఈ కార్యక్రమానికి వైసీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నానితో పాటు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు హాజరు కాబోతున్నారు. ఎన్టీఆర్ జిల్లా వైసీపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలోనే పంకజశ్రీ పేరును ఇన్‌చార్జిగా ప్రకటిస్తారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

జోరుగా పేకాట!

(3వ పేజీ తరువాయి)

పాటించాల్సిన పోలీసులు పెద్దల పేకాటకు రెడ్‌కార్పెట్ వేస్తూ, సామాన్యులను వెంటాడి పట్టుకోవడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తుంది. ఇప్పటి వరకూ డివిజన్‌లో నమోదైన పేకాట కేసుల్లో ఒక్కరైనా రాజకీయ, ఆర్థిక పలుకుబడి ఉన్నవారు లేక పోవడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటికైనా పోలీసులు చిత్తశుద్ధితో పని చేసి రిక్రియేషన్ క్లబ్‌లతో పాటు నందిగామ పాత బస్టాండ్‌లోని పేకాట శిబిరంపై ఉక్కుపాదం మోపాల్సి ఉంది.

పేకాటను ఉపేక్షించేంది లేదు : ఏసీపీ ఏబిజి తిలక్

డివిజన్‌లో పేకాట నిర్వహణపై ఏసీపీ ఏబిజి తిలక్‌ను వివరణ కోరగా, గతంలో రిక్రియేషన్ క్లబ్‌లలో జరిగాయని, వాటిని నిలువరించినట్లు తెలిపారు. ప్రస్తుతం క్లబ్‌లలో పేకాట ఆడుతున్న సమాచారం లేదన్నారు. ఇకపై క్లబ్‌ల వద్ద నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. నందిగామ పాత బస్టాండ్‌లో నిర్వహిస్తున్న శిబిరంపై కూడా ఆరా తీస్తామన్నారు. పేకాటనిర్వహణను ఉపేక్షించేది లేదన్నారు. సిబ్బంది ఎవరైనా వారికి సహకరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

వైద్య విద్యార్థినికి కరోనా!

(3వ పేజీ తరువాయి)

ప్రస్తుతం కరోనా వేరియంట్ అంత ప్రమాదకరమేమీ కాదని, సాధారణ జ్వరం లాంటిదేనని పేర్కొన్నారు.

భయపడాల్సిన పనిలేదు : డాక్టర్ నవీన్

కరోనా లక్షణాలు ఉన్నప్పటికీ భయపడాల్సిన అవసరం లేదు. కోవిడ్ లక్షణాలు ఉన్నవారు కనీసం వారం రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంటూ వైద్యుల సూచనల మేరకు మెడిసిన్ వాడితే సరిపోతుంది. ఇతర ఆరోగ్య సమస్యలు లేని వారు వైద్యుల సూచనలతో ఇంటివద్దే క్వారంటైన్‌లో ఉండొచ్చు. దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారు మాత్రం కరోనా విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఒకవేళ కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలతో ఆసుపత్రిలో, ఇంటిలోనో క్వారంటైన్ ఉండడం ఉత్తమం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

ఈవీఎం సెక్యూరిటీ సిబ్బందికి ఫ్యాన్ల వితరణ

పటమట, మే 30 (ఆంధ్రజ్యోతి): వేసవికాల అధిక ఉష్ణోగ్రతలతో, తీవ్ర ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నామని జిల్లా ఈవీఎం గోదాం సెక్యూరిటీ సిబ్బంది ఫ్యాన్ కావాలని చేసిన విజ్ఞప్తి మేరకు కాకాని ఆశయ సమితి అధ్యక్షుడు, బీజేపీ జిల్లా నాయకుడు కాకాని తరుణ్ నాలుగు ఫ్యాన్లు వితరణగావించారు. గొల్లపూడిలోని ఈవీఎం గోదాముల వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి శుక్రవారం తరుణ్ ఫ్యాన్లు అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మిశ సేవ కార్యక్రమాల్లో ముందుంటూ నేటి తరానికి మార్గదర్శకులుగా తరుణ్ కాకాని నిలవడం అభినందనీయమన్నారు.

ప్రముఖ రచయిత్రి సత్యవతితో కథాసంధి రేపు

విజయవాడ కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ, విజయవాడ సాహితీమిత్రులు సంయుక్త నిర్వహణలో ప్రముఖ కథా రచయిత్రి పి.సత్యవతితో కథాసంధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనువాదంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న సత్యవతి తెలుగు కథా రచనలో ఉన్నత స్థాయి రచయిత్రి అని, ఇల్లలకగానే, సూపర్ మామ్ సిండ్రోమ్, దమయంతి కూతురు లాంటి కథలు స్త్రీవాద దృక్కోణంలో పాఠకులను ఆలోచింపచేశాయని వారు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రజాశక్తినగర్‌లోని శిఖర స్కూల్‌లో జరిగే కథాసంధి కార్యక్రమంలో ఆమె తన కథా రచన నేపథ్యాన్ని వివరించి కథా పఠనంతో పాటు ప్రేక్షకుల ప్రశ్నలకు జవాబులు చెబుతారని వారు తెలిపారు.

రోడ్డుకిరువైపులా వాహనాల పార్కింగ్

ఐదో నెంబర్ రమేష్ ఆసుపత్రి రోడ్డులో వాహనదారుల పాట్లు



రమేష్ ఆసుపత్రి రోడ్లో వరలక్ష్మి నగర కాలనీ వైపు నిలిపిన వాహనాలు, పోస్టాఫీస్ సమీపంలో ద్విచక్రవాహనాలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ఐదో నెంబర్ రోడ్డు అసలే ఇరుకు రోడ్డు, దానికితోడు రోజురోజుకు పెరిగిపోతున్న అక్రమ వాహనాల పార్కింగ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు వరలక్ష్మీ నగర్, ఎల్ఐసీ కాలనీలకు ప్రధాన రహదారి కావడంతో పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళ్లలో నిత్యం రద్దీగా ఉంటుంది. రమేష్ ఆసుపత్రి సెంటర్ నాలుగు రోడ్ల కూడలి. ఈ సెంటర్‌కు సమీపంలో ఉన్న రమేష్ ఆసుపత్రికి వైద్య కోసం కోసం వచ్చే వారు తమ వాహనాలను ఐదో నెంబరు రోడ్డులో ఇరువైపులా నిలిపివేస్తున్నారు.. ఈ వాహనాలు గంటల కొద్ది నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు అంటున్నారు. సాయంత్రం సమయంలో ఈ రోడ్లో ప్రయాణించాలంటే ట్రాఫిక్‌లో ఎక్కువ టైం కేటాయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



బహుమతుల ప్రదాన కార్యక్రమంలో నాల్గో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు

ముగిసిన వేసవి స్విమ్మింగ్ శిక్షణ

భారతీనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని వీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటి నుంచి 30వ వరకు నిర్వహించిన వేసవి స్విమ్మింగ్ శిక్షణ శుక్రవారంతో ముగిసిందని స్విమ్మింగ్ కోచ్ ఎం.కుసుమకుమారి తెలిపారు. ఆఖరిరోజు చిన్నారులకు స్విమ్మింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో బాలురు. వై కార్తీక్ (గోల్డ్), టి.రుషేంద్రకుమార్(సిల్వర్),టి. జశ్వంత్(బ్రాంజ్), బాలికలు యు. సాయివశిష్ట(గోల్డ్), వై. కీర్తన (సిల్వర్), వై దీక్షిత (బ్రాంజ్) విజేతలుగా నిలిచారు. స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు మెడల్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో వీఎంసీ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్ అధికారి కె. లత, మెడల్స్ అందజేసిన దాత అరుణ, పూల్ నిర్వాహకులు బహదూర్, గౌతమ్, పూల్ ఇన్‌చార్జి అప్పారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిమెంట్ దిమ్మె సరిచేయండి

పటమట, మే 30 (ఆంధ్రజ్యోతి): పటమట సెంటర్ ముఖ ద్వారంలో డ్రెయినేజీపై పూడిక తీసి దానిపై చాలీచాలని సిమెంట్ దిమ్మెను వేశారు. ఆ దిమ్మె డ్రెయినేజీపై ఎగుడు దిగుడుగా ఉంది. ఒక పక్క లేచి ఒకపక్క దిగిపోయి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సరైన దిమ్మెను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రెయినేజీపై ఉన్న చాలీచాలని సిమెంట్ దిమ్మె

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనండి

కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చే నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని నగర కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఇంటర్నేషనల్ యోగా డే పార్టిసిపెంట్ సర్వేలో పాల్గొని తమ సమ్మతిని తెలపవచ్చని పేర్కొన్నారు. సచివాలయం సిబ్బంది వచ్చినప్పుడు ఇంటర్నేషనల్ యోగా దినోత్సవంలో మీకు పాల్గొనేందుకు ఆసక్తి ఉందా లేదా అనే ప్రశ్నతో చేస్తున్న సర్వేలో ప్రజలు పాల్గొని, ఆసక్తి ఉన్నవారు తెలిపి పాల్గొనే సదవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కమిషనర్ తెలియజేశారు.

ప్రజల వద్దకు వచ్చిన సచివాలయం సిబ్బందికి ఓటీపీ తెలిపి వారు ఈ సర్వేలో సహకరించాలని కోరారు. నగరపాలకసంస్థ పరిధిలోని 64 వార్డులలో యోగాంధ్ర కార్యక్రమాలను దిగ్విజయం చేసేందుకు ప్రజలు, సిబ్బంది పాల్గొని ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగా చేస్తున్నారని కమిషనర్ తెలిపారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

పటమట, మే 30 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవం విజయవాడ కార్మికుల అడ్డా వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బెంజిసర్కిల్ కార్మికుల అడ్డా వద్ద తూర్పు నగర్ ముఠా నాయకులు మాజేటి నాగమల్లేశ్వరరావు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సీఐటీయూ భారతదేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా ఉందన్నారు. 1970 మే 30న ఈసంస్థ ఆవిర్భవించిందన్నారు. కార్మికుల కోసం నిరంతరం శ్రమిస్తూ కార్మిక శక్తిని వెలికితీస్తూ అనేక కార్మిక చట్టాలను పోరాడి కార్మికులకు అందించిందన్నారు. జూలై 9న జరిగే దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సీఐటీయూ నాయకులు వి.బి రాజు, సత్యారావు, నరసింహారావు, జి.బుజ్జి, జోగి నాయుడు, బి.నాగరాజు, కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ, నిర్వాహకులు

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

● గ్రంథాలయ కార్యశాల ముగింపు సభలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

గవర్నర్‌పేట, మే 30 (ఆంధ్రజ్యోతి): నిరంతర పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం అందుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. గోపాలరెడ్డి రోడ్డులోని విజయవాడ పుస్తక మహోత్సవ సంస్థ భవన్‌లో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక, విజయవాడ పుస్తక మహోత్సవ సంస్థ, స్వేచ్ఛ ఆంధ్ర సంయుక్త ఆధ్వర్యంలో గత 11 రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ కార్యశాల శుక్రవారం ముగిసింది. చక్కని ప్రతిభ కనబర్చిన చిన్నారులకు పుస్తకాలు జ్ఞాపికలుగా అందజేశారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మాతృభాషను, తెలుగు వారి కీర్తిని దశదిశలా వ్యాప్తి చేయాలని కోరారు. పిల్లల్లో చదువు పట్ల, గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంచడంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా ఆయన బాలలు చేస్తున్న కార్యక్రమాలను వీక్షించి, వారిలో ఉన్న నైపుణ్యాలను మెచ్చుకున్నారు. నిర్వాహకుల్ని అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన నిర్వాహకుడు గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ గ్రంథాలయ పునర్వికాసానికి చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పుస్తక మహోత్సవం సంస్థ అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి మనోహర్ నాయుడు, కేవీవీ ప్రతినిధి కె. శ్రీనివాస్, పల్లవి, వెంకట నారాయణ, రెహమాన్, అరసం మోతుకూరి అరుణ్‌కుమార్, జేపీ ప్రసాద్, నిహారిక, విశ్వేశ్వరరావు, హసీనా, శోభన, బోయి రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారమే ధ్యేయం

ఆల్ ఇండియా బీఎస్పీ జాతీయనేత పూర్ణచంద్రరావు

గాంధీనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల రాజ్యాధికారమే ధ్యేయంగా ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ (ఏబీఎస్పీ) జాతీయ కో-ఆర్డినేటర్ జే.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం ఆశయాలకు విరుద్ధంగా మాయావతి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీంతో నూతన పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా బక్కా పరంజ్యోతి, రాష్ట్ర అధ్యక్షుడుగా లక్కే రాజారావులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి 2029లో రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.



దుర్గగుడి కళావేదిక పై నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

దుర్గగుడిలో అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి, మే 30 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలో ఉన్న కళావేదిక మీద శుక్రవారం శ్రీగాయత్రి నృత్య నికేతన్, విజయవాడకు చెందిన కళాబృందం అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. శ్రీగాయత్రి నృత్యనికేతన్ గురువు గాయత్రి ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పలు కీర్తనలకు శ్రీగాయత్రి నృత్య నికేతన్ విద్యార్థులు గోరంట్ల నిహారిక, గహనా శ్రీవల్లి మరికొందరు విద్యార్థులు లయబద్ధంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.

దుర్గగుడిలో ఈవో తనిఖీలు



ఇంద్రకీలాద్రి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి ఈవో శీనానాయక్ శుక్రవారం పలు విభాగాలను పరిశీలించారు. దేవస్థానంలో కొండపైన, కొండ దిగువన జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో పనులపై చర్చించి, పనులు నాణ్యతతో ఉండేలా త్వరితగతిన పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. శుక్రవారం భక్తుల రద్దీ దృష్ట్యా పలు ప్రదేశాల్లో ఏర్పాట్లను, టాయిలెట్‌లు, త్రాగునీటి కుళాయిలు, తదితరాలను ఆకస్మికంగా పరిశీలించి వసతులను మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర ప్రేమికులను ఆకట్టుకున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో గురువారం ప్రారంభమైందని, జూన్ 2 వరకు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సమ్మర్, వెడ్డింగ్ ప్రత్యేకంగా అన్నీ లేటెస్ట్ వెరైటీలు, కొత్త డిజైన్లతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక, సంప్రదాయ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 150 సర్టిఫైడ్ వీవర్స్, బెస్ట్ డిజైనర్స్ నుంచి సిల్క్, కాటన్ శారీ, డిజైనర్ వేర్, ఎథ్నిక్ వేర్, కుర్తి, ఫ్యాషన్ జ్యూయలరీ, హోమ్ లినెన్ ఇంకా మరెన్నో వెరైటీలు అద్భుతమైన డిజైన్లు ఈ ఎక్స్‌పోలో అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటలవరకు ఉంటుందని తెలిపారు.

సీపీఎం రాజకీయ తరగతులు రేపటి నుంచి

హనుమాన్‌జంక్షన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వ ర్యంలో ఆదివారం నుంచి జూన్ 3 వరకు ముఖ్య కార్యకర్తలు, నాయకులకు రాజకీ య శిక్షణ తరగతులు హనుమాన్‌జంక్షన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ బాపులపాడు మండల కార్యదర్శి బేత శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శిక్షణా తరగతులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని, భవిష్యత్తు ఉద్యమాలకు నాయకులు, కార్యకర్తలను క్రియాశీలకంగా తయారు చేయడమే శిక్షణ తరగతుల ఉద్దేశ్యమని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే తరగతులకు నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకట్రావు, వి.రాంభూపాల్ తదితరులు ఉపాధ్యాయులుగా హాజరవుతారని తెలిపారు.

రుతుపవనాల రాకతో తొలకరి వర్షాలు ఆరంభమయ్యాయి. దీంతో చందర్లపాడు మండలం గుడిమెట్లలో వజ్రాల వేట మొదలైంది. అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వస్తున్న ఔత్సాహికుల రాకతో గుడిమెట్ల సందడిగా మారింది. తొలకరి వర్షాలు పడినప్పుడల్లా వజ్రాల అన్వేషకులు, స్థానికులు గుడిమెట్లకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్వేషణ సాగిస్తుంటారు. ప్రస్తుతం తొలకరి పులకరించడంతో భారీ సంఖ్యలో ప్రజలు వజ్రాల వేటకు వస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో వజ్రాల అన్వేషణపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..





గుడిమెట్ల వద్ద కృష్ణానది, వజ్రాల కోసం వెదుకుతున్న మహిళలు



వజ్రాల కోసం వెదుకులాడి, అలసిపోయి, చెట్ల కింద విశ్రాంతి తీసుకుంటున్న ఇతర ప్రాంతాల వారు

వజ్రాల వేట!

తొలకరి పలకరింపుతో కృష్ణా తీరం వెంబడి పొలాల్లో వెదుకులాట ● గుడిమెట్లకు భారీగా తరలివచ్చిన అన్వేషకులు, స్థానికులు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల): కృష్ణా తీరం వజ్ర సంపదకు నిలయం. నదీ పరివాహక ప్రాంతంలో గతంలో విలువైన వజ్రాలు దొరికాయి. ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో ఇంతకు ముందు తవ్వకాలు కూడా జరిగాయి. ఇప్పటికీ తీరగ్రామాల్లో అడపాదడపా వజ్రాలు దొరుకుతూనే ఉన్నాయి. వర్షాకాలంలో వజ్రాల కోసం ఎక్కువగా వెదుకుతుంటారు. వజ్రం దొరుకుతుందన్న ఆశతో స్థానికులే కాకుండా, దూరప్రాంతాల నుంచి వచ్చి, ఇక్కడే ఉంటూ గాలిస్తుంటారు.

ఖరీదైన వజ్రాలకు నెలవు

కృష్ణానది తీరంలో విలువైన వజ్రాలు దొరుకుతాయి అనడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. బ్రిటీష్ ప్రభుత్వం అధీనంలో ఉన్న, ఎంతో విలువైన, ప్రపంచ ప్రసిద్ధి చెందిన కోహినూర్ వజ్రం కూడా కృష్ణా తీరంలోనే దొరికింది.

పరిటాల కేంద్రంగా నిజాం పాలన

ఖరీదైన వజ్రాలు లభిస్తుండటంతో స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం నవాబు పరిటాల, మోగులూరు, బత్తినపాడు, గనిఆత్కూరు(ఈ నాలుగు గ్రామాలు కంచికచర్ల మండలం), చందర్లపాడు మండలం కొడవటికల్లు, ఉస్తేపల్లి, నూజివీడు దగ్గర ఉన్న మల్లవల్లి గ్రామాలను మాత్రం ఈస్ట్ ఇండియా కంపెనీకి అప్పగించలేదు. పరిటాల కేంద్రంగా పాలన చేశారు.

వర్షం కురిసిన మరుసటిరోజు నుంచి..

వజ్రాలు వర్షాకాలంలో ఎక్కువగా దొరుకుతుంటాయి. వర్షం కురిసిన మరుసటి రోజు ఎక్కువ మంది వజ్రాల కోసం వెదుకుతుంటారు. వర్షానికి మట్టి పైభాగం(పొర) కొట్టుకుపోతుంది. పొర కింద ఉండే వజ్రాలు బయటపడతాయి. మట్టి తవ్వకుండానే నిశితంగా పరిశీలిస్తూ వెదుకుంటారు. సాగుభూముల్లో కూడా వజ్రాలు దొరికాయి. రెండేళ్ల క్రితం పొలం దున్నుతుండగా కొడవటికల్లుకు చెందిన ఒక రైతుకు విలువైన వజ్రం దొరికింది. ఆ గ్రామంలోనే రెండు మూడు వజ్రాలు దొరికాయి. అంతకు ముందు ఉస్తేపల్లిలో ఒకరికి దొరికింది. వజ్రం దొరికిందంటే మూడో కంటికి కూడా తెలియనీయరు. తెలిస్తే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్న భయంతో చాలా జాగ్రత్తగా ఉంటారు. మధ్యవర్తుల ద్వారా వ్యాపారులను కలిసి విక్రయిస్తుంటారు. వజ్రాలు కొనేందుకు స్థానికంగా కూడా వ్యాపారులు ఉన్నారు.

మూలన పడిన ఎన్ఎండీసీ ప్రాజెక్టు

వజ్రాలు దొరుకుతుండటంతో నేషనల్ మినరల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) ప్రత్యేకంగా ఒక ప్రాజెక్టును నెలకొల్పింది. కొన్నేళ్ల క్రితం చందర్లపాడులో వజ్రాలను గుర్తించేందుకు యంత్రాలను ఏర్పాటు చేసింది. యాభై మంది ఉద్యోగులు ఉండేవారు. ఆ ప్రాంతంలో మట్టిని, రాళ్లను తెచ్చి శుద్ధి చేసేవారు. కొద్ది సంవత్సరాల తర్వాత ప్రాజెక్టు మూలనపడింది. ఖర్చు తప్పితే ఆశించిన విధంగా పెద్ద సంఖ్యలో వజ్రాలు లభించనందున గిట్టుబాటు కాకపోవటంతో యంత్రాలను ఇతర ప్రాంతాలకు తరలించారు.

ఇరవై ఏళ్ల క్రితం
రూ.కోట్లు పలికిన పరిటాల వజ్రం

పరిటాల గ్రామంలో వజ్రాల కోసం నిత్యం వెదుకుతూనే ఉంటారు. ఇంతకు ముందు పరిటాలలో విలువైన వజ్రాలు ఎక్కువగానే దొరికాయి. వజ్రాల వ్యాపారులు కూడా పరిటాల చుట్టూ తిరుగుతుండేవారు. రెండు దశాబ్దాల క్రితం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మించారు. రోడ్డుకు చెరువు మట్టి తోలుతుండగా, విలువైన వజ్రం దొరికింది. స్థానికంగా రూ.లక్షల్లో చేతులు మారగా, చివరగా ముంబై మార్కెట్లో రూ.కోట్లలో పలికింది. అప్పట్లో వజ్రాలు వెతికేందుకు వేలల్లో జనాలు రావడంతో అదుపుచేసేందుకు పోలీసులు నానాతంటాలు పడ్డారు. అడపాదడపా చిన్న చితకా వజ్రాలు దొరుకుతున్నాయి.

ఉదయం నుంచి
చీకటి పడేంత వరకు అన్వేషణ



రంగురాళ్లు

చందర్లపాడు మండలం గుడిమెట్ల (రామన్నపేట) కృష్ణా నది ఒడ్డున ఎర్ర మట్టితో కూడిన గట్టు పోరంబోకు ఉంది. మట్టిని తవ్వుతూ నిశితంగా పరిశీలిస్తూ మెరుస్తున్న రాళ్లను, రంగురాళ్లను ఏరుతున్నారు. తెల్లారటం ఆలస్యం గాలింపులో నిమగ్నమైపోతున్నారు. చీకటి పడేంత వరకు ఏరుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది అక్కడే వంట చేసుకుంటున్నారు. ఇక్కడ ఏడాది పొడవునా పదుల సంఖ్యలో జనాలు రాళ్ళు ఏరుతుంటారు. ఐదు నెలల క్రితం గుంటూరు జిల్లాకు చెందిన ఒకరికి ఇక్కడ విలువైన వజ్రం దొరికింది. కొన్నేళ్ల క్రితం మూడు నాలుగు వజ్రాలు దొరికాయి.

డ్రైవర్ మావయ్య బ్లాక్‌మెయిల్ బుద్ధి

- బాలిక అసభ్యకర ఫొటోలు చూపించి డబ్బులు డిమాండ్.. పోలీసులకు ఫిర్యాదు
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

విజయవాడ/బెంజ్‌సర్కిల్, మే 30(ఆంధ్రజ్యోతి): మావయ్య అన్న పిలుపును అతడు మరో కోణంలో చూశాడు. బాలికను మాయమాటలతో లొంగదీసుకున్నాడు. బాలికను అసభ్యకరంగా చిత్రీకరించి ఆ ఫొటోలను చూపించి కుటుంబాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. ఈ ఘటన విజయవాడలో జరిగింది. దర్శిపేటకు చెందిన కుటుంబం గడచిన ఏడాది ఏడాది సెప్టెంబరులో కృష్ణాజిల్లాలోని మంగినపూడి బీచ్‌కు వెళ్లింది. విజయవాడ నుంచి వెళ్లడానికి ఈ కుటుంబం ఒక క్యాబ్‌ను బుక్ చేసుకుంది. కైకలూరుకు చెందిన రాజు అనే యువకుడు డ్రైవర్‌గా వచ్చాడు. మంగినపూడి బీచ్‌లో ఈ కుటుంబంతో బాగా కలిసిపోయాడు. ఈ కుటుంబంలో మహిళను అక్క అని పిలవడం మొదలుపెట్టాడు. ఆమె తన కుమార్తెతో రాజును మావయ్య అని పిలిపించింది. అప్పటి నుంచి మావయ్య అని పిలుస్తుండేది. ఇక అప్పటి నుంచి ఈ కుటుంబంలో ఒక సభ్యుడిగా మెలిగాడు. కొద్దినెలల క్రితం ఆ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమెను రాజు ఇంటికి తీసుకొచ్చి తల్లిదండ్రుల వద్ద ఉత్తముడిగా మార్కులు వేయించుకున్నాడు. బాలికను తీసుకురావడానికి రూ. లక్ష వరకు ఖర్చులయ్యాయని రెండు దఫాలుగా రూ. 50వేల చొప్పున వసూలు చేశాడు. కన్న కుమార్తె ఇంటికి తిరిగొచ్చిందని ఆనందపడుతున్న సమయంలో తల్లిదండ్రులకు రాజు మరో ఝలక్ ఇచ్చాడు. బాలికను అసభ్యకరంగా చిత్రీకరించి కొద్దిరోజులుగా డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టాడు. ఈ ఫొటోలు, వీడియోలు తన స్నేహితుడి వద్ద ఉన్నాయని అతడు డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని కథలు అల్లాడు. అడిగిన మొత్తం ఇవ్వకపోతే వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరిస్తున్నాడు. రోజూ డబ్బుల కోసం ఈ హింస పెరగడంతో బాలిక తల్లిదండ్రులు పటమట పోలీసులను ఆశ్రయించారు. రాజుపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

దానాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు

ఒంగోలులో అదనపు స్టాపు

రైల్వేస్టేషన్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యం కోసం దానాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు ఒంగోలులో అదనపు స్టాపు కల్పిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'దానాపూర్ -ఎస్ఎంవీటి బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ (03251, 03259) జూన్ 1వ తేదీన అర్ధరాత్రి 1.28 గంటలకు ఒంగోలుకు చేరుకుని 1.30 గంటలకు బయలుదేరుతుంది. ఎస్ఎంవీటీ బెంగుళూరు-దానాపూర్ ఎక్స్‌ప్రెస్(03252, 03260) జూన్ 3వ తేదీన ఒంగోలుకు పగలు 11.58 గంటలకు చేరుకుని 12 గంటలకు బయలుదేరుతుంది.' అని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

16, 18న రద్దు..

బలార్షా-కాన్పూర్ మార్గంలో 3వ ట్రాక్ నిర్మాణ పనుల కారణంగా బెల్లంపల్లి యార్డులో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా 03251 దానాపూర్- ఎస్ఎంవీటి బెంగళూరు రైలును జూన్ 16వ తేదీన, 03252 ఎస్ఎంవీటీ బెంగళూరు-దానాపూర్ రైలును జూన్ 18వ తేదీన రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ప్రకటించారు.



బీఆర్టీఎస్ రోడ్డులో కళాకారులతో కలిసి యోగాసనాలు వేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

యోగాను ప్రజలకు చేరువ చేయండి

- కళాకారులకు కలెక్టర్ లక్ష్మీశ సూచన

సత్యనారాయణపురం, మే 30(ఆంధ్రజ్యోతి): 'సమాజంలో మార్పు తెచ్చే శక్తి కళాకారులకు ఉంది. సంపూర్ణ ఆరోగ్యానికి సోపానమైన యోగాను ప్రదర్శనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయండి' అని కళాకారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురం బీఆర్టీఎస్ రోడ్డులో శుక్రవారం కళాకారులతో కలిసి ఆయన యోగాసనాలు వేశారు. బీఆర్టీఎస్ రోడ్డుకు యోగా స్ట్రీట్ అని నామకరణం చేశామన్నారు. జూన్ 21 నాటికి యోగాను రాష్ట్రంలో 2 కోట్లమందికి, జిల్లాలో 10లక్షల మందికి చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఘంటసాల సంగీత కళాశాల ప్రిన్సిపాల్ నరసమ్మ, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణ, నాట్యాచార్యుడు భాగవతులు వెంకటరామశర్మ, పలువురు నాట్యాచార్యులు గాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల ఆక్రమణలు నిగ్గుతేల్చండి

- జీవో 60 ప్రకారం ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోండి
- అందులో దేవదాయశాఖ బోర్డులు ఏర్పాటు చేయండి
- ఆలయాల ఈవోలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ, పక్కన దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, మే 30(ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ జిల్లాలో ఆక్రమణలకు గురైన దేవదాయశాఖకు చెందిన భూముల నిగ్గుతేల్చండి. జీవో 60 ప్రకారం ఆక్రమిత భూములను రెవెన్యూ అధికారులతో కలిసి స్వాధీనం చేసుకోండి. ఆ భూముల్లో దేవదాయ శాఖకు చెందిన భూమిగా బోర్డులు పెట్టండి.' అని జిల్లాలోని ఆలయాల కార్యనిర్వహణాధికారులను కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో దేవదాయశాఖకు చెందిన భూముల అన్యాక్రాంతంపై పలు కథనాలు ప్రచురితమవడంతో ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈవో శీనానాయక్‌తో కలిసి మహామండపంలోని ఈవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, జిల్లా దేవదాయశాఖ అధికారి నటరాజన్ షణ్ముగం, జిల్లాలోని ఆలయాల ఈవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. దేవాలయాల భూముల వివరాలు, అన్యాక్రాంతానికి గురైన, కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివాదాల్లో ఉన్న దేవదాయశాఖ భూములపై స్థానిక రెవెన్యూ అధికారులతో చర్చించాలని సూచించారు. 15 రోజులకు ఒకసారి స్థానిక తహసీల్దార్‌తో కలిసి రెవెన్యూ అధికారులు, ఆలయాల ఈవోలు సమావేశం నిర్వహించాలన్నారు. దుర్గగుడికి సంబంధించిన ఆక్రమణలకు గురైన భూముల వివరాలను దుర్గగుడి ఈఓ శీనానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో సీఐడీ ఎస్సై నత్తా కుమార్‌బాబు మృతి

- పోలుకొండలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



సంతాపసూచికంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

నందివాడ, మే 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి సీఐడీ విభాగంలో పని చేస్తున్న ఎస్సై నత్తా కుమార్ బాబు(35) బ్రెయిన్ స్ట్రోక్‌తో విజయవాడ రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన పోలుకొండలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. కుమార్‌బాబుకు తల్లి, భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. శుక్రవారం కుమార్‌బాబు కుటుంబసభ్యులను మంగళగిరి సీఐడీ విభాగం ఎస్పీ కృష్ణప్రసన్న, ఎస్పీ ఉమామహేశ్వరరావు, ఎస్పీ నగేష్, డీఎస్పీ రమణారావు, సీఐ పూర్ణ, ఎస్సై శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్వరరావు, ఎంపీపీ పెయ్యల ఆదాం తదితరులు పరామర్శించారు. సీఐడీ సబ్ ఇన్‌స్పెక్టర్లు, గ్రామస్థులు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ట్యాంకర్ల యజమానుల కన్నీరు

తొమ్మిది నెలలుగా బిల్లులు పడక ఆర్థిక ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి-నందిగామ) నందిగామ మునిసిపాలిటీలో మంచినీరు సరఫరా చేసిన ట్యాంకర్ల యజమానులు కన్నీరు పెడుతున్నారు. తొమ్మిది నెలలుగా బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. డ్రైవర్ల జీతాలు, వాహనాల డీజిల్ కోసం వడ్డీలకు తెచ్చి ప్రజలకు సకాలంలో మంచినీరు అందించారు. పది మందికి రూ.80 లక్షల వరకూ బిల్లులు నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నందిగామ మునిసిపాలిటీలో పైప్‌లైన్లు లేని ఎగువ ప్రాంతాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందించారు. టెండర్ విధానంలో పది ట్యాంకర్లను తీసుకున్న మునిసిపాలిటీ ట్రిప్పుకు రూ.480 చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. ట్రాక్టర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు నీటిని సరఫరా చేశారు. నెలకోమారు బిల్లులు ఇవ్వాల్సిన మునిసిపాలిటీ ఆ పని చేయలేదు. గతంలో వైసీపీకి చెందిన చైర్‌పర్సన్ ఉండడం, సకాలంలో కౌన్సిల్ సమావేశాలు జరగకపోడంతో బిల్లులు నిలిచిపోయేవి. ఇటీవల మునిసిపాలిటీని టీడీపీ దక్కించుకుంది. దాదాపు కౌన్సిలర్లంతా టీడీపీలో చేరారు. అన్నీ మారినా ట్యాంకర్ల యజమానులకు బిల్లులు చెల్లింపు విధానం మారలేదు.



మంచినీటిని సరఫరా చేస్తున్న అద్దె ట్యాంకర్లు(ఫైల్)

కౌన్సిల్ ఆమోదం రాగానే బిల్లుల చెల్లింపు: కమిషనర్

జరిగిన పూర్తి పని రికార్డు చేసి ఉంచామని, కౌన్సిల్ ఆమోదం రాగానే బిల్లులు అందజేస్తామని కమిషనర్ ఈవీ రమణ బాబు తెలిపారు. అజెండాలో ఎందుకు చేర్చలేకపోతున్నారన్న ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు.

పర్సంటేజీ ఇస్తేనే బిల్లు పాస్..
టీడీపీ నాయకుడి షరతు!

ట్యాంకర్ యజమానులు ఒత్తిడి మేరకు అధికారులు బిల్లులు పెట్టినా వాటిని కౌన్సిల్ అజెండాకు ఎక్కనీయకుండా కొందరు పాలకవర్గ సభ్యులు అడ్డుపడుతున్నారని తెలుస్తోంది. ఆ బిల్లులో అవకతవకలు ఉన్నాయని వాటిని చెల్లించాలంటే కొంత పర్సంటేజీ తమకు ఇవ్వాలంటూ స్థానిక టీడీపీ నాయకుడొకరు షరతు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను తలచుకుంటేనే ఆ అంశం అజెండాలో ఉంటుందని, అంత వరకూ బిల్లు నిలిచే ఉంటుందంటూ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. మునిసిపాలిటీలో రాజ్యాంగేతర శక్తిగా చక్రం తిప్పుతున్న ఆ వ్యక్తి రూ.ఐదు లక్షలు ఇస్తేనే ఆ బిల్లు పాస్ అవుతుందంటూ కొందరు అధికారుల వద్ద చెప్పుకొచ్చినట్లు సమాచారం. ఆ మేరకు సొమ్ము అందకపోవడం వల్ల రెండు సమావేశాల నుంచి ఆ బిల్లును అజెండాలోకి రానివ్వడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గం తీరుపై ట్రాక్టర్ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి పెట్టి మంచినీటిని సరఫరా చేశామని, బిల్లుల రాక వడ్డీలు చెల్లించలేకపోతున్నామని, ఇక పర్సంటేజీలు ఎక్కడి నుంచి తేవాలని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దృష్టికి తీసుకెళతామంటున్నారు. బిల్లులు చేసి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకూ ఎందుకు కౌన్సిల్‌లో పెట్టలేదో మునిసిపల్ పాలకవర్గం ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. గడచిన రెండు కౌన్సిల్ సమావేశాల్లో ఈ అంశం అజెండాలోకి రాకపోవడానికి కొందరు నేతల అవినీతి ఆరాటమే కారణమంటున్నారు. అవసరమైతే పార్టీ అధిష్టానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

తాగి తందనాలాడి సైకిళ్లను రోడ్డుపై పడేస్తారా

- దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి ● వైసీపీ నేతలకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమా హెచ్చరిక

గొల్లపూడి, మే 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటికి వివాహ రిసెప్షన్‌కు మాజీ సీఎం జగన్ వస్తే వైసీపీ ముసుగులో ఉన్న అరాచక శక్తులు తాగి తందనాలాడి సైకిళ్లను రోడ్డుపై పడేసి అరాచకం చేశాయని, జాతీయ రహదారిపై బాణాసంచాలు కాల్చుతూ ట్రాఫిక్‌ను నిలిపివేశారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగజారుడు రాజకీయాలు చేయొద్దని వైసీపీని హెచ్చరిస్తున్నామన్నారు. పోలీసులు దీనిపై కఠినంగా వ్యవహరించి ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. శుక్రవారం గొల్లపూడిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగళూరు ప్యాలెస్ నుంచి పెళ్లిళ్లు, తద్దినాలకు మాత్రమే వైసీపీ అధినేత జగన్ వస్తుంటారని, ఇక్కడకు వచ్చి ఏం చెప్పదలచుకున్నారో ఆయనకే తెలియదని దేవినేని ఉమా విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి మారడు అనే దశకు ప్రజలు వచ్చారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో అనేక అరాచకాలు జరిగాయని ఉమా ఆరోపించారు. వేల కోట్ల రూపాయలు బయట రాష్ట్రాలు, దేశాలకు తరలించారని ఆరోపించారు. నాసిరకం మద్యంతో ఎంతో మంది చనిపోయారన్నారు. ఇవన్నీ న్యాయస్థానాల ముందుకెళితే అందులోని పాత్రధారులకు కనీసం బెయిల్ కూడా రాదన్నారు. కడప మహానాడులో ప్రవేశపెట్టిన నా తెలుగు కుటుంబంలోని ఆరు శాసనాల ఉద్దేశ్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సూచించారని, వారి సూచనలు పాటిస్తూ ఆరు శాసనాలను ప్రజలకు తెలియజేసేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలం విస్తృతంగా ప్రచారం చేస్తామని ఆయన తెలిపారు.

మూడెకరాల చెరువులో విషప్రయోగం

- చేపలు మృత్యువాత.. రూ.15 లక్షలు నష్టపోయామని రైతు కుటుంబం ఆవేదన



చెరువులో తేలుతున్న చేపలు, చెరువును పరిశీలిస్తున్న పోలీసు

బంటుమిల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతుమ్మిడి గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ నాగమునీంద్రరావు చేపల చెరువులో మరో మారు విషప్రయోగం జరిగింది. దీంతో చేపలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన నాగమునీంద్రరావుకు జయపురం కాంప్లెక్స్‌రోడ్‌లో 3 ఎకరాల చెరువులో ఏడాది క్రితం రూ.4 లక్షల చేపల సీడ్‌ను చెరువులో వేసి సాగు చేస్తున్నారు. చిన్న చేపలుగా ఎదగడంతో వీటిని వేరే రైతులకు అమ్మకానికి బేరం పెట్టారు. ఈ తరుణంలో విషప్రయోగం జరిగి చేపలు చనిపోయి తేలియాడుతూ కనిపించాయి. దీంతో ఆ కుటుంబం బంటుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు చెరువును పరిశీలించి నీటి శ్యాంపిల్, చనిపోయిన చేపలను సేకరించారు. రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని కుటుంబసభ్యులు వాపోతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు తమపై కక్ష కట్టి చెరువులో మూడోసారి విషప్రయోగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టుబడి, అమ్మకాల సమయంలో విష ప్రయోగం చేస్తున్నారని, అప్పుల పాలయ్యామని, న్యాయం చేయాలంటూ వేడుకున్నారు.

వేతనాల పెంపు అంశాన్ని పరిశీలిస్తున్నాం

- రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులకు సీఆర్డీయే అదనపు కమిషనర్ సాయి సూర్య ప్రవీణ్‌చంద్ హామీ



పారిశుధ్య కార్మికుల సమస్యలు వింటున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల వేతనం రూ.15 వేలకు పెంచి, వారికి రాజధాని ప్రాంత పేదలకు అందజేసే పింఛన్ లబ్ధిని చేకూర్చే అంశాన్ని పరిశీలిస్తామని ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సాయి సూర్య ప్రవీణ్‌చంద్ హామీ ఇచ్చారు. రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. రాజధాని ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ నేతలతో కలిసి కార్మికులు అర్జీ అందజేశారు. నెగోషియేటెడ్ సెటిల్మెంట్ పాలసీ సంబంధిత అంశాలు, గ్రామకంఠం భూములు, అసైన్డ్ భూములకు సంబంధించిన రైతులు, పారిశుధ్య కార్మికుల సమస్యల పెన్ష్ర పలువురు రైతులు, రాజధాని ప్రాంతవాసులు తమ అర్జీలను ప్రవీణ్‌చంద్‌కు అందించారు. తుళ్లూరు ప్రాంతానికి చెందిన పలువురు అర్జీదారులు నెగోషియేటెడ్ సెటిల్మెంట్ పాలసీ కింద నివాస గృహాలు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని కోరగా, అదనపు కమిషనర్ వారి ఫిర్యాదుకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. గ్రామకంఠం, అసైన్డ్ భూముల (కేటగిరి-4) రైతులు అందచేసిన అర్జీలపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకొంటామని తెలిపారు. అధికశాతం ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని అధికారులకు అదనపు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.రవీందర్, బి.సాయి శ్రీనివాసనాయక్, ఎం.శేషిరెడ్డి, కె.ఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, ఏజీ చిన్నికృష్ణ, కె.స్వర్ణమేరీ, జి.భీమారావు, జీఆర్ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ, సీఆర్డీయే డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్(సర్వే) జి.పాండురంగారావు రామకృష్ణన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మంత్రి కొల్లు రవీంద్రకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆయుష్ ప్రతినిధులు

యోగాంధ్ర కార్యక్రమాలకు రండి

- మంత్రి కొల్లు రవీంద్రకు ఆయుష్ ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి కొల్లు రవీంద్రను శుక్రవారం ఆయుష్ ప్రతినిధులు కె. వాహిని, భాగ్యలక్ష్మి ఆహ్వానించారు. జూన్ 2న గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం, 6న కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం, 13న ఘంటసాల బౌద్ధరామం వద్ద, 19న మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో యోగ శిక్షణా కార్యక్రమాలను మంత్రి కొల్లు రవీంద్రకు ఆయుష్ ప్రతినిధులు వివరించారు.

నెప్పల్లిలో 4.41 ఎకరాల భూమి

కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీదే

- భూమిని విక్రయించలేదు..లీజుకు ఇచ్చాం
- అన్నసత్రం కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంకట లక్ష్మీవరప్రసాద్

వన్‌టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా నెప్పల్లి గ్రామంలో ఆర్.ఎస్.నెం. 101లో 4.41 ఎకరాల భూమి వన్‌టౌన్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీకి చెందిందని కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంకట లక్ష్మీవరప్రసాద్ తెలిపారు. శుక్రవారం కన్యకాపరమేశ్వరి అన్నసత్రం భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన కమిటీ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. కమిటీకి చెందిన నెప్పల్లిలోని భూమిపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. ఈ భూమిపై వచ్చే కౌలు ఆదాయంతో 150 ఏళ్ల నుంచి కన్యకాపరమేశ్వరి అన్నసత్రానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు వసతి, ఉచిత భోజన సదుపాయాలు, సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సత్రానికి నెప్పల్లిలోనే కాకుండా విజయవాడ చుట్టుపక్కల గ్రామాల్లోనూ భూములు ఉన్నాయని, వాటిపై వచ్చే కౌలు ఆదాయంతో అన్నసత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నెప్పల్లిలోని భూమిని వందేళ్లకు పైబడి మూడు తరాలుగా దేవినేని దుర్గాప్రసాద్ కుటుంబం కౌలుకు తీసుకుని నిర్వహిస్తోందన్నారు. ఈ భూమికి సంబంధించిన పాస్ బుక్‌లు, భూమి శిస్తు, కౌలు రశీదులు 2004లో గ్రామ సెక్రటరీ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం, రికార్డులన్నీ అన్నసత్రం కమిటీ వద్దే ఉన్నాయని తెలిపారు. ఈ భూమిని ఎవరికీ అమ్మలేదని, కేవలం అన్నసత్రం అభివృద్ధిలో భాగంగా 40 గజాల స్థలాన్ని పాతికేళ్లకు లీజుకు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అన్నసత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి బయన శ్రీరాజేష్, ఉపాధ్యక్షుడు వల్లంకొండ వీరముని బ్రహ్మానందరావు, పాలక మండలి సభ్యులు, శారదా కళాపీఠం వ్యవస్థాపకుడు డోగుపర్తి శంకర్‌రావు పాల్గొన్నారు.

బోధనాసుపత్రుల్లో జనౌషధి దుకాణాలు

» రెడ్‌క్రాస్ సొసైటీకి కేటాయింపు

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): రోగులకు తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జనౌషధి దుకాణాలను రెడ్‌క్రాస్ సొసైటీకి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం బోధనాసుపత్రుల్లో ప్రైవేటు వ్యక్తులు జనరిక్ షాపులు నిర్వహిస్తున్నారు. వారు లాభార్జనే ధ్యేయంగా నడుపుతున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ 26 జిల్లాల్లోని బోధనాసుపత్రుల్లో షాపుల ఏర్పాటుకు ముందుకొచ్చింది. పీఎంబీజేపీ పథకంలో భాగంగా అనుమతులు జారీ చేశారు.

రాష్ట్రపతి విశాఖ పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

» అధికారులకు సీఎస్ ఆదేశం

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ 10న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశాఖపట్నంలో జరిగే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఏర్పాట్లపై సీఎస్ విజయానంద్ శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న మినిట్ టు మినిట్ ప్రోగ్రామ్ ప్రకారం జూన్ 10వ తేదీ ఉదయం 11.30 గంటలకు రాష్ట్రపతి విమానంలో విశాఖపట్నం చేరుకుంటారని, మధ్యాహ్నం 3 గంటల వరకూ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని, ఆ తర్వాత 3.20 గంటలకు విమానంలో ఝార్ఖండ్ రాష్ట్ర పర్యటనకు వెళతారని పేర్కొన్నారు.

తప్పు ఎవరిదైనా విద్యార్థుల జేబు ఖాళీ!

(మొదటి పేజీ తరువాయి)

ఫీజు చెల్లించాలి. ఎన్ని సబ్జెక్టులకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోరితే అంత మొత్తం చెల్లించాలి. ఈ ఏడాది 64,251 పేపర్లకు రీవెరిఫికేషన్ కోసం రూ.6.42 కోట్లు విద్యార్థులు చెల్లించారు. రీకౌంటింగ్ కోసం 2,112 పేపర్లకు రూ.10.56 లక్షలు చెల్లించారు. వీరిలో సుమారు 11 వేల మందికి మార్కుల్లో మార్పు వచ్చింది. విద్యార్థులు ఊహించినట్లుగా మూల్యాంకనంలో పొరపాట్లు జరగడం వల్ల మార్కులు పెరిగాయి. ఈ 11 వేల మంది సుమారు రూ.కోటి దరఖాస్తు ఫీజు రూపంలో కట్టారు. అయితే, మార్కులు పెరిగిన తర్వాత తమ ఫీజులు ఎందుకు వెనక్కి ఇవ్వరని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ అంటే పేపర్లను మళ్లీ పరిశీలించాలి కాబట్టి ఆ మేరకు దరఖాస్తు ఫీజులు నిర్ణయించారు. అయితే రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ అనంతరం మార్కులు పెరగకపోతే అది విద్యార్థుల పొరపాటే అవుతుంది. కానీ, మార్కులు పెరగడం అంటే అది ఖచ్చితంగా ఆ పేపరు దిద్దిన వారి పొరపాటు అవుతుంది. అంటే దానికి పాఠశాల విద్యాశాఖ బాధ్యత వహించాలి. ఈ నేపథ్యంలో మార్కులు పెరగకపోయినా, పెరిగినా ఫీజులు మాత్రం వెనక్కి ఇవ్వకపోవడం అనే విధానం సరికాదనే వాదన వినిపిస్తోంది. పాఠశాల విద్యాశాఖ తప్పు చేస్తే దాన్ని నిరూపించేందుకు తామెందుకు ఫీజులు చెల్లించాలనేది విద్యార్థుల ప్రశ్న. కొందరు విద్యార్థులు అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి కూడా రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేస్తూ ఉంటారు. అలాంటి వారి వల్ల పాఠశాల విద్యాశాఖ సమయం వృథా అవుతుంది కాబట్టి ఫీజులు తీసుకోవడంలో అర్థం ఉందని, కానీ మూల్యాంకనం చేసిన వారి పొరపాట్లకు తాము మానసిక క్షోభ అనుభవించడంతో పాటు ఫీజు కూడా కట్టాలా? అని ప్రశ్నిస్తున్నారు. ఫలితాల అనంతరం మార్కులు పెరిగితే ఫీజులు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడు రోజుల్లోనే మూల్యాంకనం

ఈ ఏడాది 6,19,286 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. ఏప్రిల్ 3న మూల్యాంకనం ప్రారంభించిన అధికారులు ఏడు రోజుల్లోనే ముగించారు. దీనిపైనా విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో దాదాపుగా ఇవే సంఖ్య ఉన్న పేపర్లను 10 నుంచి 15 రోజుల పాటు మూల్యాంకనం చేసేవారు. కానీ గత కొంతకాలంగా మూల్యాంకనం తీరు మారింది. త్వరగా ఫలితాలు ఇవ్వాలనే తొందరలో అధికారులు టీచర్లను మూల్యాంకనం విషయంలో పరుగులు పెట్టిస్తున్నారు. ఉదాహరణకు ఒక టీచర్ రోజుకు కనీసం 40 పేపర్లు దిద్దాలి. ఒకవేళ టీచర్ ఒక రోజు ఆ సంఖ్యలో పేపర్లు దిద్దకపోతే ఆ తర్వాత రోజు ఆ మేరకు సంఖ్య పెంచుతున్నారు. దీనివల్ల టీచర్లపైనా ఒత్తిడి పెరుగుతోంది. పైగా సాయంత్రం మూల్యాంకనం ముగిసే సమయంలో హడావుడిగా పేపర్లు దిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా విద్యార్థులు నష్టపోతున్నారు.

అంచనా తప్పుతోంది

గతంలో బిట్ పేపర్ ఉన్నప్పుడు మూల్యాంకనం చేసేవారికి ఒక అంచనా ఉండేది. మూల్యాంకనం చేసేవారు మొదట బిట్ పేపర్ దిద్దేవారు. బిట్ పేపర్‌లో ఎక్కువ మార్కులు వస్తే ఆ విద్యార్థి మెరుగ్గా ఉన్నట్టు భావించి, వ్యాసరూప ప్రశ్నల విషయంలోనూ జాగ్రత్తగా మూల్యాంకనం చేసేవారు. అదే బిట్ పేపర్‌లో తక్కువ మార్కులు వస్తే, వ్యాసరూప ప్రశ్నల మూల్యాంకనానికి ఎక్కువ కష్టపడాల్సి వచ్చేది కాదు. కానీ, ఇప్పుడు బిట్, వ్యాసరూప ప్రశ్నలను ఒకే సమాధానపత్రంలో రాస్తున్నారు. చాలా మంది విద్యార్థులు ఒక మార్కు ప్రశ్నలకు బుక్‌లెట్ చివర్లో సమాధానం రాస్తున్నారు. కొందరు మధ్యలో రాస్తారు. దీంతో టీచర్లు దిద్దే పేపరుపై ఒక అంచనాకు రాలేకపోతున్నారనే వాదన ఉపాధ్యాయుల నుంచి వినిపిస్తోంది. దీనికి తగిన పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

83% పేపర్లలో మార్కులు మారలేదు

16.32% పేపర్లలో 10లోపు మార్కులు తేడా.. 0.52 % పేపర్లలో 11-15 వ్యత్యాసం

» మొత్తం దిద్దినా మార్కులు కలపలేదు

» మూడంచెల పర్యవేక్షణలోనూ లోపాలు

» పదో తరగతి మూల్యాంకనంపై విద్యాశాఖ

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనంలో 83.16 శాతం పేపర్లలో మార్కులు మారలేదని పాఠశాల విద్యాశాఖ గుర్తించింది. 34,709 మంది విద్యార్థులు.. 66,363 పేపర్లపై రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 24,550 మంది విద్యార్థులకు సంబంధించిన 55,188(83.16శాతం) పేపర్లలో మార్కులు మారలేదు. 11,175 పేపర్లలో మాత్రమే మార్కులు మారాయి. 8,863 పేపర్లలో 1 నుంచి 5 మార్కులు, 1,506 పేపర్లలో 6 నుంచి 10 మార్కులు కలిశాయి.

గత ఏడేళ్ల నుంచీ ఇంతే!

గత పదేళ్లుగా మూల్యాంకనం విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో పొరపాట్లు కొనసాగుతున్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు. 2019లో 19 శాతం, 2022లో 20శాతం, 2023లో 18శాతం, 2024లో 17శాతం, 2025లో 16.32శాతం మార్కులు మారాయి. మూల్యాంకనంలో పొరపాట్లు జరిగినా సంబంధిత టీచర్లు, ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. అయితే.. ఈ మూల్యాంకనంలో మూడంచెల వ్యవస్థ ఉంటుంది. ఏ పేపర్‌నైనా అసిస్టెంట్ ఎగ్జామినర్, స్పెషల్ ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్ ముగ్గురూ పేపర్లను పరిశీలించి సంతకాలు చేయాలి. పేపర్లపై సంతకాలు చేస్తున్నా పరిశీలన పూర్తిస్థాయిలో జరగటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ పొరపాట్లకు కూడా మూల్యాంకనంలో లోపాలు ఎక్కడ జరిగాయో ప్రభుత్వ పరీక్షల విభాగం గుర్తించింది.

మార్కుల మార్పులు ఇలా

మార్కుల్లో మార్పులు	పేపర్లు	శాతం
మార్పులేదు	55188	83.16%
1- 5	8863	13.36%
6- 10	1506	2.96%
11- 15	343	0.52%
16- 20	163	0.25%
21- 25	86	0.13%

ప్రాథమిక కారణాలు

- » పేపర్లు పూర్తిగానే దిద్దినా కొన్ని విభాగాల మార్కులను తుది మార్కుల్లో కలపలేదు.
- » దిద్దిన సమాధాన పత్రాల్లోని మార్కులను ఓఎంఆర్ షీట్లలోకి మార్చే క్రమంలో పొరపాట్లు.
- » కొన్ని పేపర్లలో కొన్ని ప్రశ్నలను వదిలేయడం లేదా సున్నాలు వేయడం.
- » మూడంచెల పరిశీలన విధానం సమర్థంగా పనిచేయక పోవడం.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరీల కింద ప్రవేశాలు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా నూజివీడులోని క్యాంపస్‌లో మూడో రోజు నిర్వహించారు. మొత్తం 919 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 698 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. స్పోర్ట్స్ కోటా కింద 467 మందికి కాల్ లెటర్లు పంపగా 344 మంది, ఎన్‌సీసీ కోటాలో 452 మందికి కాల్ లెటర్లు పంపగా 354 మంది హాజరయ్యారు.

గోదావరి-కావేరీ నదుల అనుసంధానం అంశంలో కదలిక వచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లేవనెత్తిన అభ్యంతరాలపై వచ్చేనెల 24న హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని జల సౌధలో సమావేశం జరుగనున్నది. సీడబ్ల్యూసీ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగే ఈ భేటీలో ఎన్‌డబ్ల్యూడీఏ నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ కమిటీ కూడా పాల్గొంటుంది.

ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకోవచ్చు

» కార్డు నమోదైన షాపునకే వెళ్లక్కర్లేదు

» 5లోపు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్

» రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్



రేషన్ దుకాణం ఎదుట దుకాణదారుడి ఫొటో, అధికారుల ఫోన్ నంబర్ కనిపించేలా ఫ్లెక్సీ ప్రదర్శించాలని సూచిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి/అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): "ఇకపై లబ్ధిదారులు తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకోవచ్చు. రైస్ కార్డు నమోదైన డీలర్ దగ్గరే తీసుకోవాలనే నిబంధన లేదు. దీనికి సంబంధించిన సాంకేతిక మార్పులు కూడా చేశాం" అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందించనున్న నేపథ్యంలో సన్నాహక ఏర్పాట్లను ఆయన శుక్రవారం గుంటూరు జిల్లా తెనాలిలో పరిశీలించారు. రేషన్‌దుకాణంలో సరుకు నిల్వలు, వాటి తూకాలు, ఇతర ఏర్పాట్లను అడిగితెలుసుకున్నారు. డీలరు, రెవెన్యూ, తూనికలు కొలతల శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారుల ఫోన్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరుకుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాంకేతిక సమస్య తలెత్తినా వారిని గంటల తరబడి కూర్చోబెట్టకుండా ఫొటో తీసుకుని సరుకులు ఇచ్చేలా ఆదేశాలిచ్చామన్నారు. గతంలో ఎండీయూ వాహనాలను వీధి చివర్లో ఆపి కొంతసేపు సరుకులు ఇచ్చి కొంతమందికి రేషన్ ఇవ్వకుండా మాయం చేసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. వీటిని నియంత్రించేందుకే ఎండీయూ వ్యవస్థను రద్దు చేశామన్నారు. రేషన్ దుకాణాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

15 రోజులు అందుబాటులో దుకాణాలు

ప్రతినెలా 1 నుంచి 15లోపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయని మంత్రి చెప్పారు. ఆ సమయంలో ఎప్పుడైనా రేషన్ తీసుకునే వీలుంటుందన్నారు. గతంలో వలే వాహనం కోసం పనులు మానుకుని ఇళ్ల వద్దే ఉండాల్సిన అవసరం లేదన్నారు. వీలున్న సమయంలో రేషన్ తెచ్చుకోవచ్చన్నారు. సరుకులు లేవని ఏ ఒక్కరినీ తిప్పిపంపే పరిస్థితి ఉండదన్నారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులైన 15.56 లక్షల కుటుంబాల వారికి ప్రతినెలా 5వ తేదీ లోపు సరుకులు ఇళ్ల వద్దే అందిస్తామని స్పష్టంచేశారు. ఈ బాధ్యత రేషన్ దుకాణదారులే తీసుకుంటారని వెల్లడించారు. రాష్ట్రంలో 29,760 దుకాణాలను పునరుద్ధరించామన్నారు. తూకాల్లో వ్యత్యాసం ఉన్నా, సరుకులు లేవని తిప్పి పంపినా డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆదివారాల్లోనూ సరుకులు పంపిణీ చేయాలి

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేసేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా డీలర్లు పని చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలకు ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. కార్డుదారులకు డీలర్లు గౌరవంగా సేవలందించాలన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, సివిల్ సప్లయిస్ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదివారాల్లో కూడా సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతి డీలరు ఈ-పోస్, వేయింగ్ మెషీన్ల పనితీరును ముందుగానే పరిశీలించుకోవాలని చెప్పారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే ప్రత్యామ్నాయ మార్గాల్లో సరుకుల పంపిణీ చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ-పోస్, వేయింగ్ మెషీన్ల మరమ్మతుల కోసం ప్రతి జిల్లాలో సర్వీసు క్యాంపులు ఏర్పాటు చేస్తామని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ కార్డుదారులకు సక్రమంగా సరుకులను పంపిణీ చేయాలని మంత్రి చెప్పారు.



సమావేశంలో డీజీపీ, ఎస్పీ, టీటీడీ ఈవో తదితరులు

తిరుమలకు మరింత మెరుగైన భద్రత

» అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేలా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీం

» భద్రతా సమీక్షలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

తిరుమల, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తిరుమల ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని మెరుగైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయడం చాలా అవసరమని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అభిప్రాయపడ్డారు. తిరుమల భద్రతపై డీజీపీ, టీటీడీ ఈవో శ్యామలరావు సమక్షంలో శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. తిరుపతి ఎస్పీ, టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వో హర్షవర్ధనరాజు భద్రతా పరమైన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై డీజీపీ సూచనలు చేశారు. ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోంగార్డు, సివిల్ పోలీసు, టీటీడీ విజిలెన్స్‌తో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ఏర్పాటుపై దృష్టి సారించాలని చెప్పారు. సెక్యూరిటీ ఏజెన్సీలకు స్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించాలన్నారు. అలిపిరి వద్ద బహుళస్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలిసి సెన్సర్ ప్లే సిస్టమ్, ఆధునిక భద్రతా పరికరాలు, సైబర్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గత భద్రతా వైఫల్యాలపై చర్చించారు. గతంలో తాను హోంశాఖ ప్రధాన కార్యదర్శి హోదాలో తిరుమలలో పర్యటించి ప్రతిపాదించిన కొన్ని ముఖ్య అంశాలపై కూడా డీజీపీ సమీక్షించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ.. తిరుమలలో సైబర్ సెక్యూరిటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ సుధాకరరెడ్డి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ మహేశ్ చంద్ర లడ్హా, డీఐజీ శేముషి, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, డీఎఫ్‌వో వివేక్ ఆనంద్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. సమావేశానికి ముందు డీజీపీ శ్రీవారిని దర్శించుకున్నారు.

యాంటీ డ్రోన్ టెక్నాలజీ డెమో

తిరుమల క్షేత్రంలో యాంటీ డ్రోన్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలనే నిర్ణయంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పోలీసులు, విజిలెన్స్ అధికారులకు డెమో ఇచ్చింది. యాంటీ డ్రోన్ టెక్నాలజీ ద్వారా... అనుమానిత డ్రోన్లను ఎలా గుర్తించి, వాటి డైరెక్షన్స్‌ను ఎలా మళ్లించవచ్చో ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు.

శ్రీవారి సేవలో జస్టిస్ కృష్ణమోహన్



తిరుమల ఆలయం ముందు జస్టిస్ కృష్ణమోహన్

తిరుమల, మే30(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ.కృష్ణమోహన్ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు న్యాయమూర్తికి లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రఫుల్లా ఎస్ ఖుబాల్కర్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్రకుమార్ వాణి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

మరో మూడు రోజులు వర్షాలు

» పలు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదు

అమరావతి, విశాఖపట్నం, మే30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా శనివారం శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో మోస్తరుగా, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాగా శుక్రవారం రాష్ట్రంలో పలుచోట్ల ఎండతీవ్రత, ఉక్కపోత కొనసాగింది. దీనికి తోడు సముద్రం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీశాయి. దీంతో మధ్యాహ్నం నుంచి రాష్ట్రంలో పలుచోట్ల మేఘాలు ఆవరించి పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. విజయనగరం జిల్లా గుర్ల, కడప జిల్లా శెట్టివారిపల్లిలో 87.5, విజయనగరం జిల్లా వేపాడలో 79.2, నంద్యాల జిల్లా ముత్యాలపాడులో 79, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 74 మిల్లీమీటర్ల వాన పడింది. బంగాళాఖాతంలో అలల ఉధృతి కొనసాగడం, కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తుండడంతో మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని విశాఖ వాతావరణ శాఖ సూచించింది.

తుంగభద్ర క్రస్ట్‌గేట్‌ల తయారీకి బిడ్‌లు

» ఈ-టెండరులో పాల్గొన్న 4 కంపెనీలు

బళ్లారి, మే 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్ల తయారీకి ఈ-టెండర్‌లో నాలుగు కంపెనీలు బిడ్‌లు వేశాయి. పనులు చేసేందుకు వీటికి అర్హత ఉందా లేదా అన్న విషయాన్ని జూన్ 4, లేదా ఐదో తేదీన అధికారులు నిర్ధారించనున్నారు. ఇంతకు మునుపు ఈ-టెండర్‌లో బిడ్ వేసిన కంపెనీల్లో మూడింటికి అనుభవం లేదని, మరో కంపెనీ తన అనుభవాన్ని పొందుపరలేదని వాటిని తిరస్కరించారు. కాగా, డ్యాంకు మొత్తం 33 క్రస్ట్ గేట్లు ఉండగా, 19వ క్రస్ట్‌గేట్ మినహా 32 క్రస్ట్‌గేట్‌ల ఏర్పాటుకు రూ.60 కోట్లతో టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. 19వ క్రస్ట్‌గేటు ఏర్పాటు పనులను గుజరాత్‌కు చెందిన ఓ కంపెనీకి అప్పగించారు. ప్రస్తుతం పశ్చిమ కనుమల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. డ్యాంకు వరద మొదలైంది. 1000 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఈ కారణంగా ఈ ఏడాది 19వ గేటు ఏర్పాటు కూడా సాధ్యం కాకపోవచ్చని అధికారులు అంటున్నారు.



చలసాని ఆంజనేయులను సత్కరిస్తున్న ఏపీ సహకార భారతి అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాస్, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు

అఖిల భారత డెయిరీ స్టీరింగ్ కమిటీలో సభ్యుడిగా 'చలసాని'

» కృష్ణా మిల్క్ యూనియన్‌కు అరుదైన గౌరవం

విజయవాడ(చిట్టినగర్), మే 30(ఆంధ్రజ్యోతి): సహకార భారతి ఆధ్వర్యంలో ఏర్పాటైన అఖిల భారత డెయిరీ స్టీరింగ్ కమిటీలో కృష్ణా మిల్క్ యూనియన్ (విజయా డెయిరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులుకు స్థానం దక్కింది. రైతులకు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవకాశం లభించింది. ఆంజనేయులును ఆంధ్రప్రదేశ్ సహకార భారతి అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాస్‌తోపాటు, కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, అధికారులు, సిబ్బంది అభినందించారు. అడ్డూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 24న గుజరాత్‌లో జరిగిన ఆల్ ఇండియా సహకార భారతి కాన్ఫరెన్స్‌లో కృష్ణా మిల్క్ యూనియన్ విజయగాధను ప్రదర్శించారన్నారు.

ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌కు అహంకారం తగ్గలేదు: భానుప్రకాశ్‌రెడ్డి

న్యూఢిల్లీ, మే 30(ఆంధ్రజ్యోతి): 'జగన్ అవినీతి, అక్రమ పాలనను సహించలేక ప్రజలు 11 సీట్లిచ్చి బుద్ధిచెప్పినా ఆయనకు అహంకారం మాత్రం తగ్గలేదు' అని బీజేపీ ఏపీ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం, ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు. వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దడానికి కూటమి ప్రభుత్వానికి ఏడాది పట్టింది. మద్యం, ఇసుక, మైనింగ్ అక్రమాలపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరుపుతుంది. దోషులుగా తేలితే చట్టపరిధిలో శిక్షిస్తాం' అని భానుప్రకాశ్ అన్నారు.

మేకప్



వానల్లో హోయ్ హోయ్...

వానల్లో వేసుకునే మేకప్ తడికి చెదిరిపోకుండా ఉండాలి. అందుకోసం మాన్‌సూన్ ప్రూఫ్ మేకప్ ఎంచుకోవాలి. వాన నీటికి చెక్కుచెదరని ఉత్పత్తులు, మెలకువలు పాటించాలి. అవేంటంటే...

ఇలా సిద్ధం చేయాలి

- జిడ్డు లేని మాయిశ్చరైజర్‌ను ఎంచుకోవాలి. అప్పుడే తేమతో మేకప్ కరిగిపోకుండా, జారిపోకుండా ఉంటుంది.
- నీటిని తట్టుకునే ప్రైమర్ ఉపయోగించాలి. ఇది నున్నని బేస్‌గా మారి, మేకప్‌ను ఎక్కువ సమయం పాటు నిలిపి ఉంచుతుంది
- సన్‌స్క్రీన్ వాడడం ఆపేయకూడదు. అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ కోసం సన్‌స్క్రీన్ వాడడం తప్పనిసరి

ఫౌండేషన్ ఇలా...

- తేలికపాటి బిబి క్రీమ్‌ను ఎంచుకోవచ్చు. భారీగా ఉండే, ఫుల్ కవరేజ్ ఫౌండేషన్లు ఈ కాలానికి తగినవి కావు. ఇవి అసౌకర్యంగా ఉండడమే కాకుండా, తేమకు కరిగిపోతాయి
- మేకప్ చెదిరిపోకుండా ఉండడం కోసం, మెరుపు నియంత్రించడం కోసం సెట్టింగ్ పౌడర్ ఉపయోగించాలి
- మ్యాట్ ఫినిషింగ్ స్ప్రేతో మేకప్ ఎక్కువ సమయం పాటు చెదిరిపోకుండా ఉంటుంది. అలాగే సహజసిద్ధమైన మెరుపును అందిస్తుంది

ఐ మేకప్

- కళ్లను తీర్చిదిద్దడం కోసం, కనురెప్పల చిక్కదనాన్ని పెంచడం కోసం వాటర్‌ప్రూఫ్ ఐలైనర్, మస్కారాలనే ఎంచుకోవాలి
- పౌడర్ ఆధారిత ఐ షాడో ఎంచుకుంటే, చెదిరిపోకుండా సహజసిద్ధంగా కనిపిస్తుంది

పెదవుల కోసం

- మ్యాట్ లేదా లాంగ్ స్టే లిప్‌స్టిక్‌లు ఈ కాలానికి తగినవి. ఇవి చెదిరిపోకుండా ఉంటాయి.
- పెదవులు పొడిబారిపోకుండా లిప్‌బామ్ వాడుకోవాలి. ప్రత్యేకించి మ్యాట్ లిప్‌స్టిక్స్ వాడేటప్పుడు ముందుగా లిప్ బామ్‌తో పెదవులను మర్దించాలి

అదనపు చిట్కాలు

- బ్లాటింగ్ పేపర్స్ అందుబాటులో ఉంచుకోవాలి. అదనపు జిడ్డును వదిలించడానికి ఇవెంతో బాగా ఉపకరిస్తాయి
- నిద్రకు ముందు మేకప్‌ను పూర్తిగా తొలగించుకోవాలి. లేదంటే చర్మ రంధ్రాలు పూడుకుపోతాయి
- టచప్స్ కోసం వెట్ వైప్స్ వాడుకోవాలి. వీటిని వాడుకుంటే రోజంతా తాజా అనుభూతి పొందవచ్చు
- వాటర్‌ప్రూఫ్ సెట్టింగ్ స్ప్రే మేకప్‌ను సీల్ చేసి, ఎక్కువ సమయంపాటు చెదిరిపోకుండా మేకప్‌ను కాపాడుతుంది

వంటిల్లు

మనం రోజూ రకరకాల పండ్లు తింటూ ఉంటాం. కొన్ని పుల్లగా, కొన్ని తియ్యగా వేటికవే విభిన్నంగా ఉంటాయి. వీటితో నోరూరించే వంటలు కూడా చేయవచ్చు. పండ్లను కొత్తగా, కమ్మగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ రుచులు...



పండ్లతో కొత్తగా కమ్మగా

అనాస పండు కూర

కావాల్సిన పదార్థాలు

అనాస పండు (పైన్‌ఆపిల్) ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు తరుగు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, నూనె- మూడు చెంచాలు, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, అల్లం తరుగు- అర చెంచా, వెల్లుల్లి తరుగు- అర చెంచా, పచ్చిమిర్చి ముక్కలు- ఒక చెంచా, కొబ్బరి పాలు- రెండు కప్పులు, బియ్యప్పిండి- ఒక చెంచా, నిమ్మరసం- రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు



తయారీ విధానం

- ఒక వెడల్పాటి గిన్నెలో అనాస పండు ముక్కలు, ఒక చెంచా కరివేపాకు తరుగు, కొద్దిగా ఉప్పు, కారం, చిటికెడు పసుపు వేసి బాగా కలపాలి. ఈ గిన్నె మీద మూతపెట్టి రెండు నిమిషాలు నాననివ్వాలి. ఒక చిన్న గిన్నెలో బియ్యప్పిండి వేసి కొన్ని నీళ్లు పోస్తూ జారుగా కలపాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఒక చెంచా కరివేపాకు తరుగు, వెల్లుల్లి తరుగు, అల్లం తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, చిటికెడు పసుపు వేసి కలపాలి. ఇవి వేగాక కొబ్బరిపాలు పోసి కలపాలి. ఒక నిమిషం తరవాత బియ్యప్పిండి నీళ్లు పోస్తూ కలపాలి. తరవాత కొద్దిగా ఉప్పు, నిమ్మరసం వేసి కలిపి రెండు నిమిషాలు ఉడకనిచ్చి స్టవ్ మీద నుంచి దించాలి.
- స్టవ్ మీద మరో గిన్నె పెట్టి ఒక చెంచా నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అనాస పండు ముక్కల మిశ్రమం, కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి ఒక నిమిషం వేగనివ్వాలి. తరవాత ఇందులో కొబ్బరి పాల మిశ్రమం పోసి కలిపి రెండు నిమిషాలు ఉడికాక స్టవ్ మీద నుంచి దించాలి. పైన కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేసుకోవాలి. పుల్కా, చపాతీ, పూరీ, వేడి అన్నంలోకి ఈ కూర రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- కొబ్బరి పాలు చిక్కగా ఉండాలి. అనాస పండు ముక్కలను మరీ ఎక్కువగా వేపకూడదు.
- చివరలో కొద్దిగా జీడిపప్పు పేస్టు కలిపితే కూర మరింత రుచిగా ఉంటుంది.

• అనాసలో బి, సి విటమిన్లు, కాపర్, మాంగనీస్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ లాంటి మినరల్స్ ఉంటాయి. ఇవి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తికి, మెదడుతో పాటు నరాల పనితీరు మెరుగుపడేందుకు, జీవక్రియలకు, కణాల వృద్ధికి, తీసుకున్న ఆహారాన్ని శక్తిగా మార్చడానికి తోడ్పడతాయి. అనాసలోని పీచుపదార్థాలు రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరగకుండా నిరోధిస్తాయి. ఈ పండులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది.

మామిడి పండు బొబ్బట్లు

కావాల్సిన పదార్థాలు

పెద్ద సైజు మామిడి పండు- ఒకటి, మైదా- ఒక కప్పు, ఉప్పు- చిటికెడు, వేడి నీళ్లు- అర కప్పు, పచ్చి కొబ్బరి తురుం- అర కప్పు, నెయ్యి- నాలుగు చెంచాలు, పంచదార- అర కప్పు, యాలక్కాయ పొడి- అర చెంచా

తయారీ విధానం

- వెడల్పాటి గిన్నెలో మైదా, ఉప్పు వేసి వేడి నీళ్లు చల్లుకుంటూ మెత్తని ముద్దలా కలపాలి. దీని మీద మూతపెట్టి ఉంచాలి. మామిడి పండును నీళ్లతో శుభ్రంగా కడిగి తొక్క తీయాలి. చిన్న ముక్కలుగా కోసి మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మామిడి గుజ్జును చిన్న గిన్నెలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. ఇందులో పచ్చి కొబ్బరి తురుం వేసి కలుపుతూ పచ్చి వాసన పోయే వరకూ వేయించాలి. అయిదు నిమిషాల తరవాత పంచదార, మామిడి గుజ్జు వేసి కలపాలి. ఈ మిశ్రమం దగ్గరకు వచ్చేదాకా కలుపుతూనే ఉండాలి. తరవాత యాలక్కాయ పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. చేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేయాలి.
- మైదా పిండి ముద్దను అయిదు నిమిషాలపాటు గట్టిగా ఒత్తుతూ కలపాలి. తరవాత చిన్న ముద్దలుగా చేయాలి. చపాతీ పీటమీద కొద్దిగా పొడి పిండి చల్లి దానిమీద పిండి ముద్ద పెట్టి మందపాటి చపాతీలా ఒత్తాలి. ఈ చపాతీ మధ్యలో మామిడి-కొబ్బరి ఉండ పెట్టి అన్ని వైపుల నుంచి మూసి ముద్దలా చేయాలి. దీనిని చపాతీ పీట మీద పెట్టి మెల్లగా ఒత్తుతూ పలుచని చపాతీ మాదిరి చేయాలి.



- స్టవ్ మీద పెనం పెట్టి వేడిచేసి కొద్దిగా నెయ్యి రాయాలి. దీని మీద చపాతీ వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చాలి. ఇవి బాగా పొంగి మెత్తగా రుచిగా ఉంటాయి. ఇలా తయారు చేసుకున్న మామిడి బొబ్బట్లు మూడు రోజుల వరకూ నిల్వ ఉంటాయి. అదే ఫ్రిజ్‌లో పెడితే వారం పాటు బాగుంటాయి.

• మామిడి పండులో ఎ, సి విటమిన్లతో పాటు పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మామిడి పండును తినడం వల్ల శరీరంలో క్యాన్సర్ కారకాలు నశిస్తాయి. తక్షణ శక్తి లభిస్తుంది. గుండె, చర్మం, కళ్లు, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

జాగ్రత్తలు

- మైదా పిండికి బదులు గోధుమ పిండి వాడుకోవచ్చు.
- పంచదారకు బదులు బెల్లం వేసుకోవచ్చు.
- నెయ్యి వద్దనుకుంటే వెన్న లేదా నూనెతో కూడా చేసుకోవచ్చు.

కివి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

కివి పండ్లు- మూడు, కొత్తిమీర తరుగు- రెండు కప్పులు, పుదీనా తరుగు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు చెంచాలు, అల్లం తరుగు- ఒక చెంచా, నల్ల ఉప్పు- పావు చెంచా, ఉప్పు- అర చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, పంచదార- ఒక చెంచా, నీళ్లు- మూడు చెంచాలు, పసుపు- చిటికెడు, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- పావు చెంచా, ఎండు మిర్చి- ఒకటి ఇంగువ- చిటికెడు, కరివేపాకు- రెండు రెమ్మలు.

తయారీ విధానం

కివి పండ్లను కడిగి తొక్క తీసి చిన్న ముక్కలుగా కోయాలి. మిక్సీలో కివి ముక్కలు, కొత్తిమీర తరుగు, పుదీనా తరుగు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం తరుగు, నల్ల ఉప్పు, ఉప్పు, జీలకర్ర పొడి, పంచదార, నీళ్లు, పసుపు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత గిన్నెలోకి తీసుకోవాలి. స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. ఇందులో ఆవాలు, ఎండుమిర్చి ముక్కలు, ఇంగువ, కరివేపాకు వేసి బాగా వేపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని పచ్చడిలో వేసి బాగా కలపాలి. ఈ కివి పచ్చడిని బ్రెడ్‌తో తింటే బాగుంటుంది. పుల్కా, చపాతీ, దోశ, వడలతో కూడా తినవచ్చు.



• కివి పండును పోషకాల గనిగా చెబుతారు. దీనిలో సి, ఇ, కె విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. తరచూ కివి పండును తినడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది. ముఖంమీద మొటిమలు, గుల్లలు రావు. చర్మం మృదువుగా ప్రకాశవంతంగా మారుతుంది. గుండె జబ్బులు రావు.

జాగ్రత్తలు

- కివి మరీ పచ్చివి లేదా పండువి కాకుండా మధ్యస్థంగా ఉన్నవాటిని తీసుకోవాలి
- గుప్పెడు వేయించిన పల్లీలు లేదా రెండు చెంచాల జీడిపప్పు కూడా వేసి గ్రైండ్ చేస్తే పచ్చడి కమ్మగా ఉంటుంది.
- పచ్చడి పుల్లగా కావాలనుకుంటే రెండు రెమ్మల చింతపండు వేసుకోవచ్చు.

స్ఫూర్తి



ఆమె లక్ష్యం... రైతు హితం

నారు పోసి... ఆరుగాలం శ్రమించి... పంట పండించిన రైతుకు చివరకు నష్టమే మిగులుతోంది. అనాదిగా పాతుకుపోయిన దళారీ వ్యవస్థ నిలువుదోపిడీతో అప్పుల కుప్ప పేరుకుపోతోంది. దీనికి అడ్డుకట్ట వేసి... 'గ్రామ్‌హిత్'ను తీసుకువచ్చి... రైతులను లాభాల బాట పట్టించారు మహారాష్ట్రకు చెందిన శ్వేతా ఠాక్రే. ముప్ఫై ఐదు వేలమందికి పైగా రైతుల ఆదాయం పెంచి... వారి జీవితాల్లో నవక్రాంతులు తీసుకువచ్చిన శ్వేత ప్రయాణం ఇది.

"చిన్న, సన్నకారు రైతుల కష్టాలు ఏంటో నాకు బాగా తెలుసు. ఎందుకంటే నేను కూడా సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన దాన్నే. నా చిన్నప్పుడు ఏటా మా అమ్మానాన్న వడ్డీ వ్యాపారి వద్ద అప్పు తీసుకువచ్చేవారు. సాగు చేసి తెచ్చిన అప్పు తీర్చగలమని అనుకునేవారు. కానీ అది ఎప్పుడూ జరగలేదు. ఎంత కష్టపడినా కుటుంబ పోషణే కష్టమయ్యేది. చివరకు వ్యవసాయాన్ని వదిలి మా తల్లిదండ్రులు రోజువారీ కూలీ పనుల కోసం నగరానికి వలస వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా ఏటా నా చదువు కోసం డబ్బులు సమకూర్చడం వారికి పెద్ద సవాలే అయింది. ఆ కష్టాలన్నీ చూశాను కనుకనే రైతుల కోసం ఏదైనా చేయాలని బలంగా నిర్ణయించుకున్నాను.

మాలానే ఎన్నో కుటుంబాలు...

ఈ కథ నా ఒక్కదానిదే కాదు... మాలానే కొన్ని లక్షల వ్యవసాయ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. పంట దిగుబడి పెరుగుతున్నప్పటికీ రైతుల ఆదాయం మాత్రం అంతంతమాత్రంగానే ఉంటోంది. దేశంలో 60 శాతం రైతులు వ్యవసాయాన్ని వదిలేయాలని అనుకుంటున్నట్లు అప్పట్లో ఓ సర్వేలో తేలింది. ఈ క్రమంలో... ఎలక్ట్రానిక్స్ టెలికమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో స్నేహితులతో కలిసి 'కస్తకర్' సంస్థను స్థాపించాను. మహారాష్ట్ర యావత్మల్ జిల్లాలోని రైతులకు మొబైల్ హెల్ప్‌లైన్ ద్వారా సేవలు అందించే ఉద్దేశంతో దీన్ని తీసుకువచ్చాం. వారికి ఎప్పటికప్పుడు మార్కెట్ ధరలు తెలియజేసేవాళ్లం. దాన్ని అనుసరించి రైతులు తమ పంటలను దళారులకు అమ్ముకునే విషయంలో నిర్ణయాలు తీసుకునేవారు. అలా 'కస్తకర్' రైతులకు ఎంతో ఉపయోగపడింది. ఈ సేవలు మా జిల్లాకే పరిమితం కాకుండా... ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాలని అనుకున్నాం. తద్వారా మరింతమంది అన్నదాతలకు మేలు కలుగుతుందని భావించాం.

దళారుల దోపిడీకి చెక్...

పంట కొనుగోలు విషయంలో దళారుల గుత్తాధిపత్యం ఏ స్థాయిలో ఉందనేదానిపై మాకు పూర్తి అవగాహన కలిగింది. దానికి అడ్డుకట్ట వేయాలంటే రైతుల సమస్యలపై కూడా దృష్టిపెట్టాలి. వాటి పరిష్కారం కోసం ప్రయత్నించాలి. ఈ క్రమంలో ఎంతోమంది రైతులను కలిశాం. పంట నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంవల్ల కూడా తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని గుర్తించాం. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారంగా 'గ్రామ్‌హిత్'ను ప్రారంభించాం.

నేరుగా కొనుగోలు...

'గ్రామ్‌హిత్' రైతులకు ఎన్నో ప్రయోజనాలు అందిస్తోంది. దీని ద్వారా రైతులు పండించిన పంటను నిల్వ చేస్తాం. వారికి సరైన ధర వచ్చేవరకూ పంటను సురక్షితంగా ఉంచుతాం. దీనివల్ల రైతులు సరైన ధర వచ్చే వరకు వేచిచూసే అవకాశం ఉంటుంది. డబ్బు అవసరాల కోసం కూడా రైతులు వెంటనే తమ పంటలను అమ్ముకుంటున్నారు. అందుకే మేము వారి అవసరానికి కావల్సిన డబ్బు సమకూరే మార్గం చూపిస్తున్నాం. దళారి అనేవాడు లేకుండా నేరుగా రైతులను... కొనుగోలుదారులను కలుపుతాం. దీనివల్ల రైతులకు పంటకు తగిన ధర లభిస్తుంది. తద్వారా ఆదాయం పెరుగుతోంది. ఎన్నడూ లేనంత లాభాలను రైతన్న చూస్తున్నాడు. ఒక వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిగా ఇది నాకు ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తోంది."

వేలమంది రైతులకు...

ఇప్పటివరకు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 35 వేల మందికి పైగా రైతులకు 40 శాతం ఆదాయాన్ని పెంచగలిగాం. వీరిలో అయిదువేల మంది మహిళా రైతులు ఉన్నారు. గ్రామ్‌హిత్ ద్వారా నేను చేస్తున్న సేవలకు గానూ ఎన్నో అవార్డులు, పలు ప్రతిష్ఠాత్మక ఫెలోషిప్‌లు అందుకున్నాను.

భోజనకుతూహలం

బుద్ధి వర్ధకం బ్రాహ్మీ



మనిషిని మనీషిగా అంటే, మహా మేధావిగా మలచగల అద్భుత ఔషధం బ్రాహ్మీ! దీన్నే సరస్వతీ మొక్క అని కూడా పిలుస్తారు. చెరువుల పక్కన, కాలువల అంచున, ఖాళీ స్థలాల్లో, పొలాల్లో పెరిగే మొక్క. దొరికితే వదలకండి! విద్యార్థులకీ, వృద్ధులకూ ఈ మొక్కవల్ల అనేక ప్రయోజనాలున్నాయి. రఘునాథసూరి రాసిన 'భోజనకుతూహలం' గ్రంథంలో బ్రాహ్మీ గురించి ఎన్నో విశేషాలు పేర్కొన్నాడు. ఈ గ్రంథం ప్రకారం బ్రాహ్మీ..

హిమా- శరీరాన్ని చల్లబరచే స్వభావం కలది. కషాయా- వగరైన రుచి కలది. తిక్తా- చేదు రుచి కలది, వాతాస్ర జిత్- వాతరక్తం(గౌట్) వంటి వ్యాధులను తగ్గిస్తుంది, పిత్త జిత్- శరీరంలో పిత్త దోషాన్ని సమతుల్యం చేస్తుంది. బుద్ధి, ప్రజ్ఞా, మేధా కుర్యాత్- ఆలోచన, బుద్ధి, జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. ఆయుః ప్రవర్ధినీ- ఆయుష్షును పెంచుతుంది.

ప్రయోజనాలెన్నో: ఆయుర్వేదం బ్రాహ్మీని మేధో రసాయనంగా అభివర్ణించింది. దీనివల్ల మేధా (వివేకం), ధృతి (స్థిరత), స్మృతి (జ్ఞాపకశక్తి) పెరుగుతాయని పేర్కొంది. మానసిక ఒత్తిడిలో ఉన్నవారు, నిద్రలేమితో బాధపడేవారు, చదువులో ఏకాగ్రత కోల్పోయిన విద్యార్థులు, బ్రాహ్మీని తప్పనిసరిగా సేవించాలి. ఇది నరాల బలహీనతకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. వృద్ధుల్లో ఆల్జీమర్స్ వంటి సమస్యలు రాకుండా కాపాడుతుంది. చెవుల్లో జుయిమనే శబ్దాన్ని (టినిటస్) తగ్గిస్తుంది.

ఎలా సేవించాలి?: వసకొమ్ము, శంకపుష్పి, బ్రాహ్మీ కలిపిన పొడితో టీ తయారుచేసుకొని తాగితే అనేక ఆరోగ్య సమస్యలు దరికి రావు. ఆయుర్వేద షాపుల్లో బ్రాహ్మీరసాయనం, బ్రాహ్మీ ఘృతం, సరస్వతీ లేహ్యం మొదలైనవి లభిస్తాయి. వీటి వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.

- బ్రాహ్మీ ఆకులను శుభ్రంగా కడిగి, తాలింపు వేసి, ఉల్లి, కొబ్బరి, చింతపండు, మిర్చి కలిపి మిక్సీలో వేస్తే బ్రాహ్మీ పచ్చడి సిద్ధం. ఇదే విధంగా ఆకులను మగ్గించి, ఉడికించిన పప్పులో కూడా కలుపుకోవచ్చు.

• గంగరాజు అరుణాదేవి

సీజనల్ కేర్

వాతావరణ మార్పులకు ఇలా

ఏడాది పొడవునా వాతావరణ మార్పులు సహజం. ఈ మార్పులకు శరీరం సన్నద్ధమయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య సమస్యలు రావు. ఆ జాగ్రత్తలు ఇవే..

- వాతావరణంలో ఏర్పడే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతల కారణంగా శరీరానికి నీటి అవసరం పెరుగుతూ తరుగుతూ ఉంటుంది. కాలానికి అనుగుణంగా తరచూ మంచినీరు తాగుతూ ఉంటే నీర్జలీకరణ సమస్యలనుంచి బయటపడవచ్చు.
- ఎండ, వాన, చలి తీవ్రతలను దృష్టిలో ఉంచుకుని దుస్తులు ధరించాలి. వడగాలి, వర్షం, చలిగాలి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- వాతావరణ మార్పుల వల్ల తరచూ వ్యాధులు సోకుతుంటాయి. కాలానుగుణంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఆహారంలో చేర్చుకోవాలి. అప్పుడే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. విటమిన్లు, ప్రొటీన్లు, మినరల్స్, పీచుపదార్థాలతో కూడిన ఆహారం తీసుకోవాలి. దీనివల్ల హానికారక వైరస్‌లు, బ్యాక్టీరియాల నుంచి రక్షణ లభిస్తుంది.



- ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా క్రమం తప్పకుండా వ్యాయామం లేదా యోగ, ధ్యానం చేయాలి. వీటివల్ల శారీరక దారుఢ్యం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నడక కూడా మంచిదే.
- నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలి. రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్రించడం మంచిది. స్వచ్ఛమైన గాలి, ప్రశాంతమైన పరిసరాలు, తేలికపాటి భోజనం లాంటివి నిద్ర సమస్యలను దూరం చేస్తాయి.
- నీరసం, జీర్ణ సమస్యలు, దగ్గు, జలుబు, జ్వరం, విరేచనాలు, తలనొప్పి లాంటి సమస్యలు వస్తే వైద్యుని సంప్రదించాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి.

తెలుగు సినిమాకు
అవార్డుల పంట

- 2014- 2023 సినిమాలకు పురస్కారాలు
- ప్రకటించిన జ్యూరీ చైర్మన్ మురళీమోహన్
- ఏడాదికి మూడు చిత్రాల చొప్పున ఎంపిక
- నందమూరి బాలకృష్ణకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014 - 2023 మధ్య విడుదలైన సినిమాలకు అందించనున్న గద్దర్ తెలంగాణ సినీ పురస్కారాలను జ్యూరీ కమిటీ చైర్మన్, సీనియర్ నటుడు మురళీమోహన్ ప్రకటించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజుతో కలసి ఆయన అవార్డుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 నుంచి సెన్సార్ అయిన చిత్రాలనే పరిశీలనకు తీసుకున్నట్లు తెలిపారు. మురళీ మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత అవార్డులను ఇవ్వడం ఆపివేశారని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతగా తీసుకొని గద్దర్ పురస్కారాలను ప్రారంభించారని పేర్కొన్నారు. జ్యూరీ కమిటీ ఏకాభిప్రాయంతో ప్రతి ఏడాదికి మూడు చిత్రాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. వీటితో పాటు సినీ రంగానికి సేవలందించిన వారికి ఆరు ప్రత్యేక అవార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డుకు నందమూరి బాలకృష్ణ, పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డుకు ప్రముఖ దర్శకుడు మణిరత్నం ఎంపికయ్యారు.

ఏపీలోనూ అవార్డులు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్‌లోనూ సినీ పురస్కారాలు ప్రకటించాలని సీనియర్ నటుడు మురళీ మోహన్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగు సినిమాకు అవార్డులు ఇచ్చే విషయంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఒక అవగాహనకు రావాలని సూచించారు. 'ఒకే తెలుగు సినిమాకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అవార్డులు ఇవ్వడం సరైన పద్ధతి కాదని నా అభిప్రాయం. ఇలా చేయడం అనవసరమైన చర్చలకు, వివాదాలకు దారితీస్తుంది. దీనికి బదులుగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కలసి ఒక నిర్ణయానికి రావాలి. ఒక ఏడాది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటిస్తే, మరుసటి ఏడాది ఏపీ ప్రభుత్వం ప్రకటించాలి. తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలూ కావాలి. ఒక రాష్ట్రం ఎక్కువ, మరో రాష్ట్రం తక్కువ కాదు. సినిమాలను తెలంగాణ, ఆంధ్రా అంటూ వేర్వేరుగా చూడొద్దు. తెలుగు సినిమా ఒక్కటే. మనమంతా ఒక్కటే. మన సినిమా ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. మనకంటే ముందు సినిమాని అమెరికాలో చూస్తున్నారు. ప్రభుత్వాల ప్రోత్సాహం ఉంటే తెలుగు సినిమా ఖ్యాతి మరింత పెరుగుతుంది. విదేశాల్లోనూ మనకు మరింత ప్రత్యేక గుర్తింపు దక్కుతుంది' అని అన్నారు.

సంవత్సరం	మొదటి ఉత్తమ చిత్రం	రెండో ఉత్తమ చిత్రం	మూడో ఉత్తమ చిత్రం
2014	రన్ రాజా రన్	పాఠశాల	అల్లుడు శ్రీను
2015	రుద్రమదేవి	కంచె	శ్రీమంతుడు
2016	శతమానం భవతి	పెళ్లి చూపులు	జనతా గ్యారేజ్
2017	బాహుబలి: కన్‌క్లూజన్	ఫిదా	ఘాజి
2018	మహానటి	రంగస్థలం	కేరాఫ్ కంచెరపాలెం
2019	మహర్షి	జెర్సీ	మల్లేశం
2020	అల వైకుంఠపురములో	కలర్ ఫొటో	మిడిల్ క్లాస్ మెలోడీస్
2021	ఆర్ఆర్ఆర్	అఖండ	ఉప్పెన
2022	సీతారామం	కార్తికేయ-2	మేజర్
2023	బలగం	హనుమాన్	భగవంత్ కేసరి

ప్రత్యేక పురస్కారాలు

1. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు - నందమూరి బాలకృష్ణ
2. పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు - మణిరత్నం
3. బి.ఎన్.రెడ్డి ఫిల్మ్ అవార్డు - సుకుమార్
4. నాగిరెడ్డి- చక్రపాణి ఫిల్మ్ అవార్డు - అట్లూరి పూర్ణచంద్రరావు
5. కాంతారావు ఫిల్మ్ అవార్డు - విజయ్ దేవరకొండ
6. రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు - యండమూరి వీరేంద్రనాథ్
7. స్పెషల్ జ్యూరీ అవార్డు - ప్రజాకవి కాళోజీ

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

ఇది దైవ నిర్ణయం..
నాన్న ఆశీర్వాదం




బాలకృష్ణ

ఎన్టీఆర్ జాతీయ అవార్డ్‌ను ఆయన తనయుడు బాలకృష్ణకు అందించనున్నట్లు అవార్డుల కమిటీ ప్రకటించింది. తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన అవార్డ్‌ను కొడుకు అందుకోవడం అరుదైన సంఘటనే. ఈ సందర్భంగా బాలకృష్ణ స్పందించారు. ఈ అవార్డ్‌ను అందుకోవడం అదృష్టంగా, దైవ నిర్ణయంగా, తండ్రి ఆశీర్వాదంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. 'ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు పూర్తి చేసుకున్న అద్భుతమైన ఘడియలు ఒక వైపు, ఎన్టీఆర్ నట ప్రస్థాన 75 వసంతాల అమృతోత్సవాలు జరుగుతున్న శుభ ఘడియలు మరో వైపు, నటుడిగా నేను 50 ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న శుభ సందర్భం ఇంకో వైపు, కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పద్మ భూషణ్‌తో సత్కరించిన తరుణంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాకు 'ఎన్టీఆర్ జాతీయ అవార్డ్' ప్రకటించడం నా అదృష్టం, దైవ నిర్ణయం, నాన్న ఆశీర్వాదంగా భావిస్తున్నాను. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి నన్ను ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, జ్యూరీ సభ్యులకు నా కృతజ్ఞతలు' అని ఓ ప్రకటనలో బాలకృష్ణ పేర్కొన్నారు.

ప్రతిభావంతులకు ప్రత్యేక అవార్డులు

భారతీయ చిత్రపరిశ్రమకు విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు మహానటుడు ఎన్టీఆర్ గౌరవార్థం ఎన్టీఆర్ నేషనల్ అవార్డ్‌ను 1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విభజన జరిగి రెండు రాష్ట్రాలుగా ఏర్పడే వరకూ ఈ అవార్డ్ ఇస్తూ వచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు అవార్డుల మీద దృష్టి పెట్టలేదు. మళ్లీ ఇన్నాళ్లకు ప్రజా గాయకుడు గద్దర్ పేరుతో సినీ అవార్డులు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చి, అవార్డులను ప్రకటించింది. వాటితో పాటు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, రఘుపతి వెంకయ్య అవార్డ్, బీఎన్ రెడ్డి అవార్డ్, నాగిరెడ్డి-చక్రపాణి అవార్డులను పునరుద్ధరించింది. వీటితో పాటు కొత్తగా పైడి జైరాజ్ పేరుతో, కాంతారావు పేరుతో మరో రెండు అవార్డులను కొత్తగా ప్రవేశపెట్టింది.

సెన్సిబుల్ డైరెక్టర్‌కు పైడి జైరాజ్ అవార్డ్



మణిరత్నం

తెలంగాణలో పుట్టి, భారతీయ చిత్ర పరిశ్రమలో అగ్రస్థాయికి ఎదిగి, తెలంగాణ కీర్తిని జాతీయ స్థాయిలో చాటి చెప్పిన గొప్ప నటుడు, కరీంనగర్ వాసి పైడి జైరాజ్. భారతీయ సినిమా తొలి దశలో ప్రారంభమైన మూకీల నుంచి టాకీల వరకూ సాగిన పైడి జైరాజ్ ప్రస్థానం ప్రశంసనీయం. భారతీయ సినిమా తెరపై తొలి యాక్షన్ హీరో ఆయనే కావడం విశేషాంశం. తెలంగాణకు ఎంతో ఖ్యాతి తెచ్చిన ఆ గొప్పనటుడు పేరుతో ఏర్పాటు చేసిన ఫిల్మ్ అవార్డ్‌ను తొలిసారిగా తమిళ దర్శకుడు మణిరత్నం అందుకోనున్నారు. సెన్సిబుల్ డైరెక్టర్‌గా పేరొందిన మణిరత్నం కీర్తి కిరీటంలో ఈ అవార్డ్ మరో కలికితురాయి.


సుకుమార్‌కు ఈ అవార్డ్ చాలా ప్రత్యేకం



సుకుమార్

తెలుగుతనాన్ని, వాస్తవికతను, మధ్య తరగతి జీవితాలను ప్రతిబింబించే చిత్రాలను రూపొందించిన కళాత్మక దర్శకుడు బి.ఎన్.రెడ్డి. మూడు పదుల సినీ జీవితంలో ఆయన తీసినవి 11 చిత్రాలే. అయినా ప్రతి ఒక్క సినిమా ప్రేక్షకుల మనసుల్ని తాకింది. అటువంటి గొప్ప దర్శకుని పేరు మీద ఏర్పాటు చేసిన అవార్డ్ ను మరో గొప్ప దర్శకుడు సుకుమార్‌కు అందజేస్తున్నారు. పటిష్ఠమైన స్ర్కీన్‌ప్లేతో కథను నడిపించడమే కాకుండా స్టార్ హీరోలను డీ గ్లామరైజ్డ్ పాత్రల్లో చూపించి పాన్ ఇండియా స్థాయికి ఎదిగిన సుకుమార్ దర్శకత్వం వహించిన 'రంగస్థలం', 'పుష్ప' చిత్రాలు కూడా అవార్డుల జాబితాలో చోటు చేసుకోవడం విశేషంగా చెప్పాలి.


సాహసాల నిర్మాతకు నాగిరెడ్డి, చక్రపాణి అవార్డ్



అట్లూరి పూర్ణచంద్రరావు

చిత్ర పరిశ్రమలో స్నేహానికి ప్రతీకగా నిలిచిన గొప్ప వ్యక్తులు నాగిరెడ్డి, చక్రపాణి. ఒకటే మాట, ఒకటే బాట వీరిద్దరిదీ. విజయా పతాకంపై ఈ స్నేహితులిద్దరూ కలసి నిర్మించిన చిత్రాలన్నీ ఆణిముత్యాలే. వినోదం, సందేశం కలగలసిన విజయా వారి చిత్రాలు ఎన్ని సార్లు చూసినా ప్రేక్షకులకు విసుగనిపించదు. చిత్ర నిర్మాణరంగంలో ఓ ఒరవడిని ప్రవేశపెట్టిన నాగిరెడ్డి, చక్రపాణి పేరిట ఏర్పాటు చేసిన అవార్డ్‌ను మరో సీనియర్ నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావుకు అందజేయనున్నారు. నిర్మాతగా ఎన్నో సాహసాలు, ప్రయోగాలు చేసిన పూర్ణచంద్రరావు మురళీమోహన్, గిరిబాబులను చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు.

కత్తివీరుడి స్మారక అవార్డ్ విజయ్ దేవరకొండకు



విజయ్ దేవరకొండ

జానపద చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరై 'కత్తి వీరుడు'గా పేరు తెచ్చుకున్న కాంతారావు పేరిట ఓ ప్రత్యేక అవార్డ్‌ను తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశ పెట్టింది. ఈ అవార్డును తెలంగాణ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న విజయ్ దేవరకొండకు అందజేయనున్నారు.

యండమూరికి విశిష్ట పురస్కారం



యండమూరి వీరేంద్రనాథ్

తెలుగు సినిమా పితామహుడిగా ప్రఖ్యాతి పొందిన రఘుపతి వెంకయ్య పేరు మీద ఏర్పాటు చేసిన అవార్డ్‌ను ఈసారి ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు అందజేయనున్నారు. ఎన్నో చిత్రాలకు కథలు అందించిన యండమూరి రెండు చిత్రాలకు దర్శకత్వం వహించారు కూడా.

నా దర్శకులకు ప్రేమ పంచుతున్నా



తను నటించిన 'శ్రీమంతుడు', 'మహర్షి' చిత్రాలకు, నిర్మించిన 'మేజర్' సినిమాకు తెలంగాణ ఫిల్మ్ అవార్డులు వచ్చినందుకు మహేశ్‌బాబు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందించడంతో పాటు సినీ పండగకు చొరవ చూపిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమాల వెనుక ఉన్న దర్శకులకు మరింత ప్రేమ పంచుతున్నట్లు మహేశ్ వెల్లడించారు.

నాకు మరింత గౌరవం

కళాత్మక చిత్రాల దర్శకుడు బి.ఎన్.రెడ్డి పేరిట ఏర్పాటు చేసిన అవార్డ్‌కు తనకు ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందని దర్శకుడు సుకుమార్ చెప్పారు. అంత గొప్ప అవార్డ్‌కు ఎంపిక చేయడం నా బాధ్యతను పెంచిందని తెలిపారు. తెలుగు సినీ రంగంలో శిఖరం లాంటి బి.ఎన్.రెడ్డి అవార్డ్ అందుకోవడం తనకు మరింత గౌరవం అని సుకుమార్ పేర్కొన్నారు.

ఎంతో సంతోషంగా ఉంది

'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్‌లో నటప్రపూర్ణ కాంతారావు గారి స్మారక పురస్కారం నాకు దక్కినందుకు ఆనందంగా ఉంది' అన్నారు విజయ్ దేవరకొండ. 'పెళ్లి చూపులు' చిత్రానికి రెండో ఉత్తమ చిత్రం పురస్కారం దక్కినందుకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వానికి, జ్యూరీకి ధన్యవాదాలు తెలిపారు. అభిమానుల ప్రేమకు ఎప్పటికీ రుణపడి ఉంటానని ఆయన చెప్పారు.

విశాఖలో నిర్మాతల భేటీ



తెలుగు సినీ పరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలపై విశాఖపట్నంలో శుక్రవారం కీలక సమావేశం జరిగింది. దొండపర్తిలోని ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు సి.కల్యాణ్, నిర్మాతలు అశోక్ కుమార్, సుధాకర్‌రెడ్డి, భరత్ భూషణ్ తదితరులు భేటీ అయ్యారు. ఈ సమావేశానికి ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, స్టూడియోల నిర్వాహకులను కూడా ఆహ్వానించారు. అంతా కూర్చొని.. థియేటర్ల నిర్వహణ, సినిమాలు ప్రదర్శించినందుకు యాజమానులకు ఎంత పర్సంటేజీ ఇవ్వాలి వంటి అంశాలపై చర్చించారు. ఒక్కో విభాగం నుంచి తొమ్మిది మంది చొప్పున, మూడు విభాగాల (నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు) నుంచి మొత్తం 27 మందితో మూడు కమిటీల పేర్లను ప్రభుత్వానికి నివేదించనున్నట్టు నిర్మాత భరత్ భూషణ్ మీడియాకు తెలిపారు. ఈ జాబితాను ఆదివారం లేదా సోమవారం ప్రభుత్వానికి ఇస్తామని, అప్పుడే మీడియాకు కూడా అందజేస్తామన్నారు.

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి)

క్షమాపణ ప్రసక్తే లేదు



తమిళం నుంచే కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవ్వడం తెలిసిందే. క్షమాపణలు చెప్పాలంటూ వస్తున్న డిమాండ్లపై కమల్‌హాసన్ స్పందించారు. తాను ఏమీ తప్పుగా మాట్లాడలేదని, అందువల్ల క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని ప్రకటించారు. శుక్రవారం ఉదయం ఆయన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని రాజ్యసభ సభ్యుడిగా తనకు అవకాశం కల్పిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కమల్ చెల్లని నాణెం



కమల్‌హాసన్ చెల్లని నాణెం వంటి వాడని కేంద్రమంత్రి శోభా కరంద్లాజె అన్నారు. బెంగళూరులో ఎంఎస్‌ఎంఈల ప్రగతిపై శుక్రవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి, మీడియాతో మాట్లాడారు. సినిమా ప్రచారం కోసం కన్నడ భాషను అవమానించడం సరికాదని కమల్ హాసన్‌పై మండిపడ్డారు. కన్నడ, తెలుగు, తమిళం, మళయాళం.. భాష ఏదైనా మనమంతా భారతీయులమని, కలసి జీవించాలని అన్నారు. మరొకరి భాషను అవమానించడం సరికాదని అన్నారు. అన్ని భాషల వాళ్లు ఆదరిస్తేనే సినీ పరిశ్రమకు మనుగడ సాధ్యమని అన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)



సారంగి నివాసంలో అధికారులు గుర్తించిన నగదు

కిటికీలో నుంచి కరెన్సీ వర్షం

విజిలెన్స్ దాడికి భయపడి నోట్ల కట్టలు బయటకు విసిరేసిన ఒడిసా ఇంజనీర్

భువనేశ్వర్, మే 30 : ఒడిసా రాజధాని భువనేశ్వర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద శుక్రవారం కరెన్సీ వర్షం కురిసింది. ఒడిసా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ ఇంజనీర్‌గా పని చేస్తోన్న వైకుంఠనాథ్ సారంగి ఈ వర్షం కురిపించాడు. సోదాల నిమిత్తం తన ఇంటికి వచ్చిన విజిలెన్స్ అధికారులను చూసి కంగుతిన్న సారంగి.. తన దగ్గరున్న కొన్ని కరెన్సీ నోట్ల కట్టలను కిటికీలో నుంచి బయటికి విసిరేశాడు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై చీఫ్ ఇంజనీర్ వైకుంఠనాథ్ సారంగిపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. భువనేశ్వర్‌లో వైకుంఠనాథ్ నివాసముంటున్న ఫ్లాట్ సహా ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. తాను అక్రమంగా సంపాదించిన డబ్బు సంగతి బయటపడకూడదనే ఆలోచనతో సారంగి భువనేశ్వర్‌లోని తన ఇంటి కిటికీలో నుంచి కొన్ని రూ.500 నోట్ల కట్టలు బయటికి పారేశాడు. ఈ చర్యను గుర్తించిన అధికారులు ప్రత్యక్ష సాక్షుల సమక్షంలో ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఈ సోదాల్లో రూ.2.1 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు. విజిలెన్స్ సిబ్బంది ఆ నగదును లెక్కిస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి.

చిన్న రుణ గ్రహీతలను మినహాయించండి

- పసిడిపై 2 లక్షల వరకు రుణాలు తీసుకునే వారికి మినహాయింపు
- తమిళ పార్టీల వ్యతిరేకతతో ఆర్బీఐకి కేంద్ర ఆర్థిక శాఖ సూచన

న్యూఢిల్లీ, మే 30: బంగారం తాకట్టుపెట్టి రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకునే చిన్న రుణ గ్రహీతలను కొత్త మార్గదర్శకాల నుంచి మినహాయించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కేంద్ర ఆర్థిక శాఖ సూచించింది. వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్ 9న బంగారం రుణాలపై ఆర్బీఐ ముసాయిదా మార్గదర్శకాలు జారీ చేసింది. బంగారం తాకట్టు పెట్టుకుని ఇచ్చే రుణ విలువ పసిడి విలువలో 75% కంటే ఎక్కువ ఉండరాదని మార్గదర్శకాల్లో పేర్కొంది. దీనిపై తమిళనాడులో ని రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఈ మార్గదర్శకాల వల్ల సన్నకారు రైతులకు రుణాలు లభించడం కష్టమవుతుందని, జోక్యం చేసుకోవాలంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్ర ఆర్థికమంత్రికి లేఖ రాశారు. దీంతో ఆర్బీఐ జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలను ఆర్థికసేవల విభాగం పరిశీలించి చిన్న రుణ గ్రహీతలపై ప్రభావం పడకుండా కొత్త మార్గదర్శకాలు ఉండాలని సూచించింది.

లోకం తీరు



నేవీ పూర్తి స్థాయిలోరంగంలోకి దిగితే
పాక్ నాలుగు ముక్కలయ్యేది!

- 1971లో భారత నేవీ దెబ్బకు ఆ దేశం రెండు ముక్కలైంది
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యలు

పనాజి, మే 30: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నౌకా దళం సన్నద్ధమైన తీరును రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. ఇది చూసి పాకిస్థాన్ భయపడిపోయిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నేవీ పూర్తిస్థాయిలో రంగంలోకి దిగి ఉంటే.. 1971 నాటికంటే తీవ్రమైన పరిణామాలను పాకిస్థాన్ ఎదుర్కొని ఉండేదని, ఆ దేశం నాలుగు ముక్కలయ్యేదని వ్యాఖ్యానించారు. మన దేశీయ యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను రాజ్‌నాథ్ శుక్రవారం సందర్శించారు. ప్రస్తుతం అరేబియా సముద్రంలో మోహరించి ఉన్న ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ సన్నద్ధతను సమీక్షించారు. ఇక ముందు కూడా నేవీ పూర్తి సన్నద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

మన దళాల దెబ్బకు పాక్ ఇప్పట్లో కోలుకోలేదు

- బీఎస్ఎఫ్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసలు

పూంచ్/జమ్మూ, మే 30: ఆపరేషన్ సిందూర్ సమయంలో 118కి పైగా పాక్ సైనిక పోస్టులను, వాటి నిఘా నెట్‌వర్క్‌ను బీఎస్ఎఫ్ పూర్తిగా ధ్వంసం చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మన దళాల దెబ్బకు పాకిస్థాన్ ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ, అమర్‌నాథ్ యాత్ర సన్నాహాలపై సమీక్షించడంతో పాటు పాక్ జరిపిన షెల్లింగ్ దాడులకు గురైన బాధిత కుటుంబాలను కలుసుకోవడానికి జమ్మూలో ఆయన చేపట్టిన రెండు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. పాక్ దురాక్రమణకు దీటుగా స్పందించిన సరిహద్దు భద్రతా దళాన్ని(బీఎస్ఎఫ్)ను ఆయన ప్రశంసించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రధాని మోదీ హయాంలో 2014లో ప్రారంభమైన జమ్మూ కశ్మీర్ అభివృద్ధి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగడం లేదా మందగించడం అనేదే ఉండదని స్పష్టం చేశారు.

బీజేపీ పాలనలో పెరిగిన బ్యాంకు మోసాలు: ఖర్గే

న్యూఢిల్లీ, మే 30: దేశంలో గత 11 ఏళ్లలో బ్యాంకు మోసాలు విపరీతంగా పెరిగిపోయాయని.. దీనికి బీజేపీ పాలనే కారణమంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మోసాలు, కుతంత్రాలతోనే మోదీ సర్కారు నడుస్తోందంటూ ఆరోపణలు గుప్పించారు. 'గత 11 ఏళ్ల మోదీ పాలనలో రూ.6,36,999 కోట్ల బ్యాంకు మోసాలు జరిగాయి. ఇది 416% పెరుగుదల. నోట్ల రద్దు తర్వాత కూడా.. గత ఆరేళ్లలో నకిలీ రూ.500 నోట్ల సంఖ్య 291 శాతం పెరిగింది. అందులోనూ ఈ ఏడాదే ఇంకా అత్యధికం..' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

తిరుమల క్యూలైన్‌లో భక్తుల ఆందోళన

- సమయానికి ఆహారం అందలేదని, సకాలంలో దర్శనం అవ్వడంలేదని నిరసన
- సర్వదర్శన క్యూలో టీటీడీకి వ్యతిరేకంగా నినాదాలు



క్యూలైన్‌లో భక్తుల ఆందోళన

తిరుమల, మే 30(ఆంధ్రజ్యోతి): తిరుమల సర్వదర్శన క్యూలైన్‌లో శుక్రవారం రాత్రి భక్తులు ఆందోళనకు దిగారు. టీటీడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీటీడీ సమయానికి ఆహారం అందించలేదని, సకాలంలో దర్శనం చేయించడం లేదని సర్వదర్శన క్యూలైన్లలోని భక్తులు రాత్రి 10.30 గంటల సమయంలో నిరసన వ్యక్తం చేశారు. 'టీటీడీ చైర్మన్ డౌన్‌డౌన్, భక్తులకు సౌకర్యాలు కల్పించాలి, పసిపాపలకు పాలు అందించాలి, ఆడవాళ్లకు ప్రత్యేక దర్శనం చేయించాలి, అధికారులు రావాలి, భక్తులను కాపాడాలి' అంటూ క్యూలైన్లలో నినాదాలతో హోరెత్తించారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో పాటు వారాంతం కావడంతో తిరుమలలో శుక్రవారం ఒక్కసారిగా భక్తుల రద్దీ పెరిగింది. క్యూలైన్లలో తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, తీవ్రమైన చలి గాలులకు ఇబ్బంది పడడంతో పాటు అన్న ప్రసాదాలు కూడా అందించడంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆపరేషన్ హిడ్మా!

- మావోయిస్టు అగ్రనేత కోసం దండకారణ్యంలో కూంబింగ్

చర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత, పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ కమాండర్ మాడ్వి హిడ్మా కోసం బలగాలు విస్తృతంగా కూంబింగ్ చేపట్టాయి. ఇందుకోసం ఛత్తీస్‌గఢ్ డీఆర్‌జీ బలగాలతోపాటు కేంద్ర బలగాలు కలిసి ప్రత్యేకంగా 'ఆపరేషన్ హిడ్మా' చేపట్టినట్టు సమాచారం. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతి, వరుసగా ఎన్‌కౌంటర్లలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు చనిపోవడం, అరెస్టులు, లొంగుబాట్లతో దండకారణ్యంలో ఆ పార్టీ పట్టు కోల్పోయింది. ఇదే క్రమంలో మాడ్వి హిడ్మా అలియాస్ సంతోష్‌ను పట్టుకుని ఆపరేషన్ కగార్‌ను చివరి దశకు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. నంబాల కేశవరావును పట్టుకునేందుకు ఛత్తీస్‌గఢ్ డీఆర్‌జీ బలగాలు సుమారు నాలుగు నెలలు ఆపరేషన్ నిర్వహించాయి. అదే తరహాలో హిడ్మా కోసం ఆపరేషన్ చేపట్టాయి. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులు, కర్రె గుట్టల్లో కూంబింగ్ ప్రారంభమైంది. ఇప్పటికే హిడ్మా గురించి కొంత సమాచారం సేకరించినట్టు తెలిసింది. అయితే ఎదురు దాడులు, తప్పించుకోవడంలో హిడ్మా ఆరితేరిన హిడ్మాను పట్టుకోవడం అంత సులువు కాదనే వాదన వినిపిస్తోంది. కానీ కొన్నిరోజుల్లోనే హిడ్మాను పట్టుకోబోతున్నామని ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

మోస్ట్ వాంటెడ్ హిడ్మా

హిడ్మాపై రూ.50 లక్షల రివార్డు ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోని తాడిమెట్లలో 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్లపై దాడి, తెర్రం అడవుల్లో 22 మంది పోలీసులను హత్య చేసిన ఘటన, బీజాపూర్, సుకుమా, దంతెవాడ అడవుల్లో మావోయిస్టులు చేసిన దాడుల్లో ఆయన ప్రధాన నిందితుడు.

ఈడీ అధికారిని అరెస్టు చేసిన సీబీఐ

(మొదటి పేజీ తరువాయి)

రఘువంశీ ఆయనపై ఒత్తిడి తెచ్చినట్టు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఇందులో భాగంగా మొదటి విడత రూ. 20 లక్షలు ఇస్తుండగా అరెస్ట్ చేసి, సీబీఐ కోర్టు ముందు హాజరుపరిచామని అధికారులు తెలిపారు. రఘువంశీ తరఫు న్యాయవాది సిద్ధాంత్ మహంతి మాట్లాడుతూ ఆయనకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్టు చెప్పారు. అయితే బెయిల్ పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉందని, జూన్ 4న విచారణకు వస్తుందని మహంతి తెలిపారు.

'బ్రహ్మోస్'తో పాక్‌కు నిద్ర లేని రాత్రులు

ఉగ్ర, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసిన క్షిపణులు.. స్వదేశీ ఆయుధ శక్తిని ప్రపంచం గుర్తించింది: మోదీ



సభలో మోదీ అభివాదం



ఏడో తరగతి చదువుతున్న శివన్య తివారీ అనే బాలిక గీసిన 'ఆపరేషన్ సిందూర్' చిత్రపటాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వీకరించారు. సభా వేదికపై నుంచి ఆ బాలిక గీసిన చిత్రపటాన్ని చూసిన మోదీ, దానిని తీసుకురావాలని తన భద్రతా సిబ్బందికి సూచించారు. అలాగే ఆ చిత్రపటంపై బాలిక పేరు, చిరునామా రాయమని అడిగారు. ఆమెకు తానే స్వయంగా ఒక లేఖ పంపుతానని హామీ ఇచ్చారు.

కాన్పూర్, మే 30: బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులను మిగిల్చాయని ప్రధాని మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనిక శక్తిని యావత్ ప్రపంచం కళ్లారా చూసిందని చెప్పారు. జమ్మూకశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి మన బలగాలు దీటుగా బదులిచ్చాయని, పాక్‌లోని ఉగ్రవాదులకు తగిన గుణపాఠం నేర్పాయని తెలిపారు. శుక్రవారం మోదీ బిహార్, యూపీలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయడంతో పాటు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రూ.47,600 కోట్ల విలువైన 15 అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రక్షణ రంగంలో పెద్దపెద్ద కంపెనీలు ఉత్తరప్రదేశ్‌కు వస్తున్నాయన్నారు. అమేఠీలో ఏకే203 రైఫిల్ తయారీ ప్రారంభమైందని చెప్పారు. ఈ సందర్భంగా మోదీ ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడారు. మన అక్కచెల్లెళ్ల సిందూరాన్ని తుడిచివేసిన ఉగ్రమూకల పీచమణిచామని, పాక్‌లోని వాళ్ల స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత స్వదేశీ ఆయుధ శక్తి ప్రపంచానికి తెలిసిందని పేర్కొన్నారు. పాక్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను మన క్షిపణి వ్యవస్థలు ధ్వంసం చేశాయన్నారు. బ్రహ్మోస్ క్షిపణులు.. శత్రువులకు నిద్రలేని రాత్రులను మిగిల్చాయని మోదీ చెప్పారు. "ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. స్వదేశీ ఆయుధ సామర్థ్యం, మేకిన్ ఇండియా శక్తిని ఇది ప్రపంచానికి చూపించింది. పాకిస్థాన్‌లో వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉగ్రస్థావరాలను కూడా నాశనం చేశాం. మన ఆయుధాలు, క్షిపణులు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి శత్రువులను వణికించాయి" అని ప్రధాని పేర్కొన్నారు. బ్రహ్మోస్ క్షిపణులతో తమ వైమానిక స్థావరాలపై భారత్ దాడి చేసిందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించిన నేపథ్యంలో ప్రధాని మోదీ మన క్షిపణుల గొప్పతనం గురించి ప్రస్తావించడం గమనార్హం. అంతకుముందు ఆయన బిహార్‌లోని కారకత్‌లో రూ.48,520 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఉగ్రవాదం పాములాంటిదని.. మళ్లీ పడగ విప్పితే ఏ కలుగులో దాక్కున్నా బయటికి లాక్కొచ్చి దాన్ని తొక్కి చంపేస్తామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ భారత అమ్ములపొదిలోని ఓ బాణం మాత్రమేనని చెప్పారు. భారత సైన్యం దాడులతో దిగివచ్చిన పాకిస్థాన్.. యుద్ధాన్ని ముగించాలంటూ వేడుకుందని చెప్పారు. అణ్వాయుధ బెదిరింపులకు భారత్ భయపడదని, దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోదని తేల్చిచెప్పారు.

శుభం ద్వివేది కుటుంబ సభ్యులకు ప్రధాని పరామర్శ

పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన కాన్పూర్ వాసి శుభం ద్వివేది(31) కుటుంబాన్ని ప్రధాని మోదీ శుక్రవారం పరామర్శించారు. మోదీని చూడగానే కుటుంబ సభ్యులు బోరున ఏడ్చారని, వారికి ప్రధాని ధైర్యం చెప్పారని మృతుడి బంధువు సౌరభ్ తెలిపారు. ప్రధాని కూడా భావోద్వేగానికి గురయ్యారన్నారు.

హైదరాబాద్ కుర్రాడు..
స్పెల్లింగ్ బీ విజేత

- పతిష్ఠాత్మక పురస్కారాన్ని గెల్చుకున్న ఫైజాన్ జాకీ
- అమెరికాలో ఏడో తరగతి విద్యార్థి



న్యూయార్క్, మే 30: ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక 'స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ' చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్ మూలాలున్న 13 ఏళ్ల భారతీయ అమెరికన్ కుర్రాడు ఫైజాన్ జాకీ గెల్చుకున్నాడు. eclaircissement అనే పదంలోని అక్షరాలను సరిగా చెప్పటంతో ఫైజాన్ విజేతగా నిలిచాడు. అస్పష్టంగా ఉన్న దానిని పరిష్కరించటం, జ్ఞానోదయం కలిగించటం అని ఈ పదానికి ఉన్న అర్థం. గురువారం రాత్రి అమెరికాలోని మేరీలాండ్‌లో జరిగిన స్పెల్లింగ్ బీ కార్యక్రమం ప్రత్యక్షప్రసారాన్ని ఫైజాన్ తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు హైదరాబాద్ నుంచి వీక్షించారు. ఫైజాన్ అమెరికాలోని సీఎం రైస్ మిడిల్ స్కూల్ ఏడో తరగతి విద్యార్థి. ఇప్పటివరకూ నాలుగుసార్లు స్పెల్లింగ్ బీ పోటీల్లో పాల్గొన్న ఫైజాన్.. గత ఏడాది రెండోస్థానంలో నిలిచాడు. ఈసారి చివరిదైన 21వ రౌండ్‌లో ముగ్గురితో పోటీ పడి గెలుపును సొంతం చేసుకున్నాడు. కాగా, 1925లో ప్రారంభమైన స్పెల్లింగ్ బీ పోటీకి ఇది 100వ సంవత్సరం కావటం విశేషం. తరచూ భారతీయఅమెరికన్ విద్యార్థులే స్పెల్లింగ్ బీ చాంపియన్‌షిప్‌ను గెల్చుకుంటున్నారు. విజేతలకు 50వేల డాలర్ల నగదు, మెడల్, ట్రోఫీని అందిస్తున్నారు.



ప్రమాణం చేస్తున్న జస్టిస్ ఎన్‌వీ అంజారియా జస్టిస్ విజయ్ బిష్ణోయి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్

ముగ్గురు సుప్రీం జడ్జీల ప్రమాణం

- 34కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య

న్యూఢిల్లీ, మే 30: సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులుగా జస్టిస్ ఎన్‌వీ అంజారియా, జస్టిస్ విజయ్ బిష్ణోయి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్ పదవీప్రమాణం చేశారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో వారితో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో సుప్రీంకోర్టు పూర్తి బలాన్ని సంతరించుకుంది. సీజేఐతో కలిపి న్యాయమూర్తుల సంఖ్య 34కి చేరుకుంది.

సహజ సంపద దోపిడీకే బూటకపు ఎన్‌కౌంటర్లు

- మావోయిస్టు అగ్రనేత సజ్జా సంస్మరణ సభలో వక్తలు

చీరాల, మే 30(ఆంధ్రజ్యోతి): రానున్న అతి కొద్దిరోజుల్లో సహజ సంపద కార్పొరేట్ల చేతుల్లోకి మారుతుందని, దీనిని అడ్డుకుంటున్నందుకే మావోయిస్టు అగ్రనేతలు నంబాల కేశవరావు, సజ్జా నాగేశ్వరరావు తదితరులను దారుణంగా హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తున్నారని రాష్ట్ర పౌర హక్కుల సంఘం కార్యదర్శి చిలక చంద్రశేఖర్ ఆరోపించారు. బాపట్ల జిల్లా చీరాల సమీపంలోని జాండ్రపేటలో శుక్రవారం మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు, 'అవాన్-ఇ-జంగ్' పత్రిక ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు సజ్జా నాగేశ్వరరావు(61) అలియాస్ ఏసన్న సంస్మరణ సభను రాష్ట్ర చేనేత జనసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి పలు విప్లవ సంఘాలు, ప్రజాసంఘాలు, పౌర హక్కుల సంఘాల నాయకులు హాజరై సజ్జాకు నివాళులర్పించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 'ఆపరేషన్ కగార్' పేరుతో దండకారణ్యంలో హత్యలకు పాల్పడుతోందని తెలిపారు. బిహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లోని సహజ సంపద దోపిడీదారుల వశమవుతుందని చెప్పారు. వాటిని రక్షించేందుకు మావోయిస్టు పార్టీలు ప్రాణాలకు తెగించి పోరాటాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. 1988-90 మధ్య గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 200 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వివరించారు. చేనేతల కుటుంబానికి చెందిన నాగేశ్వరరావు ఆ సమయంలో పోరాట బాట పట్టారని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం సుమారు 470 మందిని ఎన్‌కౌంటర్ల పేరుతో దారుణంగా కాల్చి చంపిందన్నారు. వారిలో 200కు పైగా మహిళలు ఉన్నట్లు చెప్పారు. ఇది అప్రజాస్వామికమన్నారు. వారి కుటుంబసభ్యులు కనీసం చివరి చూపునకు కూడా నోచుకోలేక పోయారన్నారు.

8.5 కోట్ల నగదు.. 1770 వజ్రాల కిరీటం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి నలుగురు చొప్పున 16 మంది విజేతల పేర్లను ప్రకటించారు. అమెరికా-కరేబియన్ విభాగం నుంచి ట్రినిడాడ్-టొబాగో, మార్టినిక్, ప్యూర్టోరికో, డొమినికన్ రిపబ్లిక్ దేశాలవారు... ఆఫ్రికా విభాగం నుంచి జాంబియా, నమీబియా, ఉగాండా, కామెరూన్‌వారు.. యూరప్ నుంచి ఎస్తోనియా, వేల్స్, ఐర్లాండ్, మోంటెనెగ్రోవారు.. ఏషియా-ఓషియానా నుంచి భారత ప్రతినిధి నందినీ గుప్తాతోపాటు తుర్కియే, థాయ్‌లాండ్, ఇండోనేషియా భామలు ఉన్నారు. మొత్తంగా తుది పోటీల్లో ఒక్కో విభాగం నుంచి 10 మంది చొప్పున 40 మంది ఉంటారు. ఇప్పటికే ప్రకటించిన 16 మంది పోగా.. మిగతా 24 మంది వివరాలను శనివారం పోటీల ప్రారంభం ముందు ప్రకటిస్తారు. ఫ్యాషన్ షో, ఇతర పోటీల ఆధారంగా ఈ 40 మంది నుంచి.. 20 మందిని ఎంపిక చేస్తారు. అంటే ఒక్కో విభాగం నుంచి సంఖ్య 5కు తగ్గుతుంది. తర్వాత ఒక్కో విభాగం నుంచి ఇద్దరు చొప్పున 8 మందిని తుది పోటీకి ఎంపిక చేస్తారు. జ్యూరీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఇచ్చే సమాధానాల ఆధారంగా.. ఒక్కో విభాగం నుంచి ఒకరు ఎంపికవుతారు. వీరిలో ఒకరు ప్రపంచ సుందరిగా, మిగతా ముగ్గురు రన్నరప్‌లుగా నిలుస్తారు. గత మిస్‌వరల్డ్ విజేత చెక్ రిపబ్లిక్ సుందరి క్రిస్టినా ఈసారి విజేతకు వజ్రాల కిరీటం పెడతారు.

నలుగురు న్యాయనిర్ణేతలు..

తుది పోటీలకు నలుగురు న్యాయనిర్ణేతల పేర్లను నిర్వాహక సంస్థ శుక్రవారం ప్రకటించింది. వీరిలో నటుడు సోనూ సూద్, మేఘా ఇంజనీరింగ్ డైరెక్టర్ సుధారెడ్డి, మిస్ ఇంగ్లండ్-2014 విజేత కెరీనా టురెల్, మిస్ వరల్డ్ సంస్థ చైర్‌పర్సన్ జూలియా మోర్లీ ఉన్నారు. విజేత పేరును జూలియా మోర్లీ ప్రకటిస్తారు. తుదిపోటీలకు మిస్ వరల్డ్-2016 విజేత స్టిఫానీ డెల్‌వ్యాలీ, సచిన్ కుంభర్ వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తారు. బాలీవుడ్ నటులు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్ తమ నృత్యంతో అలరించనున్నారు. తుది పోటీలు సాయంత్రం 5-30 గంటలకు ప్రారంభమై రాత్రి 9-30కు ముగుస్తాయి.

భారత్ గెలిస్తే రికార్డు..

ఈసారి పోటీల్లో భారత సుందరి నందిని గుప్తా గెలిస్తే.. ఎక్కువ సార్లు మిస్ వరల్డ్ గెలుచుకున్న దేశంగా భారత్ రికార్డు సాధిస్తుంది. 1951 నుంచి ప్రపంచ సుందరి పోటీలు జరుగుతుండగా.. భారత్, వెనెజువెలా ఆరు సార్లు చొప్పున కిరీటం గెలుచుకున్నాయి. మన దేశం నుంచి తొలిసారి 1966లో రీటా ఫారియా ప్రపంచ సుందరి కిరీటం గెలిచారు. 1994లో ఐశ్వర్యారాయ్, 1997లో డయానా హెడెన్, 1999లో యుక్తాముఖి, 2000లో ప్రియాంకా చోప్రా, 2017లో మానుషి చిల్లర్ విజేతలుగా నిలిచారు. ఈసారి గెలిస్తే ఏడోసారి కిరీటం భారత్ సొంతమవుతుంది. అయితే ఇప్పటివరకు జరిగిన పోటీలో నందినీ గుప్తా.. ఏషియా-ఓషియానా విభాగంలో తుర్కియే, థాయ్‌లాండ్, ఇండోనేషియా భామల నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారు. ఇక ఇప్పటివరకు యూకే 5 సార్లు, జమైకా 4, దక్షిణాఫ్రికా, యూఎస్ఏ, ఐస్‌లాండ్, స్వీడన్ 3 సార్లు మిస్ వరల్డ్ గెలుచుకున్నాయి.

అందరి చూపు.. హైదరాబాద్ వైపు..

ఈనెల 10న గచ్చిబౌలిలో జరిగిన మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకలు 120కిపైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారంకాగా.. శనివారం జరిగే తుది పోటీలు 150కిపైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. భారత్‌లో సోని లివ్ చానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. www.watchmissworld.com వెబ్‌సైట్ ద్వారా వీక్షించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 కోట్ల మంది మిస్ వరల్డ్ ప్రత్యక్ష ప్రసారాలు వీక్షిస్తారని అంచనా. తుది పోటీల కోసం హైటెక్స్‌లో 4 వేల మందికి సరిపడా ఏర్పాట్లు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కుటుంబ సభ్యులతో హాజరుకానున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వానాలు వెళ్లాయి.

మిస్ వరల్డ్ బ్రాండ్ అంబాసిడర్‌గా సుధారెడ్డి

మేఘా ఇంజనీరింగ్ సంస్థ డైరెక్టర్ సుధారెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఆమె మిస్ వరల్డ్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంస్థ చైర్ పర్సన్ జూలియా మోర్లీ శుక్రవారం ప్రకటించారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న 108 మంది అందాల భామలకు సుధారెడ్డి తన నివాసంలో 'బ్యూటీ విత్ ఏ పర్పస్ గాలా' విందు ఇచ్చారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, మహిళా సాధికారత కోసం సుధారెడ్డి తన పేరిట ఓ ఫౌండేషన్ స్థాపించి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇలా సామాజిక సేవలో నిమగ్నమైన సుధారెడ్డిని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకోవడం సంతోషంగా ఉందని జూలియా మోర్లీ ప్రకటించారు. ఈ నియామకం తన సేవా బాధ్యతను మరింతగా పెంచిందని సుధారెడ్డి అన్నారు.

ట్రంప్ సుంకాలకు మళ్లీ ఓకే!

- టారిఫ్‌లను ఆపాలన్న ట్రేడ్ కోర్టు తీర్పును తాత్కాలికంగా నిలిపివేసిన అప్పీల్ కోర్టు

వాషింగ్టన్, మే 30: ట్రంప్ టారిఫ్‌ల వ్యవహారం మరో మలుపు తిరిగింది. వివిధ దేశాల దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలను నిలిపివేస్తూ ట్రేడ్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ కోర్టు స్టే ఇచ్చింది. ట్రంప్ సర్కారు సుంకాల వసూలు కొనసాగించేందుకు మార్గం సుగమం చేసింది. తాము తిరిగి ఆదేశాలు ఇచ్చేవరకు ఈ స్టే అమల్లో ఉంటుందని ప్రకటించింది. ఏప్రిల్ 2న లిబరేషన్ డే పేరిట వివిధ దేశాలపై భారీగా సుంకాలను ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా ఉత్పత్తులపై ఆయా దేశాలు భారీగా సుంకాలు వసూలు చేస్తున్నాయని, దానికి ప్రతిగా తాము సుంకాలు విధిస్తున్నామని ఆయన ప్రకటించారు. అమెరికా 'అంతర్జాతీయ అత్య వసర ఆర్థిక అధికారాల చట్టం-1977' కింద అధ్యక్షుడికి దఖలు పడిన అధికారాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై అక్కడి 'కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్'లో పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన ట్రేడ్ కోర్టు.. ట్రంప్ సుంకాలను నిలిపివేస్తూ తీర్పిచ్చింది. దీనిపై ట్రంప్ సర్కారు 'ఫెడరల్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు'లో అప్పీలు చేసింది. ట్రేడ్ కోర్టు తీర్పును నిలిపివేయాలని కోరింది. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న అప్పీల్స్ కోర్టు.. ట్రేడ్ కోర్టు తీర్పును తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

మానసిక రుగ్మతలను
ప్రాథమిక దశలోనే గుర్తించాలి

- ఆషా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జీ ప్రసాదరావు



డాక్టర్ జీ ప్రసాదరావును సత్కరిస్తున్న డాక్టర్ నరసింహారావు తదితరులు

గుంటూరు (తూర్పు), మే 30 (ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మత (స్కిజోఫ్రెనియా)ను ప్రాథమిక దశలోనే గుర్తించగలిగితే బాధితులు వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చని హైదరాబాద్ ఆషా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జీ ప్రసాదరావు అభిప్రాయడ్డారు. ప్రపంచ స్కిజోఫ్రెనియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు మెడికల్ క్లబ్‌లో "మానసిక రుగ్మతలు-అందుబాటులో చికిత్స" అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కిజోఫ్రెనియా వ్యాధికి కారణమైన నూతన పరిశోధనలు, చికిత్స విధానాలను వివరించారు. వ్యాధి తీవ్రమైతే జీవితాంతం మందులు వాడాల్సిన అవసరం ఏర్పడుతుందని చెప్పారు. స్కిజోఫ్రెనియాపై అవగాహన, అనేది చాలా అవసరమని అన్నారు. లక్షణాలు అధికంగా ఉన్నవారికి అధునాతన చికిత్సలు, ఔషధాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. తొలుత ప్రఖ్యాత మానసిక వైద్యులు డాక్టర్ ఎ. శంకరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. మానస స్కిజోఫ్రెనియా ఫౌండేషన్, డాక్టర్ ఆమంచర్ల శంకరరావు మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఐవీఎల్ నరసింహారావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారాయుడు, డాక్టర్ ఎన్‌వీ రమణారావు, డాక్టర్ ఐ శరత్‌చంద్ర, డాక్టర్ శ్రీ రమ్య, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొని డాక్టర్ జీ ప్రసాదరావును సత్కరించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, సవిత, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఆర్.మాధవి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు

మహానాడు వైఎస్ కుటుంబానికి చెంపపెట్టు: పల్లా

కడప మారుతీనగర్, మే 30(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ కుటుంబానికి కడప జిల్లా కంచుకోట అని ప్రగల్భాలు పలికే వైసీపీ ఉత్తర కుమార నాయకులకు చెంపపెట్టులా... కడపలో మహానాడు అద్భుతంగా జరిగింది. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన మహానాడులు అన్నింటినీ మించి కడప మహానాడు విజయవంతం అయింది' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఇక్కడ పాత్రికేయుల సమావేశంలో ఆయన మంత్రులు, ఎంఎల్‌సీలు, ఎమ్మెల్యేలతో కలసి మాట్లాడారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి సంవత్సరం అవుతోంది. ప్రజలకు సీఎం చంద్రబాబు పట్ల అపారమైన నమ్మకం ఉందని మహానాడు సభ నిరూపించింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ప్రతిపాదించిన ఆరు శాసనాలు భవిష్యత్తులో పార్టీని బంగారు బాటలో నడిపించేందుకు ఎంతగానో దోహదపడతాయి. మహానాడును విజయవంతం చేసిన ఉమ్మడి కడప జిల్లా పార్టీ నాయకులకు, ప్రత్యేకించి కార్యకర్తలు, ప్రజలు, అభిమానులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు' అని పల్లా అన్నారు.

'గిన్నిస్' లక్ష్యంగా విశాఖలో యోగా వేడుకలు

» 5 లక్షల మంది పాల్గొనేలా విస్తృత ఏర్పాట్లు: సీఎస్

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో 5 లక్షల మందితో ఆసనాలు వేయించడం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు. యోగాంధ్ర-2025, యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం ఆయా శాఖల కార్యదర్శులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కనీసం 2 కోట్ల మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా విశాఖపట్నం ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ సుమారు 26 కిలోమీటర్ల పొడవున నిర్వహించే కార్యక్రమంలో 5 లక్షల మంది పాల్గొని, ప్రపంచ గిన్నిస్ రికార్డు సాధించేలా, సమీప భవిష్యత్తులో ఎవరూ ఆ రికార్డును అధిగమించలేని రీతిలో విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రస్థాయి నోడల్ అధికారి కృష్ణబాబు జూన్ 16 నుంచి విశాఖ కమాండ్ కంట్రోల్ కేంద్రంగా పని చేస్తారన్నారు. సమావేశంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వర్చువల్‌గా పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో సోలార్ రూఫ్‌టాప్ మోడల్ విలేజ్: సీఎస్

ప్రతి జిల్లాలోనూ ఒక సోలార్ రూఫ్‌టాప్ మోడల్ విలేజ్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఈ ఏడాది జూన్ నాటికి డిస్కమ్‌లు, నెడ్‌క్యాప్ కలిపి మూడు లక్షల సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం డిస్కమ్‌ల సీఎండీలు, నెడ్‌క్యాప్ అధికారులతో విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ ఏడాది 20 లక్షల రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లు ఇవ్వాలన్నదే లక్ష్యమని సీఎస్ చెప్పారు.

వలివేటి శుభావతికి 'నైటింగేల్' ప్రదానం



న్యూఢిల్లీ, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నర్సు వలివేటి శుభావతికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును ప్రదానం చేశారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2025 గానూ నర్సు వృత్తిలో విశిష్ట సేవలు అందించిన 15 మందికి ఈ అవార్డులను అందజేశారు. వీరిలో ఏపీకి చెందిన ఏఎన్ఎం శుభావతి ఒకరు. ఈమె కర్నూలులోని ప్రాంతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శిక్షణ కేంద్రంలో మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నారు.

డ్వాక్రా మహిళలకు రుణాలివ్వాలి: మంత్రి కొండపల్లి

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు అవసరమైన రుణాలను వారికి అవసరమైన సమయంలో ఇవ్వాలని బ్యాంకర్లను సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం వార్షిక రుణ ప్రణాళిక, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల రుణాల మంజూరుపై సెర్ప్ కార్యాలయంలో సెర్ప్ సీఈఓ కరుణ వాకాటి అధ్యక్షతన బ్యాంకర్లతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలు ముద్ర, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ లేదా ఇతర స్కీమ్‌ల ద్వారా అవసరమైన రుణాలు పొందే విధంగా బ్యాంక్ మేనేజర్లు సహకరించాలని కోరారు. వడ్డీ రాయితీని దృష్టిలో ఉంచుకుని మహిళా పెట్టుబడుదారులను ప్రోత్సహించాలన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలకు పదోన్నతులు

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ తాగునీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్ఈలకు చీఫ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. శ్రీకాకుళం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఈషన్‌బాషాను ఏపీడీడబ్ల్యూఎస్సీ ఎండీగాను, ఏలూరు ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్‌లో ఎస్ఈఎన్‌వీవీ సత్యనారాయణను విజయవాడలోని ఈఎన్‌సీ ఆఫీసులో చీఫ్ ఇంజనీర్‌గా నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

'సీలేరు' శంకుస్థాపనకు సిద్ధమవండి: సీఎస్

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): 1,350 మెగావాట్ల అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రం శంకుస్థాపనకు సిద్ధం కావాలని ఏపీజెన్కో సీఎండీ కేవీఎన్ చక్రధరబాబును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఏపీ జెన్కో విద్యుత్తు ప్రాజెక్టులపై శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్షించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకూ 14శాతం వృద్ధితో ఏపీ జెన్కో, ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విద్యుదుత్పత్తి చేయడంపై సీఎస్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ జెన్కో థర్మల్ విద్యుదుత్పత్తి 9శాతం పెరిగిందన్నారు. 2027 జనవరి నాటికి 960 మెగావాట్ల పోలవరం జలవిద్యుదుత్పత్తి కేంద్రాన్ని పూర్తిచేయాలన్నారు.

అదే ఉద్యోగి.. అదే సీటు!

» దేవదాయ శాఖలో అంతర్గత బది'లీలలు'

» అవినీతి ఆరోపణలున్న ఉద్యోగికి కీలక విభాగం కేటాయింపు

అమరావతి. మే 30(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో అంతర్గత బదిలీల్లో భాగంగా శుక్రవారం ఇద్దరు ఉద్యోగులను కమిషనర్ సీటు మార్చారు. ఈ-సెక్షన్‌లో కొన్ని విభాగాలను సీ-సెక్షన్ బాధ్యతలు నిర్వహించే సీనియర్ అసిస్టెంట్‌కు అప్పగించారు. గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 ఈవోల సర్వీస్ మెంటర్లు, వారి బదిలీలన్నీ ఈ-సెక్షన్‌లోని ఈ-2 విభాగంలోనే ఉంటాయి. అంత కీలకమైన విభాగానికి సంబంధించిన ఉద్యోగిని ఆకస్మాత్తుగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ-2 సీటు అప్పగించిన ఉద్యోగిపై అనేక అవినీతి ఆరోపణలున్నాయి. గతంలో ఇదే సీటులో విధులు నిర్వహించిన ఆయన ఈవోల బదిలీల పేరుతో రూ.కోట్లు వసూలు చేశారు. దీనిపై గత ప్రభుత్వంలో దేవదాయ మంత్రికి ఫిర్యాదులు అందడంతో నిఘా విభాగంతో విచారణ చేయించారు. బదిలీల పేరుతో రూ.కోట్లు వసూలు చేయడం వాస్తవమేనంటూ అందుకు బాధ్యులైన అధికారులు, ఉద్యోగుల వివరాలతో సహా ఇంటెలిజెన్స్ అధికారులు నివేదిక అందించారు. స్పందించిన నాటి ప్రభుత్వం వెంటనే సదరు ఉద్యోగులను సస్పెండ్ చేయాలని ఆదేశించింది. కానీ అప్పటి దేవదాయ శాఖ అధికారులు కేవలం సెక్షన్, సీటు మార్చడంతో సరిపెట్టారు. ఇప్పుడు సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఉద్యోగికి మళ్లీ కీలకమైన ఈ-2 విభాగం బాధ్యతలు అప్పగించడమేంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అంతర్గత బదిలీ పేరుతో దేవదాయ శాఖ అధికారులు ఆకస్మాత్తుగా సీటు మార్చడంతో మరోసారి భారీగా వసూళ్లకు సిద్ధమయ్యారేమోనని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 'బెటర్ అడ్మినిస్ట్రేషన్' కోసం అంతర్గత బదిలీలు చేస్తున్నట్లు అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీని ప్రకారం సమర్థులైన ఉద్యోగులకు ఇలాంటి కీలక విభాగాన్ని కేటాయించాలి. కానీ అవినీతి ఆరోపణలున్న ఉద్యోగులకు ఆ సీటు అప్పగించడం సరికాదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ప్రజలతో మమేకమవ్వండి

ప్రభుత్వ కార్యక్రమాలపై నిరంతర చర్చ

త్వరలో సంక్షేమ క్యాలెండర్ ప్రకటన: సీఎం

అమరావతి, మే 30 (ఆంధ్రజ్యోతి): 'ప్రజలతో నాయకులు మరింత మమేకం కావాలని.. తద్వారా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై నిరంతరం చర్చ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తాను ప్రతి నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి కారణం కూడా అదేనని.. ఎమ్మెల్యేలు కూడా విధిగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. మహానాడులో ప్రవేశపెట్టిన 'నా తెలుగు కుటుంబం'లోని ఆరు శాసనాలను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి నాయకులతో చంద్రబాబు శుక్రవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కడప మహానాడును విజయవంతం చేసిన కడప జిల్లా నాయకత్వానికి, రాష్ట్ర స్థాయి నేతలకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. నాయకత్వం సమష్టిగా పనిచేస్తే ఏ కార్యక్రమమైనా సజావుగా జరుగుతుందని కడప మహానాడుతో నిరూపితమైందన్నారు. మంత్రులంతా కార్యకర్తల్లా పనిచేసి స్ఫూర్తినిచ్చారని అభినందించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసేలా పాలన సాగుతోందని, ఏడాదిలో మనం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా నిర్ణయాలపై వారిలో సానుకూలత ఉందని తెలిపారు. 'ప్రజలకు ఏడాది పాలనలో ఏం చేశామో.. రాబోయే రోజుల్లో ఏం చేస్తామో మహానాడు ద్వారా వివరించాం. జూన్‌లో తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ ప్రారంభిస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నాం. సంక్షేమ క్యాలెండర్‌ను త్వరలో ప్రకటిస్తాం' అని సీఎం తెలిపారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్న నేపథ్యంలో ఆయన శుక్రవారం సీఎంను ఆయన అధికారిక నివాసం వన్ జనపథ్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంద కృష్ణను, చంద్రబాబు అభినందించారు. వర్గీకరణ ఉద్యమ ప్రస్థానాన్ని గురించి ఇరువురు నేతలు గుర్తు చేసుకున్నారు. - న్యూఢిల్లీ, ఆంధ్రజ్యోతి

అమరావతికి ఆహ్వానం!

(మొదటి పేజీ తరువాయి)

అనే అంశంపై జరిగిన ప్లీనరీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధి ఎజెండాను వారికి వివరించారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర విజన్‌ను సాకారం చేసేందుకు పారిశ్రామికవేత్తలు తరలిరావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 జనవరి నాటికి భారత్‌లో తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రాన్ని అమరావతిలో నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. ఇందులో టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ కంపెనీలు పాలుపంచుకుంటున్నాయని తెలిపారు. భావి నేతలకు శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో అమరావతిలోనే గ్లోబల్ లీడర్‌షిప్ కేంద్రాన్ని నెలకొల్పుతున్నామన్నారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐసీఈ)-2024 విధానం కింద గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రాయలసీమలో ఏడాదికి రూ.5 లక్షల కోట్లను ఆకర్షించే హైటెక్ పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పరుస్తున్నామని చెప్పారు. ఐటీ పరిజ్ఞానం క్రమంగా పరిపక్వమవుతూ నేడు ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సీసీటీవీ, డ్రోన్ల యుగానికి చేరుకున్నామని, రియల్ టైం డేటాను సమర్థంగా సమకూర్చుకుంటున్నామని తెలిపారు. బిల్ మిలిందా గేట్స్ సహకారంతో కుప్పంలో ఆరోగ్య సంరక్షణలో ఏఐని వినియోగిస్తున్నామని చెప్పారు. తనను అన్యాయంగా జైలుపాల్జేసినప్పుడు 80 దేశాల్లో సాంకేతిక వృత్తినిపుణులు నిరసన తెలిపారని ప్రస్తావించారు. ప్రపంచంలో భారత్‌ను ఆర్థిక శక్తిగా రూపుదిద్దేందుకు ప్రధాని మోదీ కృషిని.. తీసుకుంటున్న చర్యలను వివరించారు.

మీరూ వచ్చి చేరండి..

అనకాపల్లిలో రూ.1.43 లక్షల కోట్లతో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ, విశాఖపట్నంలో టీసీఎస్ వంటివి రాబోతున్నాయని సీఎం తెలిపారు. 'శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ భారీఎత్తున పెట్టుబడులు పెడుతోంది. గూగుల్ వంటి ప్రఖ్యాత సంస్థలతో కూడా చర్చలు జరుపుతున్నాం. గ్రీన్ ఎనర్జీలో భాగంగా విశాఖలో ఎన్టీపీసీ-ఎన్ రెడ్ క్యాప్ రూ.1.85 లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయి. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుచేస్తున్నాం. లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకు హైటెక్ పారిశ్రామిక కారిడార్‌ను నెలకొల్పుతున్నాం. రక్షణ, ఉపగ్రహాలు, ఆటోమొబైళ్ల ఉత్పత్తిపై దృష్టి కేంద్రీకరించాం. రేవులు, విమానాశ్రయాలు, జలమార్గాలు, రహదారులను అనుసంధానం చేస్తున్నాం. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో పాటు ప్రజల భాగస్వామ్యాన్నీ నెలకొల్పుతున్నాం. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, పారిశ్రామిక పార్కులను ఏర్పరుస్తున్నాం. అరకు కాఫీ వంటి గ్లోబల్ బ్రాండ్‌లను ప్రోత్సహిస్తున్నాం. రాజధాని అమరావతి మొదటి దశను మూడేళ్లలోపే పూర్తిచేసి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తాం. విభజిత ఆంధ్రప్రదేశ్‌ను ప్రమోట్ చేస్తున్నాం. వచ్చే 22 ఏళ్లకు ఇప్పుడే ప్రణాళికలు చేస్తున్నాం. 15 శాతం వృద్ధి రేటు సాధించడమే మా లక్ష్యం. తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చాలన్నదే మా విజన్' అని వివరించారు.



మంచి విధానాలుంటే తిరుగులేదు..

పాలనలో అత్యుత్తమ విధానాలు అవసరమని.. మంచి విధానాలు ఉంటే భారత్‌ను ఎవరూ చేరుకోలేరని చంద్రబాబు స్పష్టం చేశారు. 'ప్రస్తుతం ఉత్పత్తుల నాణ్యతపై మనం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ప్రపంచస్థాయి ప్రమాణాలతో మన పరిశ్రమలు, ఐటీ ఉత్పత్తులు ఉంటేనే రాణించగలం. గతంలో ఎంటర్‌ప్రెన్యూర్స్ అంటే ఆంధ్రాప్రెన్యూర్స్ అనే పేరుంది. ఇప్పుడు భారత ప్రజలంటేనే ఎంటర్‌ప్రెన్యూర్ అనే పేరు వచ్చింది. సంపద సృష్టిలో స్టార్టప్ కంపెనీలు కీలకం. దీనికి అనుగుణంగా ఏపీలో విధానాలను రూపొందిస్తున్నాం' అని తెలిపారు.

వివిధ ప్రశ్నలకు సమాధానమిస్తూ..

ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై సమావేశంలో పలువురు అడిగారు. వారి ప్రశ్నలకు చంద్రబాబు సమాధానాలిచ్చారు. 'నైపుణ్యమున్న మానవ వనరులు మనకు చాలా అవసరం. నైపుణ్యాభివృద్ధి కోసం ఏపీలోనూ కొన్ని ఉత్తమ విద్యాసంస్థలు వస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) కాలంలో స్మార్ట్ వర్క్ అనేదే కీలకం. బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో ఆరోగ్యం, వ్యవసాయంలాంటి అంశాలపై పనిచేస్తున్నాం. సాంకేతికత ఉంటేనే సరిపోదు దానిని క్షేత్రస్థాయిలో అమలుపరిస్తేనే ఫలితాలు వస్తాయి. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ లాంటివారి నుంచి ఆలోచనలను తీసుకుని నైపుణ్యాభివృద్ధి చేస్తున్నాం. సముద్రంలోకి వృథాగా పోయే 2 వేల టీఎంసీల నీటి నుంచి 200 టీఎంసీలను సద్వినియోగం చేసుకునేలా పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు తలపెట్టాం. వంశధార నుంచి పెన్నా వరకూ నదుల అనుసంధానం చేయాలని సంకల్పించాం. పర్యాటక రంగంలో వచ్చే ఐదేళ్లలో 50 వేల హోటల్ గదులు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అమరావతిలో వివిధ నిర్మాణాలు జరగాల్సి ఉంది. పీ-4-జీరో పావర్టీ వంటి కార్యక్రమాలతో ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేలా కృషి చేస్తున్నాం' అని తెలిపారు. చంద్రబాబు ప్రసంగం పూర్తికాగానే పారిశ్రామికవేత్తలందరూ లేచి నిలబడి చప్పట్లు కొట్టారు. సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు సంజీవ్ పూరి ఆయన్ను సత్కరించారు.

నేడు కోనసీమకు సీఎం

అమలాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సీఎం పర్యటన కోసం జిల్లా యంత్రాంగం విస్తృతస్థాయిలో ఏర్పాట్లను పూర్తిచేసింది. శనివారం ఉదయం చంద్రబాబు నేరుగా ఉండవల్లిలోని స్వగృహం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.45 గంటలకు ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరకుంటారు. సీహెచ్ గున్నేపల్లి, కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో సుమారు ఐదు గంటలపాటు పాల్గొంటారు. సాయంత్రం బయలుదేరి ఉండవల్లికి హెలికాప్టర్‌లో వెళ్తారు.

'జలసిరి'కి జవసత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

సోలార్ పంపుసెట్లు, అందుబాటులో ఉండే రైతులకు విద్యుత్తు పంపుసెట్లు ఇవ్వడం ద్వారా పేద రైతులందరికీ పథకం ఫలాలు అందించాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా వినియోగించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ, నాబార్డు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తదితర నిధులను వినియోగించుకోవడం ద్వారా పేద రైతుల పొలాల్లో జలసిరిని నింపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్టీఆర్ జలసిరి 2.0ను సమర్థవంతంగా అమలు చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కంకణం కట్టుకున్నారు.

విస్తృతంగా అమలవుతున్న సమయంలో..

పేద రైతుల భూములకు జలసిరి అందించాలని అప్పట్లో ఇందిర జలప్రభ పేరుతో కాంగ్రెస్ సీఎంలు వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డిలు హడావుడి చేశారు. అయితే పలు లోపాలతో ఈ పథకం ముందడుగు పడలేదు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని బీడు భూములను సాగు భూములుగా మార్చాలని నిర్ణయించింది. మాజీ సీఎస్ టక్కర్ నేతృత్వంలోని కమిటీ ఎన్టీఆర్ జలసిరికి రూపకల్పన చేసింది. ఆ తర్వాత సీఎస్ దినేష్‌కుమార్ ఈ పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ, ప్రతి ఒక్కరికి బోరుబావులు అందించేందుకు శ్రీకారం చుట్టారు. మొదట్లో విద్యుత్తుతో నడిచే పంపుసెట్లు అందించాలన్న నిర్ణయం ఆచరణలో అందరికీ ఇవ్వడం సాధ్యం కాలేదు. పొలాలకు విద్యుత్తు సౌకర్యం అందించాలంటే చాలా నిధులు అవసరమయ్యాయి. దీంతో కొద్ది మంది రైతులకు మాత్రమే విద్యుత్తు సౌకర్యం కల్పించి, పంపుసెట్లు అందించగలిగారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ సహకారంతో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఎస్సీ ఎస్టీ రైతులు రూ.6 వేలు, ఇతరులు రూ.20 వేల భాగస్వామ్య వాటా చెల్లించడం ద్వారా రూ.2.60 లక్షల విలువ కలిగిన సోలార్ పంపుసెట్లను పొలాల్లో ఏర్పాటు చేశారు. దీంతో చాలా చోట్ల రైతులు ఈ పథకాన్ని విస్తృతంగా వినియోగించుకున్నారు. 2019లో ఈ పథకం కోసం భారీగా దరఖాస్తులు అందాయి. రైతులందరికీ ఈ పథకం ఫలాలు అందించాలని అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల తర్వాత వైసీపీ అధికారంలో వచ్చింది. వచ్చీ రాగానే ఎన్టీఆర్ జలసిరి పేరు కనపడకుండా వైఎస్ఆర్ జలకళగా పేరుమార్చారు. మూడేళ్ల పాటు పథకం జోలికి వెళ్లకుండా నిర్వీర్యం చేశారు.

మంచి ఆశయంతో రూపకల్పన

భూములకు నీటి వసతి కల్పించడం ద్వారా సాగు విస్తీర్ణం పెంచి, మంచి దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం జలసిరి పథకానికి రూపకల్పన చేసింది. అంతకుముందు వైఎస్ రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల హయాంలోని పథకాల్లో లోటుపాట్లను అధ్యయనం చేసి సరికొత్త మార్గదర్శకాలతో ప్రణాళికలు రూపొందించారు. అన్ని కసరత్తుల తర్వాత పథకం అమలు ప్రారంభమై.. విస్తృత అమలు వేగం పుంజుకుంటున్న సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. రెండేళ్లు పథకం ఊసే ఎత్తలేదు. చివరకు వైఎస్ఆర్ జలకళ పేరుతో ప్రారంభించినా.. ప్రజలకు చేరువ కాలేదు. టీడీపీ ప్రభుత్వంలో బాగా అమలవుతున్న పథకాన్ని నిర్వీర్యం చేయడంతో రైతులు ఆశలు వదులుకున్నారు.

ఉచితమన్నారు...అసలే ఇవ్వలేదు.!


వైసీపీ ప్రభుత్వం విద్యుత్తుతో నడిచే పంపుసెట్లు ఉచితంగా ఇస్తామంటూ హడావుడి చేసింది. అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత పథకం ప్రారంభించి, ప్రతి ఒక్క రైతు పొలంలో బోరుబావి తవ్వుతామని హామీ ఇచ్చింది. పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక బోరు మెషిన్, ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక మెషిన్ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పింది. అయితే మెషిన్లు కొనకుండా చివరకు ప్రైవేట్ బోరు యాజమానులకు పని అప్పగించారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వారు కూడా బోర్లు తవ్వకుండా నిలిపేశారు. కొంత మంది వైసీపీకి చెందిన వారికి మాత్రమే బోర్లు వేయించి మమ అనిపించారు. చివర్లో ఈ పథకాన్ని సంపూర్ణంగా అమలు చేశామని చెప్పుకొనేందుకు 2 వేల పైచిలుకు మోటార్లును కొనుగోలు చేశారు. ఒక్కరికి కూడా విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేయకుండానే మోటార్లు కొనుగోలు చేశారు. ఎన్నికల ముందు గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ చేశారు. దీంతో మోటార్ల కొనుగోలు, పంపిణీపై అనేక అనుమానాలు ఉన్నాయి. దీనిపై సమగ్రమైన విచారణ జరిగితే గానీ.. వాస్తవాలు వెలుగులోకి రావు.

బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఏ పార్టీ బాగుపడలేదు

» పొత్తు ప్రతిపాదనను గట్టిగా వ్యతిరేకిస్తా

» నక్సల్స్ మృతదేహాలు ఇవ్వకపోవడం దారుణం

» ఆపరేషన్ కగార్ పేరుతో బీజేపీ దుశ్చర్యలు: కవిత



మంచిర్యాల, మే 30(ఆంధ్రజ్యోతి): తనకంటూ ప్రత్యేక ఎజెండా ఏదీ లేదని, పెద్దాయనను(కేసీఆర్‌ను ఉద్దేశించి) ఎవరు ఏమన్నా ఊరుకునేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మంచిర్యాలలో ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నో ఆవేదనలు భరించలేక పార్టీని కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే పెద్దాయనకు లేఖ రాసినట్లు తెలిపారు. జాగృతి కమిటీలను వేస్తే రాద్ధాంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భాగ్యరెడ్డి వర్మ, పీవీ నర్సింహారావు వర్ధంతి కార్యక్రమాలను జాగృతి ఆధ్వర్యంలో చేశామని, అది కూడా బీఆర్ఎస్‌ను వ్యతిరేకించినట్లా అని ప్రశ్నించారు. తాను కేసీఆర్‌కు లేఖ రాయడం కొత్తేమీ కాదని, దానిని లీకు చేసినవారెవరో బయట పెట్టాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలేవీ బాగుపడలేదని చెప్పారు. తాను జైల్లో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌ను బీజేపీలో కలపాలనే అంశం ప్రస్తావనకు వస్తే అంగీకరించే ప్రసక్తే లేదని చెప్పానన్నారు. ఇప్పుడు ఆ ప్రయత్నం చేసినా వ్యతిరేకిస్తానని స్పష్టంచేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఆపరేషన్ కగార్ పేరుతో దుశ్చర్యలకు పాల్పడుతోందని కవిత ఆరోపించారు. మావోయిస్టు నేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే అంతిమ సంస్కారాల కోసం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని ఇచ్చే సంస్కారం కూడా లేని పార్టీ బీజేపీ అని వ్యాఖ్యానించారు.

కవిత బాయ్‌కాట్!

హైదరాబాద్: సొంత పార్టీపై ధిక్కార స్వరం వినిపిస్తున్న కేసీఆర్ తనయ కవితపై అధిష్ఠానం నిఘా పెట్టింది. ఆమె విషయంలో పార్టీ సీనియర్ నేతలు, కేడర్ సహా ఎవ్వరూ స్పందించవద్దని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. అఖరికి ఆమె పాల్గొనే ఏ కార్యక్రమంలోనూ పాల్గొనవద్దని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఒక విధంగా ఆమెను పార్టీ బాయ్‌కాట్ చేసింది. కవిత వ్యవహారంపై పార్టీ అధినేత కేసీఆర్ నొచ్చుకున్నట్లు పార్టీలోని ఓ సీనియర్ నేత వెల్లడించారు. అందుకే కవిత వ్యవహారం తెరపైకి వచ్చి వారం రోజులు అవుతున్నా ఆయన నోరు విప్పలేదంటున్నారు.

సీఎం సమయం ఇవ్వలేదనడం సరికాదు

» బొప్పరాజుపై రెవెన్యూ అధికారుల సంఘం ధ్వజం

విజయవాడ(గాంధీనగర్), మే 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఉద్యోగ సంఘాలకు అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు చేసిన వ్యాఖ్యలను ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు శుక్రవారం ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగ సంఘం నేత సూర్యనారాయణ, తమ సంఘం ప్రతినిధులు అనేకసార్లు సీఎంను కలిశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఎన్జీవో అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, బొప్పరాజు ఉద్యోగులకు నష్టం కలిగించారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సుమారు రూ.25వేల కోట్ల బకాయిలు పెట్టడానికి కారణం మీరుకాదా? అని ప్రశ్నించారు. గతంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, వారికి రావాల్సిన బకాయిల గురించి మాట్లాడకుండా ప్రభుత్వ పెద్దలు చెప్పింది విని వారికి భజన చేశారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన ఉద్యోగుల ప్రతి సమస్యనూ దశల వారీగా తీరుస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించడంపై రవీంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల బకాయిల విడుదల ఎప్పుడు?: బొప్పరాజు

అనకాపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సరెండర్ లీవ్‌ల డబ్బులు రూ.3వేల కోట్లు, బిల్లుల ఆమోదం పొందిన డీఏ డబ్బులు 1,300కోట్లు ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం ఇక్కడి రోటరీ క్లబ్ హాల్‌లో జిల్లా ఉద్యోగుల సంఘ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ సొమ్ము ఆస్పత్రులకు అందడం లేదని, ఉద్యోగులు పేరున్న ఆస్పత్రుల్లో వైద్యం పొందలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. విశాఖకు చెందిన త్రినాథ్ అనే ఉద్యోగి ప్రైవేటు ఆస్పత్రిలో రూ.5లక్షలు ఖర్చుచేసి శస్త్ర చికిత్స చేయించుకుంటే ప్రభుత్వం రూ.90వేలు మాత్రమే విడుదల చేసిందన్నారు. ఇంత పెద్దమొత్తంలో బకాయిలుంటే.. ఉద్యోగులు మాట్లాడకూడదని అనడం సబబు కాదన్నారు. ఈ విషయంపై తమ సంఘం తరఫున ప్రభుత్వానికి లేఖ ఇచ్చామన్నారు.

13 డీసీఎంఎస్‌లకు పర్సన్‌ఇన్‌చార్జిల నియామకం

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల కింద ఉన్న 13 జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లకు అధికారేతర పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల స్థానంలో జూన్ 26వరకు అధికారేతర పర్సన్ ఇన్‌చార్జిలు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఖరీఫ్ బీమాకు రాష్ట్ర వాటా మంజూరు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంటల బీమా పథకాన్ని సకాలంలో అమలుకోసం ముందస్తు ప్రీమియం చెల్లించడానికి రూ.132.58కోట్ల మంజూరుకు వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పన్నుల శాఖ ఇన్‌చార్జి చీఫ్ కమిషనర్‌గా సౌమ్య

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ఇన్‌చార్జి ప్రధాన కమిషనర్‌గా ఐఆర్ఎస్ అధికారిణి నూతలపాటి సౌమ్య నియమితులయ్యారు. ప్రధాన కమిషనర్ అహ్మద్‌బాబు జూన్ 1 నుంచి పది రోజులపాటు సెలవులో వెళ్తుండటంతో.. సౌమ్యకు ఇన్‌చార్జి చీఫ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కడప ఎస్పీపై కోర్టు ధిక్కరణ పిటిషన్

కోర్టు ధిక్కరణ కేసులో వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. తనకు 1 ప్లస్ 1 భద్రత కల్పించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయడం లేదంటూ కడప జిల్లా, వేముల గ్రామానికి చెందిన లింగాల రామలింగారెడ్డి ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో వివరణ ఇవ్వాలని ఎస్పీని ఆదేశించింది. విచారణను జూన్ 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.


ఒకే షిఫ్టులో నీట్-పీజీ ఎంట్రన్స్



2 షిఫ్టులంటే ఇబ్బంది పెట్టడమే

- ఈ దేశంలో పరీక్ష కేంద్రాలు లేవా?
- విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు
- కీలక తీర్పు ఇచ్చిన త్రిసభ్య ధర్మాసనం

న్యూఢిల్లీ, మే 30: వైద్య విద్యార్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షను ఒక షిఫ్టులోనే నిర్వహించాలని సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. రెండు షిఫ్టులుగా విద్యార్థులను విభజించి ప్రవేశ పరీక్షను నిర్వహించడం అంటే.. వారిని ఇబ్బంది పెట్టడమేనని.. ప్రశ్నల క్లిష్టత మారి.. వారిని నష్టపరచడమే అవుతుందని స్పష్టం చేసింది. ఇది ఒకరకంగా ఏకపక్ష నిర్ణయానికి దారి తీసే ప్రమాదం ఉంటుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు నీట్-పీజీ-2025 ప్రవేశ పరీక్షకు సంబంధించి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలో త్రిసభ్య సభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. రెండు షిఫ్టులుగా నిర్వహిస్తే.. ఏ రెండు ప్రశ్న పత్రాలు ఒకే విధంగా ఉండవని, తద్వారా విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని ధర్మాసనం పేర్కొంది. ఒకే షిఫ్టులో ప్రవేశ పరీక్షను నిర్వహించడం ద్వారా పారదర్శకతకు, నిర్వహణకు మరింత పెద్దపీట వేసినట్టు అవుతుందని తెలిపింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని నీట్‌ను ఆదేశించింది. నీట్-పీజీ-2025 ప్రవేశ పరీక్షను రెండు షిఫ్టుల్లో నిర్వహించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 2,42,678 మంది దరఖాస్తు చేసుకున్నారని, పైగా ఒకే నగరంలో నిర్వహించడం లేదని, పైగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో రెండు షిఫ్టులుగా నిర్వహిస్తామన్న వాదనను తాము అంగీకరించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు జూన్ 15వ తేదీ వరకు గడువు ఉందని.. ఈలోగా ఏర్పాట్లు చేసుకునేందుకు చాలానే సమయం ఉందని పేర్కొంది. మరిన్ని కేంద్రాలను వెతికి.. సొమ్ము ఖర్చు చేస్తే ఏర్పాట్లు చేయొచ్చని, కానీ మీరు(నీట్ నిర్వాహకులు) సొమ్ము ఖర్చు చేసేందుకు, కనీసం ప్రయత్నం చేసేందుకు కూడా ఇష్టపడడం లేదని అర్థమవుతోందని వ్యాఖ్యానించింది. "ఒకే షిఫ్టులో పరీక్ష నిర్వహించమంటే కనీసం మీరు ఆలోచన కూడా చేయడం లేదు. పైగా అదేదో జరుగుతుంది. ఇదేదో జరుగుతుంది.. అంటూ.. ఏడాది పొడవునా ఏవో కథలు చెప్పి బెదిరిస్తున్నారు. ఇవేమీ కుదరవు. ముందు మీరు సంసిద్ధులు అవ్వండి. రెండు షిఫ్టులు వద్దు. ఒకే షిఫ్టులో నిర్వహించండి. ఈ దేశంలో పరీక్ష కేంద్రాలకు కొరత రాలేదు." అని నీట్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, నీట్ తరఫు వాదనలు వినిపించిన న్యాయవాది.. ఇది గతంలో సుప్రీంకోర్టు విధించిన సమయ పాలనకు విఘాతం చేకూరుస్తుందని పేర్కొన్నారు. అంతేకాదు.. ఒకే షిఫ్టులో పరీక్ష నిర్వహిస్తే మాల్ ప్రాక్టీస్‌కు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే, ఈ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. కౌన్సెలింగ్‌కు సంబంధించి అవసరమైతే మరింత సమయం ఇస్తామని, దానికి ప్రత్యేకంగా పిటిషన్ వేసుకోవచ్చని తెలిపింది. ఇదే సమయంలో పిటిషనర్లు పరీక్ష ఫలితాలు వెల్లడించిన తర్వాత ఎన్‌బీఈఎంఎస్ వెబ్‌సైట్‌లో సమాధాన పత్రాలు, కీని వెల్లడించేలా ఆదేశించాలని కోరారు. అయితే.. దీనిపై ప్రత్యేకంగా విచారించాల్సి ఉందంటూ ఈ పిటిషన్‌పై విచారణను జూన్ 14కు వాయిదా వేసింది.



శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీరు

శ్రీశైలానికి వరద

- నెల రోజులు ముందుగానే నీటి ప్రవాహం

నంద్యాల, మే 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మొదలైంది. ఏటా జూన్ తర్వాత జలాశయానికి వరద వచ్చేది. ఈసారి నెల రోజుల ముందుగానే వచ్చి చేరుతోంది. 3 రోజులుగా ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో శుక్రవారం సాయంత్రం 6 గంటలకి జూరాల, సుంకేసుల నుంచి 64,996 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేశారు. జూరాల స్పిల్‌వే నుంచి 49,764, విద్యుత్ ఉత్పాదన ద్వారా 5,451, సుంకేసుల నుంచి 8,824 క్యూసెక్కులు వస్తోంది. సాయంత్రానికి శ్రీశైలం జలాశయంలో 39.55 టీఎంసీల నీటి నిల్వ చేరగా, నీటి మట్టం 818.20 అడుగులకు చేరుకుంది.

ఇత్తడి చెంబును.. అక్షయపాత్రగా నమ్మించి..!

- రూ.25 లక్షలకు బేరం.. రూ.5లక్షలు అడ్వాన్సు
- స్నేహితులనే బురిడీ కొట్టించిన ప్రధాన నిందితుడు

శ్రీకాకుళం, మే 30(ఆంధ్రజ్యోతి): ఇత్తడి చెంబును మహిమ గల అక్షయపాత్రగా అని నమ్మించి.. రూ. 25 లక్షలకు టోకరా వేసేందుకు యత్నించిన ముఠాను.. శ్రీకాకుళం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. నిందితులను శుక్రవారం జిల్లా పోలీసుల కార్యాలయంలో ప్రవేశపెట్టారు. అదనపు ఎస్పీ కేవీ రమణ, శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద కథనం మేరకు.. ప్రధాన నిందితుడు, విశాఖపట్నంలోని మధురవాడకు చెందిన పచ్చితల రవిశంకర్.. స్నేహితులతో కలిసి సులభంగా డబ్బు సంపాదించాలని భావించాడు. చివరికి స్నేహితులతో కలసి వారినే ముంచేందుకు 'అక్షయపాత్ర' ఆలోచన చేశాడు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొచ్చెర్ల ప్రాంతానికి చెందిన పూని భద్రయ్య వద్ద పురాతన వస్తువు రైస్ పుల్లింగ్ అక్షయపాత్ర(ఇత్తడి చెంబు) ఉంది. దానికి మహిమలున్నాయని తన స్నేహితులకు చెప్పి.. ఎలా అయినా దానిని కొనుగోలు చేసుకుందామంటూ ఒప్పించాడు.చెంబును రూ.25 లక్షలకు బేరం కుదిర్చాడు. ఇందులో అడ్వాన్సుగా రూ.5 లక్షలు ఇచ్చేందుకు స్నేహితులు రుద్రరాజు వెంకటరంగరాజు, రౌతు కనకరాజు(పెదగంట్యాడ), నక్కిన రఘునాథరావు (నరసన్నపేట), గట్టిక్కల మురళీకృష్ణ(తిరుపతి జిల్లా), గరిక శ్రీను(హైదరాబాద్), కొండ వెంకటనాగ సత్యనారాయణ(పిఠాపురం)లను ఒప్పించాడు. గురువారం సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస ప్రాంతంలో భద్రయ్యకు రూ.5లక్షలు ఇస్తుండగా, పోలీసులు వల పన్ని మొత్తం అందరినీ పట్టుకున్నారు.

కరోనాతో భద్రం..!

(మొదటి పేజీ తరువాయి)

పడుతున్నారు. అయితే గతంలో మాదిరిగా ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడం, ఆయాసం, తీవ్రంగా నీరసించిపోవడం వంటి లక్షణాలు లేవు. దీంతో వైద్యులు ఎక్కువ మందికి మందులిచ్చి పంపించి వేస్తున్నారు. జ్వరం ఎక్కువగా ఉన్న వారిని మాత్రం 24 గంటల పర్యవేక్షణలో ఉంచుతున్నారు. అంతేతప్ప ఆస్పత్రుల్లో చేరాల్సిన అవసరం రావడం లేదు. అలా అని నిర్లక్ష్యంగా ఉండడం సరి కాదని వైద్యులు చెబుతున్నారు. కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారో ఇప్పుడు కూడా అలాగే ఉండాలని సూచిస్తున్నారు. ప్రతిఒక్కరూ కచ్చితంగా మాస్క్ ధరించాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, సామాజిక దూరం పాటించాలని చెబుతున్నారు. అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని, ఫంక్షన్లకు హాజరు కావొద్దని సూచిస్తున్నారు. చిన్నపిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్న వారు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

ఒమైక్రాన్ వేరియంట్...

కొవిడ్ ప్రారంభం దశలో డెల్టా వేరియంట్ ఎక్కువగా కనిపించింది. దీనివల్లే ఫస్ట్, సెకండ్ వేవ్‌ల్లో భారీగా కేసులు నమోదయ్యాయి. ఆక్సిజన్ లెవెల్స్ తగ్గి, తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడడంతో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు డెల్టా వేరియంట్ ఎక్కడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఒమైక్రాన్ వేరియంట్ మాత్రమే కనిపిస్తోంది. దీనివల్ల స్వల్ప జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో కేసులు నమోదవుతున్నాయి. మరోవైపు ప్రస్తుతం కొవిడ్ ఎండెమిక్ దశకు వచ్చేసింది. పాండమిక్ (మహమ్మారి)గా ప్రకటించిన వ్యాధి.. క్రమంగా ప్రభావం కోల్పోవడాన్నే ఎండెమిక్ దశ అంటా రు. ఇది ఎంతకాలమైనా కొనసాగవచ్చు. కానీ.. ప్రభావం మాత్రం తక్కువే ఉంటుంది. పైగా ఒమైక్రాన్ వేరియంట్‌కు సంబంధించిన యాంటీబాడీస్ శరీరంలో ఇప్పటికే ఏర్పడి ఉంటాయి. కాబట్టి కేసులు భారీగా నమోదయ్యే పరిస్థితి ఉండదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఆస్పత్రుల్లో బెడ్స్ సిద్ధం..

కరోనా తీవ్రత తక్కువగానే ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందు జాగ్రత్తగా పూర్తి ఏర్పాట్లు చేస్తోంది. దేనికైనా సిద్ధంగా ఉండాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ప్రతి బోధనాస్పత్రిలోనూ పది పడకలతో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. ఎక్కడ కొవిడ్ కేసు నమోదైనా వెంటనే వారిని ఐసోలేషన్ వార్డులకు తరలించి, వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశాఖ ప్రత్యేక పర్యవేక్షణ టీమ్‌లను కూడా ఏర్పాటు చేసింది. అత్యవసర పరిస్థితి వస్తే ఇబ్బంది లేకుండా మందులు, పీపీఈ కిట్లు, మాస్కులతో పాటు ఆక్సిజన్‌ను కూడా సిద్ధం చేసుకుంటున్నారు. బాధితుల నుంచి శాంపిల్స్ సేకరించి.. వేరియంట్‌ను తెలుసుకునేందుకు సీక్వెన్సింగ్ టెస్టులు చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేసిన కొవిడ్ టెస్టులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదు. కేవలం బోధనాస్పత్రుల్లో ఉన్న ఐసీఎంఆర్ ల్యాబ్స్‌లో మాత్రమే కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అక్కడ పాజిటివ్‌గా తేలితేనే ప్రభుత్వం కొవిడ్ కేసుగా నిర్ధారిస్తోంది. కాబట్టి లక్షణాలున్న వారు బోధనాస్పత్రుల్లోనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది.



మరో మూడు కరోనా కేసులు

గుంటూరు మెడికల్, విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడు కరోనా కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లా తెనాలి, ఉండవల్లిలో ఇద్దరికి కరోనా సోకినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మీ శుక్రవారం ప్రకటించారు. జిల్లాలో కొవిడ్ భయం నేపథ్యంలో జిల్లాలో రిటైల్ మెడికల్ దుకాణాల్లో మాస్కులు, శానిటైజర్ల అమ్మకాలు పెరిగాయి. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కొవిడ్ రోగుల కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి లేఖ రాశారు.

హౌస్‌సర్జన్‌కు కరోనా.. 24 గంటల్లో మళ్లీ నెగిటివ్

విజయవాడలో తొలి కరోనా కేసు నమోదైంది. ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న మహిళా హౌస్‌సర్జన్‌లో కరోనా లక్షణాలు బయటపడ్డాయి. జార్ఖండ్‌కు చెందిన ఆమె సిద్ధార్థ వైద్య కళాశాలలో మైక్రోబయాలజీ చదివి.. ప్రస్తుతం ఇక్కడే హౌస్‌సర్జన్‌గా పనిచేస్తూ హాస్టల్‌లో ఉంటోంది. కొద్దిరోజుల క్రితం ఆమె జార్ఖండ్ వెళ్లి.. 27వ తేదీ రాత్రి విజయవాడకు వచ్చింది. 28న ఆమెకు జ్వరం రావడంతో పరీక్షలు చేయగా కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో వైద్యులు ఆమెను ఐసోలేషన్ వార్డుకు తరలించారు. శుక్రవారం ఆమెకు మళ్లీ పరీక్ష చేయగా నెగిటివ్ వచ్చిందని వైద్యులు తెలిపారు.

ప్రస్తుతం ప్రమాదమేమీ లేదు



ప్రస్తుతం కొవిడ్ ప్రమాదకర స్థాయిలో లేదు. రెండు మూడు కేసులు పరీక్షిస్తే ఒమైక్రాన్ వేరియంట్‌గా నిర్ధారణ అయింది. ఈ వేరియంట్ వల్ల పెద్ద ప్రమాదమేమీ లేదు. అయినా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. బోధనాస్పత్రుల్లో ఐసోలేషన్ వార్డుతో పాటు మందులు, పీపీఈ కిట్స్, ఆక్సిజన్ సిద్ధం చేసుకుంటున్నాం. రాష్ట్రంలో కొవిడ్ కేసులపై ప్రత్యేక నిఘా ఉంచాం

\- డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం; డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్

నిర్లక్ష్యంగా ఉండొద్దు



కొవిడ్ కొత్త వేరియంట్ పెద్ద ప్రమాదకరంగా లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో నమోదవుతున్న కేసుల్లో సాధారణ లక్షణాలు మాత్రమే ఉంటున్నాయి. బాధితులు నాలుగైదు రోజుల్లో కోలుకుంటున్నారు. కొవిడ్ లక్షణాలున్న వారు కచ్చితంగా హోంఐసోలేషన్‌లో ఉండాలి. ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా కొవిడ్ మార్గదర్శకాలు పాటించాలి. మాస్క్ ధరించడం, పరిశుభ్రంగా ఉండడం, సామాజిక దూరం పాటించడం చాలా ముఖ్యం.

\- డాక్టర్ పద్మ మొవ్వ; మేనేజింగ్ డైరెక్టర్, సెంటినీ హాస్పిటల్స్

జెత్వానీ కేసులో పీఎస్ఆర్‌కు బెయిల్

- పలు షరతులతో మంజూరు చేసిన హైకోర్టు
- కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడానికి వీల్లేదు
- కోర్టులో పాస్‌పోర్టు సరెండర్ చేయాలి
- కేసు విషయంలో ఎవర్నీ బెదిరించకూడదు
- తీర్పు ఉత్తర్వుల్లో న్యాయమూర్తి స్పష్టీకరణ

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు(ఏ2)కు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. విజయవాడ మూడవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు సంతృప్తి మేరకు రూ. 20 వేలతో రెండు పూచికత్తులు సమర్పించాలని ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లడానికి వీల్లేదని, విజయవాడ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని స్పష్టం చేసింది. ఆ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసేవరకు ప్రతినెల రెండో శనివారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని పేర్కొంది. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, కోరినప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని తేల్చిచెప్పింది. కేసు విషయంలో ఎవర్నీ ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేయడానికి, బెదిరించడానికి వీల్లేదని పేర్కొంది. కేసు గురించి మీడియా వద్ద మాట్లాడవద్దని, ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని చెప్పింది. ఇదే తరహా నేరాలకు పాల్పడడానికి వీల్లేదంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు ఇవ్వగా, తీర్పు ప్రతి శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. జెత్వానీ కేసులో ఈ ఏడాది ఏప్రిల్ 22న పీఎస్ఆర్ ఆంజనేయులను సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. విజయవాడ కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయన బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. తీర్పు ప్రతిలో న్యాయమూర్తి ఏమన్నారంటే.. "పిటిషనర్ సస్పెన్షన్‌లో ఉన్నారు. కేసులో ఇతర నిందితులకు కోర్టు ముందస్తు బెయిల్ ఇస్తూ.. ఈ కేసు తప్పుడు కేసా? కాదా? అని తేల్చే వ్యవహారం సంబంధిత కాంపిటెంట్ కోర్టు పరిధిలోనిదని చెప్పింది. పోలీసు అధికారులను ప్రాసిక్యూట్ చేయడం సీఆర్‌పీసీ సెక్షన్ 195 ప్రకారం నిషేధం ఉందని అందులో పేర్కొంది. ఇక పిటిషనర్ పోలీస్ కస్టడీ ముగిసింది. సుమారు 50 మందికిపైగా సాక్షులను విచారించారు. దర్యాప్తు పురోగతి, సెక్షన్ 195 తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని కఠిన షరతులతో బెయిల్ మంజూరు చేస్తున్నాం" అని పేర్కొన్నారు.

'మద్యం'లో దొంగాట!

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ జిల్లా జైలు నుంచి శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం వీరిని సిట్ కార్యాలయానికి తరలించి వేర్వేరుగా, కలిపి విచారించారు. ముందుగా ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పను విచారించారు. మొత్తం డబ్బులు వారికిచ్చినట్టు రాజ్ కసిరెడ్డి వాంగ్మూలం ఇచ్చాడని, ఆ డబ్బంతా ఎక్కడుందని ప్రశ్నించారు. దీనికి ఈ ముగ్గురూ ఒకే సమాధానం చెప్పారు. కసిరెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలని, అతను తమకేమీ ఇవ్వలేదని వివరించారు. డబ్బులు ఇచ్చినట్టుగా రాజ్ చెప్పిన ఆధారాలు తమవద్ద ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. తర్వాత నలుగురినీ కలిపి విచారించారు. వారికి డబ్బులిచ్చినట్టు వాంగ్మూలం ఇవ్వడంపై రాజ్ కసిరెడ్డిని ప్రశ్నించారు. అయితే కస్టడీ విచారణలో కసిరెడ్డి నాలుక మడతేశాడు. తాను ఆ విధంగా వాంగ్మూలం ఇవ్వలేదని బుకాయించడంతో అధికారులు మిగిలిన ముగ్గురినీ ప్రశ్నించారు. మద్యం విధానం రూపకల్పనకు ముందు హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశాల్లో ఎవరు పాల్గొన్నారు? ఎక్కడ నిర్వహించారన్న దానికి సంబంధించిన అన్ని ఆధారాలు తమవద్ద ఉన్నాయని అధికారులు చెప్పడంతో నిందితులకు గొంతులో వెలక్కాయపడినట్టయింది. ఈ కేసులో మరో నిందితుడు బూనేటి చాణక్య ఇచ్చిన వాంగ్మూలాన్ని ముందుపెట్టి ప్రశ్నలు సంధించడంతో ముగ్గురూ నీళ్లు నమలడం మొదలుపెట్టారు. మొదటిరోజు సిట్ అధికారులు మొత్తం 100 ప్రశ్నల వరకు సంధించినట్టు తెలిసింది. విచారణ అనంతరం వారికి వైద్య పరీక్షలు చేయించి తిరిగి జిల్లా జైలుకు అప్పగించారు.



వల్లభనేని వంశీని శుక్రవారం రాత్రి విజయవాడలోని జైలు నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ప్రైవేట్ ఆస్పత్రిలో వంశీకి వైద్యం

- హైకోర్టు ఆదేశాలతో తరలించిన జైలు సిబ్బంది

విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయనను విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో జైలు అధికారులు చేర్పించారు. ముదునూరు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వంశీ అరెస్టయి జైలు పాలైన విషయం తెలిసిందే. ఆ తర్వాత వరుసగా ఆయనపై పీటీ వారెంట్లు దాఖలయ్యాయి. టీడీపీ కార్యాలయంపై దాడి, గన్నవరంలో చెరువుల తవ్వకాలు, భూకబ్జా కేసుల్లో వంశీకి కోర్టులు బెయిల్ మంజూరు చేశాయి. గన్నవరం, బాపులపాడు మండలాల్లో గ్రావెల్ తవ్వకాలకు సంబంధించిన పీటీ వారెంట్ పెండింగ్‌లో ఉంది. ఇక నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో నూజివీడు కోర్టు బెయిల్‌ను తిరస్కరించింది. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారణలో ఉండగానే తనకు అనారోగ్యంగా ఉందని వంశీ మరో పిటిషన్ దాఖలు చేశారు. వంశీని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీనితో ఆయనను జిల్లా జైలు నుంచి ఎస్కార్ట్‌తో తీసుకెళ్లి ఆయుష్ ఆసుపత్రిలో చేర్చారు.

ఇంటింటికి రేషన్ వ్యవస్థ రద్దు జీవోపై పిటిషన్

- కౌంటర్ దాఖలు చేయాలని పౌరసరఫరాల శాఖకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 30(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి రేషన్ పంపిణీ వ్యవస్థను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న జారీ చేసిన జీవో 5ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వ నిర్ణయంతో వాహన ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోతున్నారని తాము దాఖలు చేసిన పిటిషన్‌లో రాజమహేంద్రవరానికి చెందిన తానేటి రామకృష్ణ, మంగళగిరి ధనంజయకుమార్, గుట్టంరాజు సుచాన్ సింగ్, జి.త్రినాథ్ పేర్కొన్నారు. ఈ వ్యాజ్యాన్ని హైకోర్టు గురువారం లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పౌరసరఫరాలశాఖను ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న పౌరసరఫరాలశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ఉత్తర్వులు ఇచ్చారు.

ఆ కంపెనీ నాదే!





(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఆమే తమ యజమాని అని.. బోర్డుకు ఎప్పుడో జగన్ రాజీనామా చేశారని సరస్వతి కంపెనీ యాజమాన్యం కూడా తెలిపింది. సరస్వతి పవర్‌లో షేర్ల బదిలీని నిలిపేయాలని.. తమ వాటాను పునరుద్ధరించాలని కోరుతూ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ.. ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. దానిపై ఈ నెల 7న జరిగిన విచారణ సందర్భంగా అటు జగన్, ఆయన తల్లి, సంస్థ తరఫు న్యాయవాదులు పూర్తి స్థాయి వాదనలు వినిపించారు. లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు విచారణను ట్రైబ్యునల్ 30వ తేదీకి వాయిదావేసింది. శుక్రవారం బెంచ్‌లో ఒక సభ్యుడు సెలవులో ఉండడంతో తీర్పును రిజర్వు చేయలేదు. తదుపరి విచారణను జూలై 11కి వాయిదావేసింది.

ఇది తండ్రి సంపాదించిన ఆస్తి కాదు..: జగన్

సరస్వతి పవర్ తమ తండ్రి సంపాదించిన ఆస్తి కాదని జగన్ తన వాదనల్లో తెలిపారు. 'చెల్లి షర్మిలపై ప్రేమ, అనురాగంతో ఆ కంపెనీలో మాకు ఉన్న 51 శాతం వాటా ఈడీ కేసులు ముగిసిన తర్వాత ఇద్దామనుకున్నాం. చెల్లి నాపై అనుమానంతో తల్లిపై ఒత్తిడి తెచ్చి వాటాలు బదిలీ చేసుకోవాలని చూస్తోంది. ఎన్నికల సందర్భంగా వేరే పార్టీలో చేరి నాపై తీవ్ర విమర్శలు చేసింది. అందుకే ఆమెపై ప్రేమానురాగాలు పోయాయి. ఆమెకు సరస్వతి పవర్‌లో వాటా ఇచ్చే ఉద్దేశం లేకపోవడంతో ఎంవోయూ, గిఫ్ట్ డీడ్ రద్దు చేసుకున్నాం. ఇది నా స్వార్జితం.. నేనే దాతను కాబట్టి ఏకపక్షంగా ఎంవోయూ, గిఫ్ట్ డీడ్ రద్దు చేసే హక్కు ఉంటుంది. 51 శాతం షేర్ల సర్టిఫికెట్లు నావద్దే ఉన్నాయి. బహుమతి భౌతికంగా ఇవ్వనప్పుడు.. హక్కులు ఎలా బదిలీ అవుతాయి? జూలై 6వ తేదీ ఇండెమ్నిటీతో జూలై 2న బోర్డు నిర్ణయం తీసుకుందని తప్పుడు పత్రాలు సృష్టించి.. తల్లి, చెల్లి మోసం చేసి నా వాటా బదిలీ చేసుకున్నారు' అని పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారమే షేర్ల బదిలీ: విజయలక్ష్మి

'జగన్‌కు చెల్లిపై ప్రేమ తగ్గిందే తప్ప తల్లిగా నాపై ప్రేమ తగ్గిందని చెప్పలేదు. కంపెనీలో 99.89 శాతం వాటా నా వద్దే ఉంది. వంద శాతం కంపెనీ నాదే. కుటుంబ వ్యవహారాన్ని అనవసరంగా కోర్టుకు లాగారు. వివాదాస్పద అంశాలు ఉన్న ఈ వివాదాన్ని తేల్చాల్సింది ఎన్‌సీఎల్‌టీ కాదు.. సివిల్ కోర్టు. నిబంధనల ప్రకారమే నా పేరుపై షేర్ల బదిలీ జరిగింది. ఇందులో ఎలాంటి మోసం, కుట్ర లేవు. నా కొడుకు జగన్, నేను ఒకే ఇంట్లో ఉంటున్నాం. అలాంటప్పుడు షేర్ సర్టిఫికెట్లు నా వద్ద లేవని ఎలా అంటారు? గిఫ్ట్ డీడ్, ఇతర అన్ని పత్రాలు పరిశీలించి అన్ని అంశాలపై కంపెనీ సంతృప్తి చెందిన తర్వాతే బదిలీ నమోదు జరిగింది' అని విజయలక్ష్మి తన వాదనల్లో పేర్కొన్నారు. ఆమే తమ కంపెనీకి పూర్తి స్థాయి యజమాని అని సరస్వతి పవర్ వెల్లడించింది. 'షేర్ల బదిలీ చట్టబద్ధంగా జరిగింది. బ్యాక్ డేట్‌తో పత్రాలు సృష్టించారనడం సమంజసం కాదు. గిఫ్ట్ డీడ్, ఎంవోయూ తర్వాత జగన్ ఎప్పుడో సరస్వతి పవర్ బోర్డుకు రాజీనామా చేశారు. వాటాలు వదులుకున్న తర్వాత కంపెనీకి సంబంధించినంత వరకు ఆయన సంబంధం లేని వ్యక్తి. మా కంపెనీ అంతర్గత వ్యవహారాలను ప్రశ్నించడానికి ఆయనెవరు' అని ప్రశ్నించింది. అసలీ వ్యవహారంతో తనకు సంబంధమే లేదని.. కంపెనీలో తనకెలాంటి వాటా లేదని.. తనను ప్రతివాదుల జాబితా నుంచి తొలగించాలని ట్రైబ్యునల్‌ను షర్మిల అభ్యర్థించారు.

అధిక వడ్డీ ఆశ చూపి.. రూ.150 కోట్లకు టోపీ

- 16 నెలల్లో సొమ్ము డబుల్ అంటూ 1,530 మంది నుంచి డిపాజిట్లు వసూలు
- తిరిగి చెల్లించకుండా చేతులెత్తేసిన పెంగ్విన్ సెక్యూరిటీస్ సర్వీసెస్ సంస్థ

జీడిమెట్ల, మే 30(ఆంధ్రజ్యోతి): లక్ష పెట్టుబడితో.. 16 నెలల్లో రెండింతలు ఇస్తామని ఆశ చూపారు. డిపాజిట్లు చెల్లించినవారికి బాండ్ రాసిచ్చారు. కొందరికి అధికంగా డబ్బులిచ్చి నమ్మించారు. సుమారు 1,530 మంది నుంచి రూ.150 కోట్లకుపైగా వసూ లు చేశారు. ఆ తర్వాత బోర్డు తిప్పేశారు. హైదరాబాద్ శివార్లలోని జీడిమెట్లలో ఈ భారీ మోసం వెలుగు చూసింది. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. జీడిమెట్ల సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర కు చెందిన వడ్డైగర్ బాలాజీ(35), తండ్లే చౌదరి స్వాతి(30) 2023లో చింతల్ సూర్యానగర్‌లోని రిడ్జ్ టవర్స్‌లో పెంగ్విన్ సెక్యూరిటీస్ సర్వీసెస్ పేరిట సంస్థను నిర్వహిస్తున్నారు. అంతకుముందు ఎల్‌బీ నగర్, అత్తాపూర్‌లలోనూ కార్యాలయాలు పెట్టారు. రూ.లక్ష డిపాజిట్ చేస్తే 16 నెలల్లో రూ.2 లక్షలు ఇస్తామని ఆశ చూపారు. షేర్ మార్కెట్లో పెట్టి భారీ లాభాలు ఆర్జిస్తామని, అందువల్లే అధిక వడ్డీ ఇస్తున్నామని నమ్మించారు. డబ్బులు కట్టేవారికి బాండ్ పేపర్ కూడా రాసిచ్చేవారు. 2 తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలవారు అధిక వడ్డీ వస్తుందన్న ఆశతో ఈ సంస్థలో డబ్బులు డిపాజిట్ చేశారు. కొందరు రూ.కోటి వరకు కూడా కట్టారు. వారిలో కొందరికి సంస్థ నిర్వాహకులు అధిక వడ్డీ చెల్లించారు. ఇది చూసి కొందరు తమ బంధువులను, స్నేహితులను ఈ సంస్థలో చేర్పించి, డబ్బులు కట్టించారు. 16 నెలల గడువు పూర్తయినవారు గత 2 నెలలుగా కార్యాలయానికి వస్తున్నారు. నిర్వాహకులు ఏదో ఓ కారణం చెబుతూ తిప్పుకుంటూ వస్తున్నారు. 30న(శుక్రవారం) డబ్బులు ఇస్తామని కొందరికి చెప్పడంతో.. సుమారు 100 మంది వరకు కార్యాలయానికి వచ్చారు. కానీ కార్యాలయం మూసివేయడంతో మోసపోయామని గుర్తించి, పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు నిర్వాహకురాలు స్వాతిని అదుపులోకి తీసుకున్నారు. చింతల్‌లోని కార్యాలయాన్ని సీజ్ చేశారు. బాలాజీ పరారీలో ఉన్నాడు.

పాడె కట్టిన వ్యక్తికి లక్షల్లో నగదు!

- పల్నాడు జంట హత్యల కేసులో విస్తుపోయే నిజాలు
- పోలీసుల అదుపులో ముగ్గురు వైసీపీ నేతలు?

మాచర్లటౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో సంచలనం రేపిన జంట హత్యల కేసుల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి!. మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టీడీపీకి చెందిన జెవిశెట్టి వెంకటేశ్వర్లు, అతడి సోదరుడు కోటేశ్వరరావు హత్య జరిగిన తీరుపై పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయిన తీరును పరిశీలిస్తే ఈ హత్యలో అనేక మంది ఇందులో ఇన్వాల్వ్ అయినట్లు తెలుస్తోంది. నిందితుల్లో ఏ2గా ఉన్న వ్యక్తి.. జంట హత్యలకు నెల రోజుల ముందే జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులతో విభేదించి టీడీపీ వ్యవహారాలకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. సమీప గ్రామమైన కండ్లకుంట గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన ముగ్గురు కీలక నేతలతో సన్నిహితంగా మెలిగినట్లు తెలుస్తోంది. ఒక నాయకుడి ఇంట్లో పార్టీ కూడా చేసుకున్నట్లు గుర్తించారు. మరో ఇద్దరు నేతలతో ఫోన్‌లో నిరంతరం చాటింగ్ జరిపినట్లు తెలుస్తోంది. ఆ నేతలే ఈ హత్యలో పాల్గొన్న వ్యక్తులకు నగదును సమకూర్చి వేర్వేరు మార్గాల్లో లక్షలాది రూపాయలను అకౌంట్లలో జమ చేసి ఉంటారన్న కోణంలో పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు. హతుల అంతిమయాత్ర సమయంలో పాడె కట్టిన ఓ వ్యక్తి అకౌంట్‌లో కూడా లక్షల కొద్దీ నగదు జమ అయినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. దీని వెనుక అసలు సూత్రధారులను గుర్తించేందుకు మరింత లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. 'మాకిది చేసి పెట్టండి.. మీకు మేము రాజకీయంగానే కాకుండా ఆర్థికంగా కూడా ఉపయోగపడతాం' అని నమ్మించి కొంత మందిని ఈ ఉచ్చులోకి దించి వారి అకౌంట్లలోకి నగదును జమ చేసినట్లుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కండ్లకుంట గ్రామానికి చెందిన ముగ్గురు వైసీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.